తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
తాడేపల్లిగూడెం
epaper.vaartha.com WWW.VAARTHA.COM
: fb.com/vaartha Digital
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
30-8-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 209 పేజీలు: 10+4 వెల: 6.50



వాకిలి
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


నేతాజీ అస్థికలను భారత్‌కు రప్పించాలి: బోస్ కుమార్తె
5లో

పాట్నాలో బిజెపి, కాంగ్రెస్ బాహా బాహీ


శుక్రవారం పోలవరం వద్ద గోదావరి ఉధృతి


విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు


చందాపురం రోడ్డులో కాజ్‌వేపై పొంగుతున్న నల్లవాగు

## వరద బీభత్సం
# భారీగా పంట నష్టం

### ఇంకా ముంపులో కాజ్‌వేలు, రవాణా బంద్
### ప్రకాశం బ్యారేజ్ వద్ద ప్రమాద హెచ్చరిక ఉపసంహారణ
### వాగుల నుంచి వరదనీటితో దెబ్బతిన్న పంటలు
### తెలంగాణ, గుంటూరు మధ్య స్తంభించిన రాకపోకలు

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు నదులు,ఉపనదులు, వాగులు పొంగిపొర్లు తున్నాయి.ప్రస్తుతానికి వానలు తెరపి ఇచ్చినా అక్కడ కురుస్తున్నాయి. గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలు అనుహ్యంగా పంటలు దెబ్బతిన్నాయి.పెసర, మినుము, కంది,పూత దశలో ఉన్న మిర్చి,పత్తి, వేరుశనగా తుడిచిపెట్టుకుని పోయాయి. పొలాల్లో వాన నీరు ఇంకా నిలిచివుంది. ఎన్టీఆర్ ,కృష్ణా,గుంటూరు జిల్లాలో వర్షం నీరును తొలి గించే పరిస్థితి లేకుండా పోయింది.వాగుల నుంచి నీరు ఇంకా పొలాల్లో చేరుతుంది. కృష్ణానది ఎగువ దిగువ వరద నీరుచేరి పంట నష్టం వాటి ల్లింది.విజయవాడ-హైదారాబాద్ జాతీయ రహదారిలో వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి.ఈ క్రమంలో జాతీయ రహదారుల అధికృత సంస్థ యుద్ధ ప్రతిపాదికన గతుకులు,గుంతలు సరిచేస్తుంది. విజయవాడ-ఛతీస్‌గడ్ జాతీయ రహదారిలో మైలవరం దగ్గర భారీగా గతుకులు పడి,వాహనాలు వెళ్ళలేని పరిస్థితి.ఈ దారి ఎండ్ల తరబడి గతుకులు పడి వున్నా,ప్రస్తుత వానలకు దారుణంగా దెబ్బతిన్నది, కృష్ణానది ఉప నది మున్నేరుకు వరద ప్రవాహం స్థిరంగానే ఉంది.ఈ నది ముంపుకు భారీగా కూరగాయల తోటలు, ఏటూరు తీరంలో భారీగా పత్తి, మిర్చి, పునాస,అక్కడక్కడ పసుపు దెబ్బతిన్నాయి.నీరు తీసాక మళ్ళీ సాగు ప్రారంభించాల్సిందేనని రైతులు వాపోతున్నారు.నల్లవాగుపై వరద కొనసాగుతుంది. కట్టలేరు కాజ్‌వేపై వరద నీరు తీయలేదు,దాంతో ఎన్టీఆర్, గుంటూరుజిల్లా,తెలంగాణ జిల్లాల మధ్య వాహనాల రాకపో కలు నిలిచిపోయాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసాయి, ఎడతెరిపి లేని వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.శుక్రవారం వానలు తగ్గినా లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ఇంకా తగ్గలేదు.అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపిల్లిని వర్షాల కారణంగా జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. చవితి ఉత్సవాలు వర్షాల్లో జరుపుకుంటున్నారు. వర్షాలు నేపథ్యంలో అమలాపురం కలెక్టరేట్‌తో సహా అమలాపురం, రామచంద్రపురం కొత్తపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. **ఎక్కడికక్కడే చెత్త:** కాకినాడ జిల్లాలోని కేంద్ర పాలిత యానాంలో ఏకధాటిగా పడిన వర్షానికి ప్రధాన రహదారులు, పట్టణంలోని వీధులు, గణేష్ మండపాలు జలమయమయ్యాయి. ఉదయంనుండి చిన్న చిన్నగా ఉన్న వర్షం 12గంటల నుంచి 2 గంటల వరకు >>2



## ప్రపంచం ఆశలు భారత్ పైనే..
### ఇండియా అభివృద్ధిలో జపాన్ భాగస్వామ్యం
### టోక్యోలో జరిగిన ఇండో-జపాన్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ప్రధాని మోడీ
### గాయత్రి మంత్రం పఠిస్తూ మోడీకి స్వాగతం
### జపాన్ పెట్టుబడులు 40 బిలియన్ డాలర్లు పైనే

**టోక్యో, ఆగస్టు 29:** ప్రపంచం అంతా భారత్‌పైనే ఆశలు పెట్టుకుందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. విదేశీ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టడం పెరిగిందని, పెట్టుబడులు కేవలం పెరగడమే కాకుండా రెట్టింపు అవుతుందని అన్నారు. భారత్ జపాన్ వార్షిక సదస్సు కోసం ఆ దేశంలో పర్యటిస్తున్న ప్రధాని టోక్యోలో ఇండియా జపాన్ ఎకనామిక్ ఫోరంలో పాల్గొన్నారు. జపాన్ వ్యాపార దిగ్గజాలు హాజరైన ఆ సదస్సుకు మోడీని, జపనీయులు గాయత్రి మంత్రం పఠిస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ప్రధాన మంత్రి భారత్ జపాన్ మధ్య లోతైన భాగస్వామ్యాన్ని ప్రస్తావించారు. భారత అభివృద్ధి ప్రయాణంలో జపాన్ కీలక పాత్ర పోషించిందని ప్రధాని మోడీ గుర్తుచేశారు. మెట్రోలు, సెమీకండక్టర్స్, స్టార్టప్‌లు, మాన్యుఫక్చరింగ్‌లు ఇలా అనేకరంగాల్లో తోడ్పాటు అందించిందన్నారు. ఇప్పటికే జపాన్‌సంస్థలు భారత్‌లో 40బిలియన్ డాలర్లకన్నా ఎక్కువ పెట్టు బడులు పెట్టినట్లు చెప్పారు. భారత్‌లో ఆర్థిక, రాజకీయ స్థిరత్వం నెలకొందన్న మోడీ ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించబోతోందని వివరించారు. >>2



## ఉరకలేస్తున్న గోదావరి ఉపనదులు..

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఆగస్టు 29, ప్రభాతవార్త:** అల్పపీడన ప్రభావంతో ఎగువన కురు స్తున్న వర్షాలకు గోదావరికి భారీగా వరదనీరు చేర దంతో గోదావరి ఉపనదులు >>2



## వచ్చేస్తోంది బుల్లెట్ రైలు
### హైదరాబాద్-చెన్నై కారిడార్ వయా సిఆర్డీయే మీదుగా అమరావతికి రైలు
### ఎలైన్‌మెంట్‌కు ప్రాథమిక ఆమోదం

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతి మీదుగా బుల్లెట్ రైళ్ళు దూసుకువెళ్తాయి. ఈ రైళ్ళు పరుగులు పెట్టేందుకు వీలుగా హైదరాబాద్-చెన్నై మధ్య హైస్పీడ్ ఎలివేటెడ్ రైలు కారిడార్‌నిర్మాణం చేపట్టనున్నారు. దీని ఎలైన్ మెంట్‌కు ప్రాథమిక ఆమోదం లభించింది. ఇది సీఆర్డీయే >>2

### 2.4 ట్రిలియన్ డాలర్ల
# ఆర్థిక వ్యవస్థ సర్కార్ లక్ష్యం
### నాలెడ్జి ఎకానమీలో చార్టర్డ్ అకౌంటెంట్లు భాగస్వాములు కావాలి
### ఎఐ విప్లవంతో ఎన్నో అవకాశాలు, ఈజ్‌ఆఫ్ లివింగ్‌కు ప్రాధాన్యత: మంత్రి లోకేష్


శుక్రవారం విశాఖలో అర్థసమృద్ధి-2025ను ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్

**విశాఖపట్నం, ప్రభాతవార్త:** దార్శనిక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎపిలోని కూటమి ప్రభుత్వం నాలెడ్జ్ బేస్డ్ ఎకానమీని నిర్మిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను 2047నాటికి 2.4ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్నది మా లక్ష్యం. ఈ ప్రయాణంలో చార్టర్డ్ అకౌంటెంట్లు కంట్రి బ్యూటర్లుగా మాత్రమే కాకుండా మార్గదర్శకులుగా నిలవాలని రాష్ట్ర విద్య,ఐటి,ఎలక్ట్రానిక్స్ శాఖలమంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఐసిఎఐ (Institute of Chartered Accountants of India) ఆధ్వర్యాన అర్థసమృద్ధి-2025 పేరిట వైజాగ్ కన్వెన్షన్స్‌లో జరిగిన సదస్సులో మంత్రి లోకేష్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ప్రతి పారిశ్రామిక విప్లవానికి రెండు పార్శ్వాలు ఉంటాయి, ప్రతి పారిశ్రామిక విప్లవం కొత్త అవకాశాలను సృష్టిస్తుంది, గతంలో ఐటి విప్లవం వచ్చినపుడు భారతదేశం >>2



## విశాఖ బీచ్‌లో డబుల్ డెక్కర్లు
### బస్సులను జెండా ఊపి ప్రారంభించిన సిఎం చంద్రబాబు

**విశాఖపట్నం, ఆగస్టు 29 ప్రభాతవార్త:** విశాఖలో పర్యాటకానికి మరింత ఆకర్షణ జోడిస్తూ డబుల్ డెక్కర్ బస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విశాఖ బీచ్ రోడ్డులో హాప్ ఆన్ - హాప్ అఫ్‌డబుల్ డెక్కర్ పర్యాటక బస్సులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇవాళ జెండా ఊపి ప్రారంభించారు. ఆర్కే బీచ్ నుంచి తొట్లకొండ వరకు 16 కిలోమీటర్ల మేర పర్యాటక ప్రాంతాల్లో తిరగనున్న ఈ ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సుల్లో స్వయంగా ప్రజా ప్రతినిధులతో కలిసి సీఎం కొంత దూరం ప్రయాణించారు. బస్సు నుంచే బీచ్ లో ఉన్న పర్యాటకులకు అభివాదం చేశారు. పర్యాటకులకు కొత్త అనుభవం కలిగేలా ఈ బస్సులో ప్రయాణం ఉంటుందని సీఎం అన్నారు. ప్రత్యేకంగా పర్యాటకుల కోసం అందుబాటులోకి వచ్చిన ఈ బస్సులు 24 గంటలపాటు ఒకే టికెట్‌తో ప్రయాణించే సౌకర్యం కల్పించనున్నాయి. టికెట్ ఛార్జీ రూ. 500గా నిర్ణయించగా, అందులో సగం మొత్తాన్ని ప్రభుత్వం భరించనుంది. కేవలం రూ.250/లకే 24 గంటల పాటు హాప్ ఆన్ -హాప్‌ఆఫ్ బస్సులో >>2

# సమష్టిగా సైబర్ నేరాల కట్టడి
### తీరప్రాంత భద్రత పటిష్టతపై దృష్టి
### దక్షిణ భారత ఐపిఎస్ అధికారుల సమావేశంలో పలు తీర్మానాలు



**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతి నిధి:** రోజురోజుకూ తీవ్రమవుతున్న సైబర్‌నేరాలు, ఆర్థిక మోసాల నియంత్రణపై పోలీసుశాఖ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని అన్ని రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్త సూచించారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసుయంత్రాంగం ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటుందని అన్నారు. మరీ ప్రధానంగా సహకార ఫెడలరిజం ద్వారా >>2



## పిన్నెల్లి సోదరులకు హైకోర్టులో ఎదురుదెబ్బ
### జంట హత్యల కేసు

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ నేత పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి సోదరులకు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది.జంట హత్య కేసులో రామకృష్ణా రెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావుల హత్య ఘటనలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఏ6 ,వెంకట్రామిరెడ్డి ఏ7 నిందితులుగా ఉన్నారు. ఈ ఘటనలో పిన్నెల్లి సోదరుల పాత్ర ఉందని పోలీసుల తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టులో వాదనలు వినిపిం చారు. హత్య ఘటనలో పిన్నెల్లి సోదరుల కుట్ర, ప్రోద్బలం ఉందన్నారు. >>2


శుక్రవారం విశాఖ పర్యటనలో భాగంగా రుషికొండ ప్యాలెస్‌ను సందర్శించిన డి.సిఎం పవన్, తదితరులు

### 'రుషికొండ' నుంచి టూరిజానికి
# లబ్ధి చేకూర్చాలి
### ఆదాయ మార్గాన్ని వెతకాలి: డి.సిఎం పవన్

**విశాఖపట్నం, ఆగస్టు 29, ప్రభాతవార్త:** విశాఖ పర్యటనలో ఉన్న జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శుక్రవారం గత ప్రభుత్వ హయాంలో రుషికొండపై నిర్మించిన ప్యాలెస్‌ను పరిశీలిం చారు. జనసేనకు చెందిన మంత్రులు ఎమ్మెల్యేలతో కలిసి రుషికొండ తిలకించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతితో పెట్టుకుంటే ఉన్నది పోద్ది ఇదే నిదర్శనం >>2




## రక్తహీనత నివారణలో రాష్ట్రానికి జాతీయ స్థాయి ప్రథమ స్థానం
### మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,ఆగస్టు 29,ప్రభాతవార్తప్రతినిధి:** రక్తహీనత (ఎనీమియా)నివారణ చర్యల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే తొలిస్థానంలో నిలి చింది. ఆరునెలల శిశువునుంచి చిన్న పిల్లలు, యువత, గర్భిణులు, బాలింతల్లో >>2

### రూ.2,600 కోట్లతో విజయవాడ-బందరు మధ్య
# 6లేన్ల రహదారి నిర్మాణం
### మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతమైనందుకు శుక్రవారం ఉదయం నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత వ్యవహారిక భాష ఉద్యమ పితామహులు గిడుగు వెంకట రామమూర్తి పంతులుజయంతి సందర్భంగా వారి చిత్రపటానికి రాష్ట్ర మంత్రి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గిడుగు తెలుగు భాష అభివృద్ధికి చేసిన సేవలను వారు కొనియాడారు.మంత్రి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఆడబిడ్డల్లో చైతన్యం తెచ్చి, మహిళలకు పద్మావతి విశ్వవిద్యాలయం నెలకొల్పి, రిజర్వేషన్లు, ఆస్తి హక్కును కల్పించిన ఘనత ఆనాటి ముఖ్యమంత్రి అన్న నందమూరి తారక రామారావుకే దక్కుతుందన్నారు. ఆడబిడ్డలను మరింత ముందుకు తీసుకుపోయిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కే దక్కుతుం దన్నారు. డ్వాక్రా సంఘాలను పెట్టడం, సాఫ్ట్వేర్ రంగంలో మహిళలకు ప్రోత్సహించి విదేశాలకు పంపడం, ఆడబిడ్డలు ఇబ్బంది పడ కుండా దీపంపథకం కింద సంవత్సరానికి >>2


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర



శుక్రవారం టోక్యోలో ప్రధాని మోడీకి ఓ ఆలయ పూజారి 'దరూమా డాల్'ను కానుకగా అందిస్తున్న దృశ్యం

## ప్రధానిమోడీకి 'దరూమా డాల్' బహుమతి!

**టోక్యో, ఆగస్టు 29:** భారత్‌జపాన్ వార్షిక శిఖరాగ్రసదస్సులో పాల్గొనేందుకు ప్రస్తుతం జపాన్ రాజధాని టోక్యోలో ఉన్న ప్రదాని మోడీకి ఒక ఆలయ పూజారి 'దరూమా డాల్'ను కానుకగా అందించారు. జపాన్ సాంప్రదాయంలో అదృష్టం పట్టుదలకు చిహ్నంగా భావించే ఈ బొమ్మను ఇరుదేశాలమధ్య సుహృద్భావానికి ప్రతీకగా అందించినట్లు తేలింది. జపాన్ సాంస్కృతిక చిహ్నాల్లో దరూమా డాల్‌కూడా ఒకటి. అదృష్టం, పట్టుదల, స్థిరత్వానికి ప్రతీకగా ఈ బొమ్మ ఉంటుంది. గుండ్రటి ఆకారంలో కనిపించే ఈ ప్రతిమ ప్రకాశవంతమైన రంగులో ఉంటుంది. చాన్‌బద్ధమత స్థాపకుడిగా పేర్కొంటున్న బోదిధర్మ ఆధారంగా రూపొందించారని చెపుతారు. దాన్ని నెట్టినా నిటారుగా నిలబడటం దీని లక్షణం. ఇందుకు అనువైన బరువులోనే రూపొందిస్తారు. ఏడుసార్లు కిందపడినా ఎనిమిదోసారి లేచి నిలబడాలనే అర్థం వచ్చే ఓ జపనీస్ సామెతను ఈ బొమ్మ ప్రతిబింబిస్తుందని జపనీయులు భావిస్తారు. ఈప్రతిమను కొనుగోలుచేసినపుడు దాని రెండుకళ్లు తెలుపురంగులోనే వదిలేసి ఉంటాయి. కొనుగోలుచేసిన వ్యక్తిఏదైనా కోరిక లేదా లక్ష్యం నిర్దేశించుకుంటే తొలుత ఆ బొమ్మ ఎడమ కన్నును నల్లటిసిరాతో నింపాలి. ఆకోరిక లేదా లక్ష్యం నెరవేరినపుడు మాత్రమే కుడికన్నును సిరాతోపూర్తిచేయాలి. దీనివల్ల నిబద్ధత లక్ష్యఛేదనకు సజీవ సాక్ష్యంగా ఈప్రతిమ నిలుస్తుందనిభావిస్తారు. కుటుంబాలు, వ్యాపారులుతోపాటు రాజకీయ నేతలుకూడా తమ అభివృద్ధికి చిహ్నంగా దరూమా డాల్‌ను ఉపయోగిస్తారు.

# ఆర్థిక వ్యవస్థ సర్కార్ లక్ష్యం

>> అత్యధికంగా లబ్ధిపొందింది, అదేతరహాలో ప్రస్తుతం ఎఐ విప్లవంతో లబ్ధిపొందబోతున్నాం. రాజకీయ పార్టీగా మేం డిజిటల్ లైబ్రరీ, విశ్లేషణాత్మక సమాచారం కోసం ఎఐ వినియోగిస్తున్నాం, అసెంబ్లీలో అర్థవంతమైన చర్చల కోసం ఎఐ టూల్‌ను ఉపయోగిస్తాం. ఎఐ ఆధారిత గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తున్నాం. ఈజ్ ఆఫ్ లివింగ్ కు ప్రాధాన్యతనిస్తున్నాం ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నాం. రాయలసీమలోని అనంతపురంలో ఆటోమోటివ్, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, చిత్తూరులో ఎలక్ట్రానిక్స్, ప్రకాశం జిల్లాలో సిబిజి, గుంటూరు!! కృష్ణా జిల్లాలో క్వాంటమ్ వ్యాలీ, గోదావరి జిల్లాల్లో ఆక్వా, ఉత్తరాంధ్రలో ఐటి, ఫార్మా, లాజిస్టిక్స్ పరిశ్రమలకు ప్రాధాన్యత నిస్తున్నాం. దితి లు (చార్టర్డ్ అకౌంటెంట్స్) నైతికతతో మెరుగైన పాలసీలను అమలు చేయడంలో మాకు సహాయం అందించాలి. పాలసీలను సరైన దిశలో నడిపించడంలో, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో ముఖ్యమైన పాత్ర పోషించాలి. సిఏలు ఆంధ్ర ప్రదేశ్ బ్రాండ్ అంబాసడర్‌గా నిలవాలన్నారు. టారిఫ్ వార్ కారణంగా భారత్ నష్టపోకుండా కొత్త మార్కెట్లను అన్వేషించాలి. ఈజ్ ఆఫ్ లివింగ్ కు ప్రాధాన్యతనిస్తూ మనమిత్ర ద్వారా 700రకాల పౌరసేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నాం. పరిపాలన వ్యవహారాల్లో ఎఐ వినియోగానికి సంబంధించి టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్‌తో ఒప్పందం చేసుకున్నాం. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మేం ఏర్పాటుచేసిన వర్కింగ్ గ్రూపులో చేరి మీవంతు సూచనలు, సలహాలు అందించాలన్నారు. ప్రస్తుత శాసనసభలో 50శాతం మంది కొత్తవారు, మంత్రివర్గంలో కూడా 17మంది కొత్తవారే. ఆంధ్రప్రదేశ్ ను నెం.1గా తీర్చిదిద్దేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. రాష్ట్రాభివృద్ధిలో సిఏలు ప్రముఖ పాత్ర పోషించాలి. విశాఖపట్నంలో అకౌంటింగ్, ఆడిటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఏర్పాటు చేసేందుకు ఐసిఎఐ చొరవచూపాలి. సిటీ ఆఫ్ డెస్టినీ మాత్రమే కాదు...మీరు కేవలం రికార్డు కీపర్లు మాత్రమే కాదు... భారతదేశ నిర్మాణ రూపశిల్పులు. విశ్వసనీయమైన గణాంకాలు ఉన్న దేశం అన్నివిధాల అభివృద్ధి సాధిస్తుందన్నారు. సంపదను పరిరక్షి ంచడమే కాదు దానిని సృష్టించే మార్గాలను అన్వేషించాలన్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పారదర్శకత, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలతో ముందుకు సాగుతోంది. ఐటి, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తోంది. రాష్ట్రాభివృద్ధికి మీ వంతు సహాయ, సహకారాలు అందించాల్సిందిగా మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. రాబోయే నాలుగేళ్లలో విశాఖనగరం రూపురేఖలు మార్చేసి మీ రుణం తీర్చుకుంటామని మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఐసిఎఐ ఉపాధ్యక్షులు ప్రసన్నకుమార్, సదరన్ రీజియన్ వైస్ చైర్మన్ ముప్పాళ్ళ సుబ్బారావు, ఐసిఎఐ విశాఖ బ్రాంచి ప్రతినిధులు అందవరపు శ్రీధర్, రామానాయుడు, పట్నాల లోకేష్, ఉజ్వల, లీలా వరప్రసాద్, గురుమూర్తి, రాంబాబు, వృత్తి నిపుణులు పాల్గొన్నారు.

# భారీగా పంట నష్టం

>> ఏకధాటిగా కురవడంతో జనాలు ఇబ్బందులు పడ్డారు. జనాలు ఇంటి నుండి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా ఉండడంతో తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు. అల్లూరి జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కొన్నిచోట్ల కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలు స్తంభించాయి. పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీ ఇనుపతీగల వద్ద కొండచరియ విరిగిపడింది. కొండచరియలు విరిగి పడటం వల్ల గిన్నెలకొట్ట -ఇనుపతీగల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాటిని పునరుద్దరించే పనిలో అధికార యంత్రాంగం పడింది. హుకుంపేట మండల కేంద్రంలో ఓ భారీ వృక్షం పాఠశాలపై పడింది. విద్యార్థులు సెలవు కారణంగా ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మారేడుమిల్లి మండలం బొడ్లంక వద్ద పెళ్లిరేవు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దాదాపు 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెదబయలు మండలం కిమిడిపల్లి పంచాయతీ వద్ద గేదెగడ్డ పొంగి ప్రవహిస్తోంది. మెట్ట, మాగాణి, వాణిజ్య పంటలకు అనుహ్యంగా దెబ్బతగిలింది. ఎన్నడు లేని రీతిలో ఈ ఖరీఫ్ ఆరంభంలో పునాసను వానలు కారణంగా కొల్పోయిన రైతులు, అనుహ్యంగా మరో పర్యాయం వర్షాలు భారీగా కురవడంతో ఢీలా పడ్డారు. అరటి తోటలు దారుణంగా దెబ్బతిన్నాయి. తమలపాకు, కూరగాయ తోటలు, మిర్చి, పత్తి దారుణంగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక అంచనాల మేరకు ఉమ్మడిజిల్లాలో 2000హెక్టారుల్లో మెట్ట, వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న వేరుశనగ తుడిచి పెట్టుకుని పోయాయి. గుంటూరు జిల్లాలో 300 హెకార్డుల్లో పంట నష్టం జరిగిందంటున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాలో మాగాణి, చెరకు దెబ్బతిన్నాయి. ఉత్తరాంధ్రలో దాదాపు అన్ని రకాల పంటలకు నష్టం వాటిల్లింది. కృష్ణా, గోదావరి ఉమ్మడి జిల్లాల్లో వరదల ప్రభావం ఆక్వారంగంపై తీవ్రంగా ఉంది.

**తగ్గుముఖం పడుతున్న వరద:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా నదిలో వరద ప్రవాహం తీవ్రమవుతోంది. ఈ నేపథ్యంలో విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్‌కు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ నిన్న మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసారు. తాజాగా శుక్రవారం కృష్ణానది వరద ప్రవాహం తగ్గటంతో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం బ్యారేజ్‌లోకి 3,94,790 క్యూసెక్కుల నీరు వచ్చిందని తెలిపారు. ఈ వరద నీటిని నియంత్రించేందుకు ప్రకాశం బ్యారేజ్‌లోని 66 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. శ్రీశైలం డ్యాం వద్ద ఇన్ ఫ్లో 2.95, ఔట్ ఫ్లో 3.37 లక్షల క్యూసెక్కులు, నాగార్జునసాగర్ వద్ద ఇన్ ఫ్లో 2.52, ఔట్ ఫ్లో 2.47 లక్షల క్యూసెక్కులు, పులిచింతల వద్ద ఇన్ ఫ్లో 2.29, ఔట్ ఫ్లో 2.10 లక్షల క్యూసెక్కులు, ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇన్ ఫ్లో ,ఔట్ ఫ్లో 3.94 లక్షల క్యూసెక్కులు, ధవళేశ్వరం వద్ద ఇన్ ఔట్ ఫ్లో 6.59 లక్షల క్యూసెక్కులుగా ఉన్నట్లు ఎండీ ప్రఖర్ జైన్ చెప్పుకొచ్చారు. భద్రాచలం వద్ద ప్రస్తుతం 35.3 అడుగుల నీటిమట్టం, కూనవరం వద్ద 17.06 మీటర్లు, పోలవరం వద్ద 11.45 మీటర్లు నీటిమట్టం ఉన్నట్లు తెలిపారు. భారీ వర్షాలు, నదుల ప్రవాహం దృష్ట్యా వినాయక నిమజ్జనాల్లో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎండీ ప్రఖర్ జైన్ సూచిస్తున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పెరుగుతున్న గోదావరి, కృష్ణా నదుల ప్రవాహం నేపథ్యంలో నది పరివాహక ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు.. ఏదైనా.. సమస్య ఉంటే.. వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. అలాగే.. అటవీ ప్రాంతాల ప్రజలు వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదని ఆయన వెల్లడించారు.

## ఉరకలేస్తున్న గోదావరి ఉపనదులు..

>> గౌతమి, వైనతేయ, వశిష్టలు వరద నీటితో ఉరకలెత్తి ప్రవహిస్తున్నాయి. వీటి ప్రభావంతో కోనసీమ మరోసారి వరద గుప్పెట్లో చిక్కుకోనుంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి. గన్నవరం నియోజకవర్గంలో ఈ ఏడాదిలో మూడోసారి వరద పోటు తొంగి చూస్తోంది. దీంతో పశ్చిమగోదావరి జిల్లా కనకాయలంక, కోనసీమ జిల్లా చాకలిపాలెం కాజ్వేల పైకి వరద నీరు చేరడంతో లంక గ్రామాల వాసులు పడవలపై ప్రయాణం సాగిస్తున్నారు. మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్వే, అయినవిల్లి మండలం ఎదురు బిడియం కాజ్వేల పైకి వరద నీరు చేరేందుకు సిద్ధంగా ఉంది.

# ప్రపంచం ఆశలు భారత్‌పైనే..

>> ప్రభుత్వపరంగా పారదర్శకమైన విధానాలను అవలంభిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత్ మార్కెట్లు భారీ రాబడిని అందిస్తున్నాయని, తమకు బలమైన బ్యాంకింగ్ రంగం, 700 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయని వివరించారు. అణుశక్తి, గ్రీన్ ఎనర్జీ, ఆటోసెక్టార్‌లో రెండు దేశాలు మరింత కలిసికట్టుగా పనిచేయాలని మోడీ సూచించారు. జపాన్ ఓ టెక్ పవర్‌హౌస్, భారత్ ప్రతిభకు కేంద్రమని ప్రధాని మోదీ అన్నారు. ఈ రెండు కలిసిపోతే ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవానికి నాయకత్వం వహించగలవని పేర్కొన్నారు. ఏఐ, సెమీకండక్టర్, క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్, అంతరిక్ష రంగాల్లో భారతదేశం సాహసోపేతమైన, ప్రతిష్టాత్మకమైన చర్యలు తీసుకుంది. జపాన్ సాంకేతికత, భారతదేశ ప్రతిభ కలిసి పనిచేస్తే ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవానికి నాయకత్వం వహించగలవు. 2030వరకు 500 గిగావాట్ల పునరుత్పాదక శక్తి, 2047 కల్లా 100 గిగావాట్ల అణువిద్యుత్ సాధనను లక్ష్యంగా భారత్ నిర్దేశించుకుంది. సోలార్ సెల్స్ అయినా, గ్రీన్ హైడ్రోజన్ అయినా భాగస్వామ్యం కోసం అపార అవకాశాలు ఉన్నాయి. స్వచ్ఛ ఇంధనం, పర్యావరణ అనుకూల భవిష్యత్తుపై సహకారం కోసం జాయింట్ క్రెడిట్ మెకానిజంపై భారత్‌జపాన్ ఒక ఒప్పందంపై సంతకం చేశాయని ప్రధాని మోడీ పేర్కొన్నారు. జపాన్ ఆధునిక సాంకేతికత, భారత ప్రతిభ కలిస్తే రెండు దేశాలు ఆర్థిక సంబంధాలు విస్తృతంగా అభివృద్ధి చెందుతాయని జపాన్ ప్రధాని షిగెరూ ఇషిబా అన్నారు. అనేక జపాన్ కంపెనీలు మేక్ ఇన్ ఇండియాలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ సహకారం ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది. నేడు సంతకం చేసిన కొత్త ఒప్పందాలు జపాన్ భారత్‌లో పెట్టు బడులు పెంచాలన్న సంకల్పానికి నిదర్శనం. ఇది రెండుదేశాలపై ఆధారపడి ఉన్న బలమైన సరఫరా గొలుసును నిర్మిస్తున్నట్టు స్పష్టం చేస్తోందని అన్నారు. జపాన్ ప్రధాని ఇషిబా ఆహ్వానం దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత ప్రధాని మోడీ ఈపర్యటనకు వచ్చారు.

# వచ్చేస్తోంది బుల్లెట్ రైలు

>> మీదుగా వెళ్ళనుంది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా కూడా బుల్లెట్ రైళ్ళు పరుగులు పెట్టేలా హైదరాబాద్-బెంగుళూరు హైస్పీడ్ రైలు కారిడార్ ఎలైన్‌మెంట్‌కూ ప్రాథమిక ఆమోదం లభించింది. ఈ రెండింటి నిర్మాణంతో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ చిత్రమే మారిపోనుంది. మెట్రో నగరాల మధ్య బుల్లెట్ రైళ్ళు నడిపేందుకు కేంద్రం హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తుండగా, ఇందులో ఏపీ మీదుగా హైదరాబాద్-చెన్నై ,హైదరాబాద్-బెంగుళూరు కారిడార్లకు చోటు కల్పించారు. ఈ రెండు కారిడార్ల లోనూ హైదరాబాద్ నుంచి శంషాబాద్ వరకు 38.5 కి.మీ. కామన్‌గా ఉండనుంది. అక్కడి నుండి చెన్నై, బెంగుళూరు వైపు వేర్వేరు కారిడార్లు ఉంటాయి. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్ కోసం 744.57 కి.మీ., 839.5 కి.మీ., 749.5 కి.మీలతో మూడు ఎలైన్‌మెంట్ల్‌ను పరిశీలించి, ఇందులో 744.5కి.మీ ఎలైన్‌మెంట్‌ను ప్రాథమికంగా ఖరారు చేశారు. ఇందులో తెలంగాణాలో ఆరు, ఏపీలో ఎనిమిది, తమిళనాడులో ఒక స్టేషన్ నిర్మిస్తారు ఇది హైదరాబాద్ పరిధిలోని... హైదరాబాద్-ముంబయి హైస్పీడ్ రైలు కారిడార్ నుంచి మొదలై శంషాబాద్, నార్కట్‌పల్లి, సూర్యాపేట, ఖమ్మం, కోదాడ మీదుగా వచ్చి సీఆర్డీయే మీదుగా గుంటూరు వైపు వెళ్తుంది. అక్కడ నుండి చీరాల వైపు వెళ్ళి విజయవాడ-చెన్నై రైల్వేలైన్‌కు సమాంతరంగా చెన్నై వెళుతుంది. తెలంగాణలో 236.48కి.మీ., ఏపీలో448.11 కి.మీ. తమిళనాడులో 59.98 కి.మీ. వెళ్తుంది. ఇది నేరుగా చెన్నైకి కాకుండా తిరుపతి మీదుగా వెళ్ళేలా ఎలైన్‌మెంట్‌లో మారిస్తే తిరుపతి వెళ్ళే వారికి ప్రయోజనకరమనే చర్చ వచ్చింది. గూడూరు నుంచి తిరుపతి మీదుగా చెన్నై వెళ్ళేలా మారిస్తే...కారిడార్ పొడవు మరో 53.5కి.మీ. పెరగనుంది. అప్పుడు నాయుడుపేట, తడలు ఈ పరిధిలో ఉండవు. ఈ ప్రాజెక్ట్‌లో రెండు వరసల లైన్(డబుల్ ట్రాక్), లూప్‌లైన్లు, సైడింగ్స్ కలిపి మొత్తం 1419.4కి.మీట్రాక్ నిర్మించాలి. హైదరాబాద్-బెంగుళూరు హైవేకి సమాంతరంగా. లైన్ ఉంటుంది, హైదరాబాద్-బెంగుళూరు హైస్పీడ్‌రైలు కారిడార్‌కు 576.6కి.మీ., 558.2 కి.మీ., 621.8 కి.మీతో మూడు ఎలైన్‌మెంట్‌లు పరిశీలించారు. ఇందులో 576.6 కి.మీ. ఎలైన్‌మెంట్‌ను ప్రాథమికంగా ఎంపిక చేశారు. ఇదిచాలా వరకు ప్రస్తుతమున్న హైదరాబాద్-బెంగుళూరు హైవేకి సమాంతరంగా వెళ్తుంది. తెలంగాణలో 4, ఏపీలో 6, కర్ణాటకలో 3స్టేషన్లు నిర్మిస్తారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుగొండ సమీపంలో కియా పరిశ్రమ, అనుబంధ పరిశ్రమలు ఉండటంతో అక్కడ దుద్దేబండ వద్ద స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో తెలంగాణలో 218.5కి.మీ., ఏపీలో 263.3కి.మీ., కర్ణాటకలో 94.80 కి.మీ. మేర ట్రాక్ నిర్మిస్తారు. హైదరాబాద్-అమరావతి-చెన్నై, హైదరాబాద్-బెంగుళూరు మధ్య బుల్లెట్ రైళ్ళ కారిడార్లు పూర్తయ్యి. బెంగుళూరు-చెన్నై మధ్య చేపట్టే బుల్లెట్ రైలు ప్రాజెక్టులు అందు బాటులోకి వస్తే హైదరాబాద్, అమరావతి, చెన్నై, బెంగుళూరునగరాల మధ్య బుల్లెట్ రైళ్ళ చతుర్భుజి వచ్చినట్లు అవుతుంది. దీనివల్ల ఈ నగరాల మధ్య గంట నుంచి రెండు గంటల్లోనే చేరుకునే అవకాశం కలగనుంది.

## రుషికొండపై మంత్రివర్గ ఉప సంఘం

**విజయవాడ, ఆగస్టు29, ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖలోని రిషికొండలో గత ప్రభుత్వం నిర్మించిన రిసార్ట్ వినియోగానికి అధ్యయనం చేసి, సిఫార్సులు చేసేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రివర్గ ఉపసంఘంలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని నియమించారు. పర్యాటక, యూత్ అడ్వాన్స్‌మెంట్, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మంత్రి వర్గ ఉపసంఘానికి కన్వీనరుగా వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# 6లేన్ల రహదారి నిర్మాణం

>> 3 ఉచిత గ్యాస్ సిలిండర్ ల సరఫరా, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ 15 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు., తల్లికి వందనం పథకం కింద రాష్ట్రంలో 68 లక్షల మంది మహిళలు లబ్ధి పొందుతున్నారన్నారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద రాష్ట్రంలో ఉన్న బస్సులలో 74 బస్సులను కేటాయించారని, చిన్న చిన్న పనులు చేసుకునే మహిళలు రూ.1500 నుంచి రూ.2000 నెలవారీ ఖర్చులు ఆదా కావాలని, ఆ డబ్బులు వేరే విధంగా ఉపయోగించుకోవాలన్నారు గతంలో మచిలీపట్నం -విజయవాడకు నాలుగు వరుసల జాతీయ రహదారిని నిర్మించేందుకు కృషి చేశామన్నారు. అలాగే నేడు మచిలీపట్నం -విజయవాడకు ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మించేందుకు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీతో మాట్లాడామన్నారు. రూ. 2600 కోట్ల వ్యయంతో ఆ రహదారి మంజూరు చేయడం జరిగిందన్నారు. మచిలీపట్నం నుండి రేపల్లె వరకు 45 కిలోమీటర్ల రైల్వే లైన్ పొడిగింపు కార్యరూపం దాల్చిందని, ఇందుకోసం 3 నెలల క్రితం కేంద్ర మంత్రితో మాట్లాడామని అన్ని ప్రయత్నాలు చేశామని 2 సంవత్సరాలలో పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ రైల్వే లైన్ కోసం పోరాటం చేసిన బందరు నివాసి కొక్కిలిగడ్డ కోదండరామయ్య నేడు చనిపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. రాష్ట్రంలో 10,500 బస్సులు ఉండగా అందులో 75 8,500 బస్సులను మహిళల కోసం ఉచిత బస్సు పథకానికి కేటాయించామన్నారు. అనంతరం మహిళా లబ్ధిదారులకు మంత్రివర్యులు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, ఆర్టిసి ఆర్ఎం వెంకటేశ్వర్లు, డిఎం పెద్దిరాజు, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు అనిత, సమతాకీర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు గొర్రెపాటి గోపీచంద్, రొండి కృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ కాశీ విశ్వనాథ్, పలువురు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పిన్నెల్లి సోదరులకు హైకోర్టులో ఎదురుదెబ్బ

>> నిందితులు ఓ రెస్టారెంట్‌లో సమావేశమై హత్యకు కుట్రపన్నారన్నారు. హత్య ఘటనలో పాల్గొన్న వ్యక్తులతో పిన్నెల్లి సోదరులు ఫోన్‌లో మాట్లాడారని, వాటికి సంబంధించి సాంకేతిక ఆధారాలున్నాయన్నారు. సర్పంచ్ పదవికి పోటీ చేస్తే తాము మద్దతిస్తామని ఏ1 నిందితుడికి పిన్నెల్లి సోదరులు హామీ ఇచ్చారన్నారు. వాస్తవాలను వెలికి తీయాలంటే వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలను కస్టడీలోకి తీసుకొని విచారించాల్సి ఉందన్నారు. బెయిలిస్తే సాక్షులను ప్రభావితం చేస్తారన్నారు. ముందస్తు బెయిలు పిటిషన్లను కొట్టేయాలని కోరారు. ఫిర్యాదు దారుడు తోట ఆంజనేయులు తరపున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రంలోకి చొరబడి ఈవీఎంను పగలగొట్టిన చరిత్ర పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గండ్లపాడు గ్రామంలో 2022లో చోటు చేసుకున్న ఓహత్య కేసులో పిటిషనర్ల పాత్ర ఉందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎఫ్ఐఆర్‌లతో పేర్లు లేకుండా చేసుకున్నారన్నారు. పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి సార్వత్రిక ఎన్నికల తర్వాత పరారీలో ఉన్నారని తెలిపారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టేయండి అని కోరారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ కేసులో పిటీషనర్లలను ఇరికించారని పిటీషనర్ల తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న అనంతరం పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

## రక్తహీనత నివారణలో రాష్ట్రానికి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం

>> రక్తహీనత తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా తీసుకున్న చర్యలతో ఏపీకి జాతీయ స్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు లభించింది. జాతీయ స్థాయిలో తొలి స్థానంలో రాష్ట్రాన్ని నిలిపిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్‌నెల (తొలి త్రైమాసికం)ల్లో రక్తహీనత నియంత్రణకు రాష్ట్ర ప్రభు త్వాలు, కేంద్రపాలిత రాష్ట్రాలు తీసుకున్న చర్యలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సమీక్షించింది. ఐఫ్ ఏమాత్రలు, సిరప్ పంపిణీ ప్రాతిపదికన రాష్ట్రాల వారీగా ర్యాంకులను ప్రకటిం చింది. ఇందులో ఆంధ్రప్రదేశ్, హర్యానా, తెలంగాణ రాష్ట్రాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు లభించాయి.



శుక్రవారం తిరుపతిలో జరిగిన సదస్సులో పాల్గొన్న దక్షిణభారత ఐపిఎస్ అధికారులు

# సమష్టిగా సైబర్ నేరాల కట్టడి

>> తీరప్రాంత భద్రతను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రధాన మౌలిక సదుపాయాలు కల్పించుకుని తీరప్రాంత భద్రతపై ప్రత్యేక దృష్టి సారిద్దామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశాలమేరకు ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ (ఆర్‌పిసిసి)సమావేశం తిరుపతిలో శుక్రవారం సాయంత్రం ప్రారంభమైంది. తెలుగురాష్ట్రాల డిజిపిలు, అదనపు డిజిలతోబాటు తమిళనాడు, కర్నాటక, కేరళ, కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ ,లక్షద్వీప్, పుదచ్చేరిలకు చెందిన సీనియర్ పోలీసు అధికారులు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు బిఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్, సిబిఐ, ఎన్ఐఎ, ఎన్‌సిబి, ఇడి, ఎఫ్ఆర్ఆర్ఒ, ఐడి, డిఆర్ఐ, ఐ4సిలకు సంబంధించిన పోలీసు అధికారులు, అనంతపురం రేంజి డిఐజి షీముషి భాజ్‌పేయి, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపి డిజిపి హరీష్‌కుమార్‌గుప్త మాట్లాడుతూ పోలీసు నేర కేసులకు సంబంధించి విచారణ, దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేయడానికి ఫోరెన్సిక్ పరిశోధనలు ప్రాధాన్యత ఉందన్నారు. నేడు సమాజంలో ప్రజలను అమాయకులను పీడిస్తున్న సులభంగా మోసంచేస్తున్న సైబర్ నేరస్థులు, మోసాలపై పోలీసుశాఖ సాంకేతికతను వినియోగించుకుని ప్రజలకు న్యాయం చేయడంతోబాటు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. పలు రకాల నేరాలపై అంతర్‌రాష్ట్రంలోని పోలీసు అధికారులు సమన్వయంగా సమాచారాన్ని అందిపుచ్చుకుని పనిచేయాలని, అప్పుడు అనుకున్న ఫలితాలను రాబట్టవచ్చన్నారు. దక్షిణభారతదేశంలో ఎదుర్కొంటున్న సవాళ్ళను పోలీసుశాఖ ధీటుగా పనిచేయాలన్నారు. అనంతరం ఆయా రాష్ట్రాల డిజిపిలు తమతమ రాష్ట్రాల పరిధిలో నేరాల కట్టడి, నేరస్థులకు చెక్ పెట్టడం వంటి అంశాలపై చర్చించారు. ఇలాంటి సమావేశాల ద్వారా భవిష్యత్తులో రాష్ట్రాల మధ్య సహకారం మరింత బలోపేతం అవుతుందని ,ప్రజల భద్రత పట్ల స్వస్థత, పరిరక్షణలో సమగ్ర ఫలితాలు సాధ్యమవుతాయని డిజిపి గుప్త తెలిపారు. ఈ సమావేశంలో కేరళ డిజిపి రావాడ చంద్రశేఖర్, పుదుచ్చేరి కేంద్రపాలిత డిజిపి శాలినీసింగ్, 8మంది అదనపు డిజిపిలు, 9మంది ఐజిలు, 12మంది డిఐజిలు, 16మంది ఎస్పీలు పాల్గొన్నారు.

# విశాఖ బీచ్‌లో డబుల్ డెక్కర్లు

>> పర్యాటకులు ప్రయాణం చేయవచ్చని సీఎం చంద్రబాబు ప్రకటించారు. పౌరులు, పర్యాటకులు పర్యావరణ హితంగా ప్రవర్తించాలని, తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. విశాఖ బీచ్‌లను ప్రపంచ స్థాయి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు పౌరులంతా సహకరించాలని కోరారు. మరోవైపు గత పాలకులు విశాఖను రాజధాని చేస్తామని చెప్పినా, వారి అవసరం లేదని ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. రోడ్లపై గుంతలు పెట్టిన పాలకులు వాటిలోనే కొట్టుకుపోయారని విమర్శించారు. ప్రస్తుతం విశాఖ ఆర్థిక రాజధానిగా, ఆసియా టెక్నాలజీ హబ్‌గా ఎదగబోతోందని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. విశాఖలో డేటా సెంటర్, సీ కేబుల్ ఏర్పాటు కాబోతున్నాయని, ఈ కేబుల్ ద్వారా విశాఖ ప్రపంచంతో అనుసంధానం అవుతుందని తెలిపారు. దీని ద్వారా విశాఖ భారత్‌కే టెక్నాలజీ హబ్‌గా ఎదుగుతుందని అన్నారు. మహిళలకు సురక్షిత నగరంగా విశామహిళలకు సురక్షి త నగరంగా విశాఖ ఎంపిక కావడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని సీఎం తెలిపారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి మెట్రో నగరాలతో పోటీ పడుతూ విశాఖ మహిళలకు సురక్షిత చిరునామాగా మారిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, హోంమంత్రి శ్రీమతి వంగలపూడి అనిత, టూరిజం శాఖ మాత్యులు కందుల దుర్గేష్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణ బాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఫిల్మ్ నగర్ భూ కేటాయింపుపై లోకేష్ హామీ

**మధురవాడ, ఆగస్టు 29:** వైజాగ్ ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ భూ కేటాయింపు దస్త్రంలో దొర్లిన పొరపాటు సరి చేస్తామని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. మధురవాడ వి కన్వెన్షన్‌లో ఫిల్మ్ నగర్ ప్రతినిధులు శుక్రవారం లోకేష్‌ను కలిశారు. ఫిల్మ్ ఇండస్ట్రీ విశాఖ రావాలనే ఉద్దేశంతో 2015లో ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారని చెప్పారు. తిమ్మాపురం రామానాయుడు స్టూడియో వద్ద 5ఎకరాల భూమిని లీజు పద్ధతిన ఏడాదికి రూ.10లక్షలకు కేటాయించారు. అయితే లీజు గడువును ఆ ఉత్తర్వుల్లో ఎక్కడా పేర్కొనకపోవడంతో సాంకేతక సమస్య వచ్చింది. దీనిపైభీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇప్పటికే తనతో మాట్లాడారని లీజు గడువును నిర్దేశిస్తూ 5 ఎకరాల భూమిని కేటాయిస్తామని లోకేష్ ప్రకటించారు. లోకేష్ ను కలిసిన వారిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు చంద్రమోళి ప్రసాద్ (కిన్ను), కోశాధికారి బాలాజీ, కమిటీ ప్రతినిధులు శ్రీహరి, హరివర్మ ఉన్నారు.

## లబ్ధి చేకూర్చాలి

>>అన్నారు. సంవత్సరానికి 7కోట్లు రాష్ట్రానికి ఆదాయం వచ్చే రుషికొండపై కోటి రూపాయలు కేవలం కరెంటుకే వెచ్చించే స్థితికి తెచ్చారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్యాలెస్ నిర్మాణంలో అవకతవకలు జరిగాయిని తెలుగుదేశం, జనసేన పార్టీలు గతంలో ఆరోపణలు చేశాయన్నారు. ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. భవనంలోని బెడ్‌రూమ్స్ బాత్‌రూమ్‌లను ఆయన పరిశీలించారు. గతంలో హరిత రిసార్ట్స్ ఉన్నప్పుడు రూ.7కోట్ల ఆదాయం వచ్చేదని మంత్రి దుర్గేష్ తెలిపారు. నిర్వహణ కింద రూ.కోటి బకాయిలున్నాయన్నారు. ఎన్టీటీలో కేసు నడుస్తుందని అధికారులు తెలిపారు. రుషికొండ భవనంపై అసెంబ్లీలో చర్చ జరగాలని పవన్ సూచించారు. ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా పరిశీలించాలన్నారు. ప్యాలెస్‌ను అలాగే వదిలేస్తే ప్పాడెపోతుందన్నారు. సాధ్యమైనంత త్వరలో దీనిని వినియోగం లోకి తీసుకు వస్తామన్నారు. నిర్మాణం పూర్తయింది. కనుక దీనియోగిస్తే మంచిదన్నారు. రూ.450 కోట్లు దీనికి వెచ్చించారు. దానికి తగినట్లుగా వచ్చే ఆదాయమార్గాన్ని వెతకాలన్నారు. దీని ద్వారా టూరిజానికి ఆదాయం రావాలని తెలిపారు.

## తాడిపత్రి మాజీ ఎంఎల్ఏ కేతిరెడ్డి పెద్దారెడ్డికి సుప్రీం కోర్టులో ఊరట

**విజయవాడ, ఆగస్టు29, ప్రభాతవార్తప్రతినిధి:** తాడిపత్రి మాజీ ఎంఎల్ఏ కేతిరెడ్డి పెద్దారెడ్డికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. తాడిపత్రికి వెళ్లేందుకు కేతిరెడ్డి పెద్దారెడ్డికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు కొనసాగుతాయని ఆదేశాలు ఇచ్చింది సుప్రీంకోర్టు. ఏపీ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇచ్చింది సుప్రీంకోర్టు. కేతిరెడ్డి పెద్దారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం. విచారణ చేపట్టింది ఈ సందర్భంగా పెద్దారెడ్డి పిటిషన్‌పై విచారణను ముగించింది సుప్రీంకోర్టు. పెద్దారెడ్డి భద్రతకు అవసరమైన అన్ని ఖర్చులు తామే భరిస్తామని కోర్టుకు చెప్పారు పెద్దారెడ్డి తరపు న్యాయవాదులు. ఈ విషయాన్ని ధర్మాసనం పరిగణనలోకి తీసుకున్నది. పెద్దారెడ్డి తాడిపత్రి వెళ్లేందుకు అనుమతి ఇస్తూ ఈ విచారణ ముగించింది.

## వారం - వర్జ్యం

30-08-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
సప్తమి రా.10.46
విశాఖ మ.2.36
వర్జ్యం : రా.7.07-8.51
దు.తె.5.57-7.33
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** శ్రమకు తగిన ఫలితాలు ఎక్కువగా చేతికి అందుతాయి. వాహనయోగం.

**వృషభం :** స్త్రీ సంతాన విషయమై విశేషంగా శ్రమించి సత్ఫలితాలు సాధిస్తారు.

**మిథునం:** చెప్పుకోదగిన మార్పు ఆలోచనాధోరణిలో ఏర్పడుతారు. వృత్తి, ఉద్యోగపరంగా రాణిస్తారు.

**కర్కాటకం :** ఎదుటివారిని బాగా అంచనా వేయగలుగుతారు. తద్వారా లాభపడతారు.

**సింహం:** జీవితభాగస్వామితో రాజీ ధోరణి అవలంబించడం మేలు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

**కన్య :** ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. శుభవార్తలు అందుకుంటారు.

**తుల :** సన్నిహితుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**వృశ్చికం:** ఆస్తి వ్యవహారాలు మీకు అనుకూలంగా మారే అవకాశాలు సూచిస్తున్నాయి.

**ధనుస్సు:** ముఖ్యమైన వ్యవహారాలలో స్తబ్దత ఏర్పడినా చెప్పుకోదగ్గ నష్టం వాటిల్లదు.

**మకరం:** కోర్టుకేసులనుండి బయట పడతారు. దీర్ఘకాలిక సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుంటారు.

**కుంభం:** సంఘసేవా కార్యక్రమాలపై ఆసక్తి చూపుతారు. వివాదాలకు, కోప తాపాలకు దూరంగా ఉండండి.

**మీనం :** భవిష్యత్తులో వాటి తాలూకా లాభాలు అందుతాయి. వాహనాలు కొనుగోలుచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తెలుగు వారిగా గిడుగు రామ్మూర్తికి రుణపడి ఉన్నాం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు 29,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగువారిగా మనమంతా గిడుగు రామ్మూర్తి పంతులు భాషాభ్యుతికి చేసిన సేవలు మరువలేని ఏపీ సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.,'ఎక్స్' వేదికగా తెలుగు వారందరికీ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.సామాన్యుల వాడుక భాషలో గ్రంథ రచన జరగాలని ఉద్యమించిన గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆ మహానుభావుని కారణంగానే ఈ రోజు మనం ఎన్నో పుస్తకాలు,పత్రికలను మనకు అర్థమయ్యే తెలుగులో చదవగలుగుతున్నామన్నారు. తెలుగు వారిగా మనందరం ఆయనకు రుణపడి ఉన్నామని చెప్పారు. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను స్మరించుకోవాలన్నారు.

### తెలుగు వెలగాలి, తెలుగు భాష వర్ధిల్లాలి : నారా లోకేష్

తెలుగు వెలగాలి,తెలుగు భాష వర్ధిల్లాలి అని మంత్రి నారా లోకేష్ అన్నారు. తెలుగు భాషా ఉద్యమకర్త గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు వికాసానికి ఆయన చేసిన సేవలను స్మరించుకోవాలన్నారు. ప్రపంచ వ్యాప_ంగా ఉన్న తెలుగువారందరికీ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## కామన్వెల్త్ దేశాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అజయ్‌బాబుకు బంగారు పతకం


వల్లూరు అజయ్ బాబు

**నెల్లిమర్ల (విజయనగరం జిల్లా), ఆగస్టు 29 ప్రభాతవార్త:** గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరుగుతున్న కామన్వెల్త్ దేశాల వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన వల్లూరు అజయ్ బాబు బంగారు పతకం సాధించి భారతదేశ కీర్తి ప్రతిష్టలు పెంచాడు. అజయ్‌బాబు ఈ పోటీలలో 79 కిలోల కేటగిరిలో పాల్గొని స్నాచ్‌లో 152 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 183 కేజీలు మొత్తంగా 335 కిలోలు బరువు ఎత్తి ఈ బంగారు పతకం సాధించాడు. బంగారు పతకం సాధించిన అజయ్ బాబును గ్రామ పెద్దలు దంతులూరి అజయ్ బాబు, మొయిద సత్యనారాయణ (శ్రీను), గదల సన్యాసినాయుడు, బంగారమ్మ, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు బెల్లాన లక్ష్మి, చల్లా రాము, సీనియర్ క్రీడాకారుడు, అంతర్జాతీయ పతక విజేత వల్లూరు శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.



## ఎస్సీ వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధం
### - మహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్

**రాజాం (విజయనగరం జిల్లా), ఆగస్టు 29 ప్రభాతవార్త:** రాజాం ప్రాంతీయ ప్రెస్ క్లబ్‌లో ఎస్సీలు వర్గీకరణ అంశంపై శుక్రవారం మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ ఎస్సీలను వర్గీకరించడం రాజ్యాంగ విరుద్ధమని, అవేమి లెక్కచేయకుండా రాజకీయ సౌలభ్యం కోసం వారికి ఇష్టం వచ్చినట్లుగా రాజ్యాంగ సవరణ చేస్తూ ఎస్సీ ఉప కులాలుగా విభజించి వారి మధ్య చిచ్చుపెట్టే పరిస్థితులను సృష్టిస్తున్నారని ప్రభుత్వాలపై మండిపడ్డారు. ఈ ఎస్సీ వర్గీకరణ కుట్రలో భాగంగా కేవలం మాల కులస్తులు మాత్రమే నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఎస్సీ వర్గీకరణ విషయంలో ముఖ్య పాత్ర పోషించిన బిజెపి ముఖ్య నేతలు కక్ష కట్టి ఈ విధంగా చేస్తుండడం విడ్డూరంగా ఉందని ప్రభుత్వాలపై ధ్వజమెత్తారు.తక్షణమే ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వర్గీకరణ ఆపకపోతే రాష్ట్రంలో వాడవాడలా ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాలకు అల్టిమేటం జారీ చేశారు. ఈ సమావేశంలో దళిత సంఘ నాయకులు జరజాన నీలయ్య, రామప్పడు, తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్‌ల ఖాతాల్లో త్వరలో రూ,1,121కోట్లు ఆర్థిక సంఘం నిధులు
### - గౌరవవేతనం పెంపునకు సిఎం చంద్రబాబు హామీ

**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వం సర్పంచ్‌ల నిధులను రూపాయి కూడా విడుదల చేయకుండా పక్కదారి పట్టించిందని, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రెండవ విడతగా 1,121 కోట్లరూపాయలు నిధులు సర్పంచ్‌ల ఖాతాల్లో జమకానుందని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వైవి బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. అంతేగాక సర్పంచ్‌లకు త్వరలోనే గౌరవవేతనం కూడా పెంచుతామని సిఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. తిరుపతి పర్యటనలో భాగంగా శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. కేంద్రంనుండి ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘంద్వారా పంపిన నిధులు గత ప్రభుత్వం రూపాయి కూడా సర్పంచుల ఖాతాల్లో జమచేయలేదన్నారు. 8,669కోట్ల రూపాయలు దారిమళ్ళించి పంచాయతీలను ,సర్పంచ్‌లను భ్రష్టుపట్టించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తొలివిడతగా 991కోట్ల రూపాయలు నిధులను సర్పంచుల ఖాతాల్లో జమచేసిందన్నారు. రెండోవిడతగా త్వరలోనే 1,121 కోట్ల రూపాయలు సర్పంచుల ఖాతాల్లో జమకానుందని రాజేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జడ్పీటిసిలు, ఎంపిపిలు, జడ్పీఛైర్మన్‌లు గౌరవ వేతనం కూడా పెంచేందుకు సిఎం హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలోని సర్పంచులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిధులు విడుదల చేసే వరకు పంచాయతీరాజ్ ఛాంబర్ ,సర్పంచుల సంఘం కృషి చేస్తుందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు 4,600కోట్ల రూపాయలతో గ్రామాల్లో రోడ్లు,డ్రైనేజీ పనులుకు నిధులువిడుదల చేయడం పట్ల సిఎం చంద్రబాబుకు,

డిసిఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్య నారాయణరెడ్డి తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ గౌరవ అధ్యక్షుడు పునులూరు నరేంద్ర, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మురళి, చుక్కా ధనంజయ్‌యాదవ్, అనిల్ పాల్గొన్నారు.

## తెలుగువారందరికి చిరస్మరణీయుడు గిడుగు
### - కథల సంపుటిని ఆవిష్కరించిన ఎపి ఎన్జీఒ అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్


అరవింద కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

**విజయవాడ, ఆగస్టు29,ప్రభాత వార్తప్రతినిధి:** గ్రాంధిక భాషను సరళ భాషగా, జనం వాడుక భాషగా తీర్చిదిద్దిన వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి తెలుగువారందరికీ చిరస్మరణీయుడేనని ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. స్థానిక బందరు రోడ్డులో గల ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గిడుగు జయంతి కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యాసాగర్ గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో వున్న శాసనాల లిపిని స్వతంత్రంగా నేర్చుకుని ఎన్నో చారిత్రక అంశాల్ని వెలికి తీసిన భాషాపండితుడు గిడుగు అన్నారు. మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ మాట్లాడుతూ తెలుగు మాసపత్రికను స్థాపించి శాస్త్రీయ వ్యాసాలతో నడిపి, వీరేశలింగం, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి వంటి ఉద్దండ కవుల్ని వ్యావహారిక భాషా ఉద్యమం వైపు నడిపించిన పత్రికా భాషోద్యమ నాయకుడు, సంఘసంస్కర్త గిడుగు వెంకట రామమూర్తి అని అన్నారు. ఈ సందర్భంగా కనుమరుగవుతున్న అనుబంధాలను ఉమ్మడి కుటుంబాల్లో పునరుజ్జీవింపజేసే 19 కథలతో జ్యోతి మువ్వల రచించిన అరవింద కథల సంపుటిని అలపర్తి విద్యాసాగర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ చొప్పా రాఘవేంద్రశేఖర్, ఏపీఎన్జీవో పశ్చిమ కృష్ణా అధ్యక్షుడు డి. సత్యనారాయణ రెడ్డి గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా క్రీడాకారులకు భారీగా ప్రోత్సాహకాలు
### : మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

విజయవాడ, ఆగస్టు 29, ప్రభాతవార్తప్రతినిధి: అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందచేయనున్నట్లు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రకటించారు. 43 మంది క్రీడాకారులకు రూ.4.09 కోట్ల ప్రోత్సాహకాలు ప్రభుత్వం ప్రకటించడం పట్ల మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారుల విజయాలకు సిఎం చంద్రబాబునాయుడు పట్టం కట్టాకన్నారు. క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ క్రీడాకారులకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ ల క్ష్యమని ఆయన ప్రకటించారు. క్రీడాశాఖ తరపున సిఎం చంద్రబాబుకు ఆయన ధ్యవాదాలుతెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారుల కృషి,ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమన్నారు. అంతర్జాతీయ వేదికపై తెలుగు రాష్ట్ర ప్రతిభ చాటిన క్రీడాకారులకు దక్కిన గౌరవం ఇదని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారుల కోసం భవిష్యత్తులో మరింత ప్రోత్సాహక చర్యలను ప్రభుత్వం చేపడుతుందని ఆయన ప్రకటించారు.

# చంద్రబాబు లీడర్ షిప్ వల్లే రాష్ట్రానికి గ్లోబల్ పరిశ్రమలు: నారా లోకేష్

**విశాఖపట్నం, ఆగస్టు 29:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజనరీ లీడర్ షిప్ వల్లే ఆర్సెలర్స్ మిట్టల్, గూగుల్ వంటి గ్లోబల్ కంపెనీలు రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. విడిభాగాల నుంచి పోటీతత్వం వరకు భారతదేశ ఏరో స్పేస్ తయారీ, ఎంఆర్ఓ రంగాలను వేగవంతం చేయడం అనే అంశంపై భారత విమానయాన మంత్రిత్వశాఖ, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (డి॥), సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మ్యానుఫాక్చరర్స్ సంయుక్త ఆధ్వర్యాన విశాఖ నోవా టెల్ హోటల్ జరిగిన సదస్సులో మంత్రి నారా లోకేష్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సదస్సులో పరిశ్రమ ప్రముఖులు, గ్లోబల్ ఒరిజినల్ ఎక్విప్ మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ (వీనిల్బీ), ఎంఎస్ఎంఇలు, విద్యావేత్తలు, ఏరోస్పేస్, రక్షణరంగ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... చంద్రబాబు గారు శంషాబాద్ ఎయిర్ పోర్టు నిర్మాణాన్ని ప్రారంభించినపుడు 5వేల ఎకరాలు ఎందుకని కొందరు విమర్శలుచేశారు, ఈరోజు తెలంగా రాష్ట్ర జీఎస్‌డిపిలో 11శాతం ఒక్క శంషాబాద్ ఎయిర్ పోర్టు వల్లే ఆ రాష్ట్రానికి సమకూరుతోంది. ఇప్పుడు అదే విజనరీ నేతృత్వంలో మనకు భోగాపురం ఎయిర్ పోర్టు రాబోతోంది. దీనిద్వారా ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయి. ప్రధాని మోడీజీ, ముఖ్యమంత్రి చంద్రబాబు గారి నేతృత్వంలో ప్రస్తుతం ఎపిలో డబుల్ ఇంజన్ సర్కారు పనిచేస్తోంది, సుందరమైన విశాఖనగరంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన ఎకో సిస్టమ్ అందుబాటులో ఉంది. విజన్ 2047 లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రతిఏటా 15శాతం వృద్ధిరేటు సాధించాల్సి ఉంది. స్పష్టమైన విజన్ తో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధి కోసం అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు.రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు మూడు ముఖ్యమైన అనుకూలతలు ఇక్కడ ఉన్నాయి. ఒకటి విజనరీ లీడర్ షిప్, రెండోది అనుభవజ్ఞులైన యువ నాయకత్వం, మూడవది స్టార్టప్ రాష్ట్రం. చంద్రబాబుగారి విజన్, సమర్థ నాయకత్వంలో ఎపి పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుతుంది. ఎపి ఏరోస్పేస్, డిఫెన్స్ సలహాదారుగా సతీష్ రెడ్డి లాంటి ప్రముఖులు కీలకమైన సలహాలు అందిస్తుండగా, సాయికాంత్ వర్మ లాంటి యువ ఐఎఎస్ అధికారులు పెట్టుబడులను పర్యవేక్షి స్తున్నారు.

భారతదేశ చరిత్రలో అత్యంత పిన్నవయస్కుడైన రామ్మోహన్ నాయుడు లాంటి యువనాయకత్వం ఎపిలో ఉంది. అక్టోబర్ లో ఆర్సెలర్స్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభం కాబోతున్నాయి. ఆసియా లోనే అతిపెద్దదైన గూగుల్ డాటా సెంటర్ కు రాబోతోంది. పునరుత్పాదక ఇంధన రంగంలో వేగంగా అడుగులు వేస్తున్నాం.

## అభిమాని రాజేశ్వరి పట్ల మెగాస్టార్ చిరంజీవి ఆత్మీయ స్పందన



**ఆదోని ఆగస్టు 29 ప్రభాతవార్త :** మహోన్నతమైన వ్యక్తిత్వం, యెనలేని సేవాతత్వంతో కోట్లాది మంది అభిమానుల గుండెల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించిన మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన మానవత్వాన్ని చాటారు.ఆంధ్రప్రదేశ్‌లోని ఆదోని పట్టణానికి చెందిన చిరంజీవి వీరాభిమాని రాజేశ్వరి, మెగాస్టార్ ని కలవాలనే కలతో సైకిల్‌పై హైదరాబాద్‌కు సాహసోపేత ప్రయాణం మొదలుపెట్టారు. ఎన్నో శారీరక, మానసిక సవాళ్లు ఎదురైనా చిరంజీవిపై వున్న అపారమైన అభిమానమే ఆమెను విజయవంతంగా ముందుకు నడిపింది. ఈ విషయం తెలుసుకున్న మెగాస్టార్ చిరంజీవి, రాజేశ్వరిని హృదయపూర్వకంగా ఆహ్వానించారు. ఆమె అంకితభావానికి, తనను చేరుకోవడానికి చేసిన కృషికి చలించిపోయిన చిరు, ఒక చిరస్మరణీయ జ్ఞాపకాన్ని ఇచ్చారు.

ఆ సందర్భంలో రాజేశ్వరి, మెగాస్టార్ కి రాఖీ కట్టగా, ఆమెకు ఆశీస్సులు అందించి అందమైన సాంప్రదాయ చీరను బహుమతిగా ఇచ్చారు.ఈ సమావేశంలో ప్రధాన ఘట్టం చిరంజీవి తన మానవతా విలువలను చాటిన విధానం. రాజేశ్వరి పిల్లల విద్య కోసం, వారి భవిష్యత్ లో వెలుగునింపడం కోసం పూర్తి స్థాయి ఆర్థిక సహాయం అందించనున్నట్లు హామీ ఇచ్చారు చిరు. తన అభిమానులను కేవలం అభిమానులుగానే కాక, కుటుంబ సభ్యుల్లా చూసుకునే చిరంజీవి గొప్ప మనసుకు ఇది మరొక ఉదాహరణగా నిలిచింది. సినిమాల్లోనే కాదు, నిజ జీవితంలో కూడా చిరంజీవి మెగాస్టార్ అని చాటి చెప్పింది.

## బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధుల నియామకం

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులను నియమించిన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ జాబితాను విడుదల చేశారు. వాకాటి నారాయణరెడ్డి(నెల్లూరు), పూడి తిరుపతిరావు(శ్రీకాకుళం), సాదినేని యామినీశర్మ, షేక్ బాజీ(ఎన్టీఆర్), పెద్దిరెడ్డి రవికిరణ్(కాకినాడ), ముళ్ళపూడి రేణుక(పశ్చిమ గోదావరి), వినూషారెడ్డి(కర్నూలు) కె.సుహాసినీ ఆనంద్(విశాఖపట్నం), నల్లా పవన్‌కుమార్(అంబేద్కర్ కోనసీమ), జల్లి మధుసూధన్(తిరుపతి), కెబీఎన్‌బీ నరసింగరావు(కర్నూలు), డి.శ్రీనివాస్(గుంటూరు), వంగల శశిభూషణ్‌రెడ్డి (కడప), చిరువోలు బుచ్చిరాజు(మచిలీపట్నం)లను నియమించినట్లు ప్రకటించారు.

## మాజీ మంత్రి, దివంగత నందమూరి హరికృష్ణకు సిఎం చంద్రబాబు ఘన నివాళి

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి దివంగత నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా ఏపీ సిఎం చంద్రబాబు నివాళులర్పించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. 'నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పిస్తున్నాను. కేవలం బంధుత్వం మాత్రమే కాదు...అంత కంటే ఎక్కువగా ఆత్మీయతను,స్నేహాన్ని మేమిద్దరం పంచుకున్నాం. కుటుంబ సభ్యులకే కాదు... పార్టీ కార్యకర్తలు,ప్రజలు,నందమూరి అభిమానులకు కూడా ఆత్మీయతను పంచిన మంచి మనిషి హరికృష్ణ' అని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన వ్యక్తిత్వం,నిక్కచ్చితనం మరువలేని వన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.తెలుగుదేశం పార్టీ నిర్మాణంలో నందమూరి తారక రామారావుకు హరికృష్ణ ఎంతగానో సహకరించారన్నారు.

## నేటి నుంచి సీమలో డబ్లింగ్ రైలు మార్గం అనుసంధాన పనులు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 29,ప్రభాతవార్త** రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలోని పాణ్యం-నంద్యాల మధ్య పూర్తి చేసిన 14.53కి.మీల డబ్లింగ్, విద్యుత్ రైలుమార్గానికి రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానపరిచే సాంకేతిక పనులను శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారవర్గాలు తెలిపాయి.

గుంటూరు- గుంతకల్లు డబ్లింగ్,విద్యుత్ రైలు మార్గంలో అంతర్భాగమైన ప్రీ-ఎన్ఐ,నాన్ ఇంటర్లాకింగ్ పనులను ఈ నెల 30న శనివారం నుండి సెప్టెంబరు 4వరకు నిర్వహించనున్నట్లు

# తిరుమల సమాచారం

## శేషాచలంలో ఔషధ వనాల అభివృద్ధి
### - యేడాదిలో 20వేల మొక్కలు నాటడం లక్ష్యం



**తిరుమల,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంఅటవీప్రాంతాన్ని పూర్తిగా పచ్చదనం పెంపొందించడంతోబాటు పర్యావరణం పరిరక్షణకు తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీకారం చుట్టింది. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో శేషాచలంఅడవిని, తిరుమల అటవీప్రాంతాన్ని మరింత పచ్చదనం పెంపొందించే చర్యలు చేపడుతున్నారు. తిరుమలలో అటవీ వృక్షసంపద,మానవ వన్యప్రాణుల సంఘర్షణ నివారణ చర్యలపై టిటిడి జెఇఒ వీరబ్రహ్మం,డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడుతో ఇఒ శ్యామలరావు సమీక్షించారు. గత ఏడాది తిరుమలలో చేపట్టిన వృక్షారోహణ కార్యక్రమాలు, అకేసియా ఆరికులిఫార్మిస్ వృక్షాల స్థానంలో స్థానిక వృక్షజాతుల పెంపకం, ఔషధవనాల వృద్ధి, సుస్థిర అటవీపునరుద్ధరణ చర్యలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. గత ఏడాదిలో లక్ష్యంగా పెట్టుకున్న 20వేల మొక్కల్లో ఇప్పటివరకు రావి, తాండ్ర, ఉసిరి,వెలగ,జువ్వి, మర్రి,నేరేడు,ఎర్రచందనం వంటి జాతులు 7వేల మొక్కలు నాటడం జరిగిందన్నారు. వన్యప్రాణుల కదలికల్లో భాగంగా అలిపిరి-తిరుమల మార్గాల ఇరువైపులా 60 ట్రాప్‌కెమెరాలు, 31 సౌరశక్తితోనడిచే యాక్టివ్ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వన్యప్రాణుల కదలికలపై పర్యవేక్షణ ఉందన్నారు. తిరుమలకు సమగ్ర పర్యావరణ సుస్థిర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

## శ్రీవారి సేవలో హైకోర్టు జడ్జి - వెంకట జ్యోతిర్మయి ప్రతాప



**తిరుమల,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి శుక్రవారం ఉదయం నైవేద్య విరామసమయంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప దర్శించుకున్నారు. కుటుంబంతో కలసి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

## అందరికీ శుభాలు కలగాలి : ప్రముఖులు



**తిరుమల,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు కలగాలని, సుఖసంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. శుక్రవారం ఉదయం కేరళ డిజిపి రవాడ ఎచంద్రశేఖర్, తెలంగాణ రాష్ట్రమంత్రి లక్ష్మణకుమార్, సినీనటి ఐశ్వర్యరాజేశ్ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు.
ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తులకు అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు
### - గ్యాలరీల్లో సకల సదుపాయాలు



**తిరుమల,ఆగస్టు 29ప్రభాత వార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి మరో ఇరవైరోజుల్లో ఆరంభంకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయనున్న సామాన్యభక్తులకు అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లుచేస్తున్నట్లు టిటిడి అదనపు ఇఒవెంకయ్యచౌదరి తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో మాఢవీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు జరుగుతోందని ,భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. ఉదయం,రాత్రి వాహనసేవలసమయంలో గ్యాలరీల్లో, మాఢవీధుల్లో వేచి ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్ని విధాలా సదుపాయాలు ఉంటాయన్నారు. వైద్యసేవలు, మరుగుదొడ్లు, తాగునీరు. అన్నప్రసాదాలు, కాఫీ, పాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆలయ మాఢవీధుల్లో, ఆలయుం ముందు, వాహనమండపం ప్రాంతాల్లో ఆధ్యాత్మికతతో రంగవల్లులు తీర్చిదిద్దడం, బారికేడ్లు, గ్యాలరీలు ఏర్పాటు, వంటి పనులు పూర్తిదశకు చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం ఆలయ మాఢవీధుల్లో పనులను టిటిడి అదనపు ఇఒ చిరూ మామిళ్ళ వెంకయ్యచౌదరి, సిఇ సత్యనారాయణ, ఇఇ సుబ్రమణ్యం, సివిఎస్ఒ మురళీకృష్ణ, విఎస్ఒ రాజశేఖర్, ఆలయ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో కలసి చౌదరి తనిఖీ చేశారు. మాఢవీధుల్లో భక్తులకు అసౌకర్యం లేకుండా మరింత ఏర్పాట్లుపై సూచనలు చేశారు. వాహనసేవలు జరిగే సమయంలో భక్తులు గ్యాలరీల్లోకి సులభంగా చేరుకునేలా, తిరిగి వెలుపలకు వెళ్ళేలా సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు.రద్దీ నియంత్రణ, క్రమబద్దీకరణ ప్రశాంతంగా ఉండాలన్నారు.

## జగన్ మోడీకి దత్తపుత్రుడు, అందుకే సిబిఐ గొంతు నొక్కేస్తున్నారు : పిసిసి అధ్యక్షురాలు షర్మిల



**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** జగన్ మోదీకి దత్తపుత్రుడని అందుకే సీబీఐ ఆయన విషయంలో మెతక వైఖరిని ప్రదర్శిస్తుందని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆరోపించారు. మోదీ చేతిలో సీబీఐ కీలు బొమ్మ అని.. జగన్ కోసం మోదీ సీబీఐ గొంతు నొక్కారని అన్నారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుపైసంచలన కామెంట్స్ చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆమె.. వివేకా హత్య విషయంలో మళ్లీ దర్యాప్తు ఎందుకు చేపట్టవద్దని ప్రశ్నించారు. వై నాట్? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు ఒకటే పోరాటం అని.. ఇంత వరకు న్యాయం జరుగలేదన్నారు. సునీత పోరాటంలో న్యాయం ఉందన్నారు. జగన్ కోసం అవినాష్ రెడ్డిని కూడా కాపాడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. నిజంగా సీబీఐ అనుకుంటే ఎప్పుడో దోషులకు శిక్ష పడేదన్నారు. వివేకా హత్య కేసులో అన్ని ఆధారాలు ఉన్నాయని.. గూగుల్ మ్యాప్ లొకేషన్లు కూడా ఉన్నాయని షర్మిల పేర్కొన్నారు. వైఎస్ వివేకా హత్య జరిగినప్పుడు అవినాష్ రెడ్డి సంఘటనా స్థలంలో ఉన్నాడని.. ఇందుకు సంబంధించి సాక్ష్యాధారాలు కూడా ఉన్నాయని షర్మిల తెలిపారు. ఇన్ని ఆధారాలు ఉన్నప్పటికీ.. న్యాయం ఎందుకు జరుగడం లేదని ప్రశ్నించారామె. సీబీఐ విచారణ సరిగా లేదంటూ సునీత చేసిన ఆరోపణల్లో నిజముందన్నారు. మైనార్టీల హక్కుల పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి విలువ లేదన్నారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్‌ల మధ్య చిచ్చుపెట్టడమే బిజెపి సిద్ధాంతమన్నారు. ఆ చిచ్చులో చలి కాచుకొంటుందన్నారు. సిఎఎ, వక్ఫ్ బిల్లు సవరణ, ఆర్టికల్ 370, అయోధ్య రామమందిరం వంటి వివాదాలతో ముస్లింల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశారన్నారు. రాష్ట్రంలో టిపిడి, వైసిపి, జనసేన మూడు బిజెపి పార్టీలేనన్నారు. టిడిపి, జనసేన బహిరంగ పొత్తులో ఉంటే, వైసిపి అధినేత జగన్‌ది అక్రమ పొత్తుగా పేర్కొన్నారు. సెక్యులర్ పార్టీల ముసుగులో మైనార్టీలను టిడిపి, వైసిపిలు మోసం చేస్తున్నాయని తెలిపారు. మైనార్టీల ప్రయోజనాలు దెబ్బతినే అన్ని బిల్లులకు ఈ పార్టీలు మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు, జగన్ ఇద్దరూమైనార్టీ ద్రోహులేనన్నారు. 45, 50 ఏళ్లకే పెన్షన్లు ఇస్తామని చెప్పారన్నారు.

వార్త

కోపంగా ఉన్నప్పుడు నీవు ఏ పని చేయొద్దు, అప్పుడు అన్నీ పొరపాటే చేస్తావు.

-బల్జాక్

# సుంకాల 'సమరం'!

భారత దేశ వాణిజ్య రంగంలో సుంకాల ప్రహసనం మొదలైంది. రష్యా చమురుతో ముడిపెట్టి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ ను చిన్నబుచ్చాలని చేస్తున్న ప్రయత్నమే ఈ సంకల మోత. అసలు కారణం ఏదైనా అమెరికా వాదన లోప భూయిష్టంగా ఉంది. ఈ విషయమై భారత్ కార్పొరేట్ వర్గాల్లో అసహనం వ్యక్తమోతోంది. ఇదేదీ తేలికగా తీసుకునే విషయం కానే కాదని ఇంటా బయట నుంచి భారత్ కి సూచనలందుతున్నాయి. అమెరికా భారత్ మీద రుద్దనున్న అనేకానేక సుంకాలు భారతీయ వాణిజ్యానికి పక్కలో బల్లెంలా గుచ్చుకుంటున్న విషయం సర్వులకూ విదితమే. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితికి ట్రంప్ సుంకాల పోటీయే కారణం. ఈ భారీ సుంకాలు స్టాక్ మార్కెట్ ను విపరీతంగా కుదిపేస్తు న్నాయి. నిన్న మొన్నటి వరకు భారత్ ఎగుమతులపై 25 సరిపెట్టుకున్న ట్రంప్ బుధవారం నుంచి మరో 25 శాతం వడ్డించారు. దాంతో గత రెండు రోజులుగా సెన్సెక్స్ 1555 పాయింట్లు పతనమయ్యాయి. రూ69 లక్షల కోట్లు మార్కెట్ సంపద ఆవిరైంది. ట్రంప్ టారిఫ్ ల ప్రభావంతో ప్రస్తుతం మార్కెట్లో అన్నీ ప్రతికూలతలే ఎదురవుతున్న తరుణంలో కార్పొరేట్ వర్గాలను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆశిష్ కుమార్ చౌహాన్ ఊరడించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా అమెరికా సుంకాల పోటుతో రొయ్యలు, తోలు , జెమ్స్, జ్యువెలరీ కంపెనీల షేర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. త్వరలో భారత్ ప్రపంచం లోనే మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న తరుణంలో అమెరికా సుంకాలు ఆశనిపాతంలా పరిణమించాయి. ఇలాంటి పరిస్థితుల్లో కూడా కార్పొరేట్ కంపెనీలు అమెరికా సుంకాలను తట్టుకుని నిలబడగలమన్న భరోసాతో ఉన్నాయి. అమెరికా భారత్ ఎగుమతులపై సుంకాలు వేసి ఇబ్బంది పెట్టడం ఒక విధంగా భారత మేలుకొలుపు అని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ వ్యక్తం చేశారు . ఏ ఒక్క దేశం మీద అతిగా ఆధారపడ కూడదని ఈ ఉదంతం సూచిస్తోందని ఆయన అభిప్రాయం. అందుకే కేవలం భారత్‌నే సుంకాలతో వేధించడం అమెరికా అవివేకాన్ని తెలియ చేస్తోందని పలువురు ఆర్థిక శాస్త్రవేత్తలు సైతం వ్యాఖ్యా నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చైనా, జపాన్, యూరప్ , వంటి అన్ని దేశాల్లోనూ సమాన స్థాయిలో వాణిజ్య సంబంధాలు ఏర్పరచుకోవడం ద్వారా భారత్ ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకుంతుంతుందన్నది వారి విశ్వా సం. మాస్కో యుద్ధానికి భారత్ పరీక్ష సహకారం అందిస్తోందని ట్రంప్ ప్రధాన సలహాదారు, ప్రముఖ ఆర్థిక వేత నవారో వ్యాఖ్యానించడాన్ని చూస్తే భారత విస్మయం చెందుతోంది. రష్యా ఉక్రెయిన్ యుద్ధం భారత అండదండలతోనే జరుగుతోందన్న అపవాదు కూడా ఆశ్చర్యపరుస్తోంది. రష్యా నుంచి చౌకగా చమురు కొనుగోలు చేస్తూ రష్యాకు భారత్ ఆర్థిక అవసరాలు తీరుస్తోందని అమెరికా ఆరోపణ.అందుచేతనే రష్యా అధ్యక్షుడు పుతిన్ దిగి రావడం లేదని ,ట్రంప్ వంది మాగదులు అమెరికన్లలో విస్తృత వ్యాప్తి చేస్తున్నారు. రష్యా నుంచి భారత చమురు కొనడం ఆపివేస్తే భారత పై ట్రంప్ వడ్డించిన సుంకాలు ఉపసంహారణకుఅవకాశం ఉందని వారు భారత్ కు సూచిస్తున్నారు. ఈ టారిఫ్ ల సమస్య పరిష్కారానికి ఇరు దేశాల మధ్య సంప్రదింపు లకు ఇప్పటికీ మార్గాలు తెరిచే ఉన్నాయని అమెరికన్ చట్టసభ విదేశీ వ్యవహారాల కమిటీ పేర్కొంది. రష్యా నుంచి చౌకగా చమురు లభిస్తున్నందునే కొనుగోలు చేస్తున్నామని భారత్ వివరించిన అమెరికా వితండ వాదం తగ్గనే లేదు.అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందం పేరిట వాణిజ్య ఒప్పందం ఖరారైనా అందులో వినాశకర అంశాలుండవన్న గ్యారంటీ ఏమీ లేదు. ఆ ఒప్పందం లో భారతీయ రైతాంగానికి నష్టం చేసే అంశాలను అనుమతించేదిలేదని ప్రధాని నరేంద్ర మోదీ ఏనాడో స్పష్టం చేశారు. అమెరికాకు రైతన్న ప్రయోజనాలు తాకట్టు పెట్టబోమని చెప్పారు. ఇదిలా ఉండగా అందుకే దేశ గౌరవం మర్యాదలే ముఖ్యమని,దౌత్య విధానాలను పాటించకుండా ట్రంపు సుంకాల వడ్డింపు ఆయుధాన్ని ఎన్నుకోవడం తప్పని మారుతి సుజుకి ఇండియా చైర్మన్ ఆర్ సి భార్గవ్ విమర్శించారు . ట్రంపు సుంకాలతో దెబ్బతిన్న నవగుమతి కంపెనీలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవడం ఆహ్వానించదగిన పరిణామం. దీనికోసం ఆరేళ్ల పాటు అమలులో ఉండే విధంగా రూ. 25 వేల కోట్ల నిధులతో ఎగుమతుల ప్రోత్సాహక కమిషన్ ను ఏర్పాటు చేయబోతున్నారు. ఒకపక్క పాకిస్థాన్‌కు సర్వవేళలా అభయహస్త మందిస్తూ భారతను చీకాకు పెట్టడంలో అమెరికా పాత్ర తక్కువేమీ కాదు.రష్యా చమురుకూ ,ఉక్రెయిన్ యుద్ధానికి మోకాలికి బోడి గుండుకు ముడిపెట్టినట్లు బ్లాక్ మెయిలింగ్, బెదిరింపు ధోరణిని అవలంబిస్తున్న ట్రంప్ మార్గాన్ని ఎవరూ హర్షించడం లేదు. రష్యా నుంచి చమురు కొనుగోలు భారత్ ఆపనూ లేదు. అమెరికాకు తలొగ్గి భారత మార్కెట్ కు అత్యంత వినాశకర వాణిజ్య ఒప్పందాన్ని అంగీకరించను లేదు. దౌత్యపర సంబంధాల ద్వారానే అమెరికాను ఒప్పించగల చాణక్యాన్ని ప్రదర్శించి సానుకూల ఫలితాలను దేశానికి అందివ్వగలుగుతుంది. ట్రంప్ ధోరణి ఆత్మహత్య సదృశ మని అమెరికన్ ఆర్థిక వేత్త రిచర్డ్ వోల్ఫ్ కూడా హెచ్చరిం చారు. ఈ నేపథ్యంలో భారత్ అమెరికా మైత్రి కొనసాగించే దౌత్యవేత్తలను రంగంలోకి దింపాల్సిన అవసరం ఉంది.

# ప్రకృతితో పరాచికాలు వద్దు

**మొన్న ఆ మధ్య చైనాలో ప్రకృతి సృష్టించిన విలయం ఇందుకు సజీవ సాక్ష్యంగా చెప్పవచ్చు. సాంకేతికంగా, ఆర్థికంగా, ఎన్నో రంగాల్లో సాటిలేని అభివృద్ధి సాధించామని విర్రవీగే చైనీయులు కూడా ప్రకృతి ముందు తలవచక తప్పలేదు. ఒక్క చైనాయే కాదు ప్రపంచంలోని అనేక దేశాలు ఈ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. భారత్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చిన్నా చితక వానలకే దేశంలోని అనేక నగరాల పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతుంది. ముంబాయి నగరానికి అయితే ప్రతి వర్షాకాలంలోనూ వరద ముంపు తప్పడం లేదు. రోజుల తరబడి జీవనం స్తంభించిపోతున్నది. అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫాన్‌ల భారి నుంచి తీరప్రాంత ప్రజలు తప్పించుకోలేకపోతున్నారు. గత రెండు నెలలుగా బంగాళాఖాతలంలో అల్పపీడనమో, వాయుగుండమో, తుఫాన్‌లతో కురుస్తున్న వర్షాలతో తదితర రాష్ట్రాల ప్రజలు వణికిపోతున్నారు.**

దామెర్ల సాయిబాబ

తమలపాకుతో నువ్వొట్లంటే తలుపు చెక్కతో నేనట్లంటా అన్నట్టుగా వ్యవహరిస్తున్నది మానవాళితో ప్రకృతి.

విశ్వవ్యాప్తంగా మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదాని వెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తుల నష్టాలకు కారణమవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనూహ్యమైన మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఇందుకు తప్పుపట్టాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. గత నెల రోజులుగా భారత్‌లో కురుస్తున్న కుండపోత వర్షాలు దేశంలోని కొన్ని ప్రాంతాలను అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరభారత్‌లోని జమ్ము కశ్మీర్, హిమాచలప్రదేశ్, ఉత్తరాఖండ్, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాలతోపాటు తెలుగురాష్ట్రాల్లో కూడా బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. కొండచరియలు విరిగిపడుతుండంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్థంబించిపోతున్నది. పురాతన భవనాలు కూలిపోతున్నాయి. ఎందరి ప్రాణాలో నీటిలో కలిసిపోతున్నాయి. మరెందరో గల్లంతైపోతున్నారు. వ్యవసాయ రంగానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతాకాదు. ఇక తెలుగు రాష్ట్రాల్లో గత వారం పది రోజులుగా కురిసిన, కురుస్తున్న కుంభవృష్టి తెలంగాణాలో కామారెడ్డి, నిర్మల్, అదిలాబాద్, మెదక్ తదితర జిల్లాలలో జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నది. ముఖ్యంగా కామారెడి, నిర్మల్, అదిలాబాద్ ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో ఇటీవల కాలంలో ఎన్నడు లేని విధంగా రికార్డు స్థాయిలో నలభైఅయిదు సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదు అయింది. ఆయా ప్రాంతాల్లో ప్రజాజీవనం స్థంబించి పోయింది. కొన్ని గ్రామాలకు బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ప్రకృతి పగబట్టితే ఎంతటి విధ్వంసం సృష్టించగలదో చూపిస్తున్నది. ఇంకా వర్షాకాలం మరో మూడు నెలలు వరకు ఉంది. మరెన్ని వాయు గుండాలు, తుఫాన్లు రానున్నాయో చెప్పలేం. ఇప్పటికే భారీ ప్రాజెక్టులతో సహా చిన్ననీటి వనరులన్నీ పొంగిపొర్లుతున్నాయి. మరికొన్ని ప్రమాదకర స్థాయిలో ఉన్నాయి. పర్యావరణానికి మానవుడు చేస్తున్న చేటుతోనే ఈ పరిస్థితి దాపురిస్తున్నదనీ, ఇదే కొనసాగితే అసలు మానవుడి జీవనమే ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, దశాబ్దాల తరబడి పదేపదే హెచ్చరిస్తున్నా, వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. ఒక్క భారతదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా పర్యావరణ పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారుతున్నది. ముఖ్యంగా అడవులు తరిగిపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుంది. వాస్తవంగా భూమ్మీద ముప్పై శాతానికి పైగా అడవులు విస్తరించి ఉన్నాయి. ప్రపంచ జనాభాలో మూడోవంతు ప్రజలు వంటచెరుకు కోసం ఇప్పటికీ అడవుల మీదనే ఆధారపడుతున్నారు. అంతేకాదు అటవీరంగంపై ప్రత్యక్షంగానో, పరక్షంగానో ఉపాధి పొందుతున్నవారు భారీ ఎత్తునే ఉన్నారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో నాలుగోవంతు ప్రజలు వాటి నుంచే ఆదాయాన్ని పొందుతూ జీవనం సాగిస్తున్నారు. కోట్లాది వన్యప్రాణులకు అడవులు ఆవాసం కల్పిస్తున్నాయి. మానవాళికే కాదు సమస్త జీవకోటికి వివిధ రకాలుగా ఉపయుక్తమవుతున్న అటవీ సంపద అంతకంతకు తరిగిపోతున్నది. రెండేళ్ల క్రితం నాటి ప్రపంచ అడవుల స్థితిగతుల నివేదిక ప్రకారం గత రెండున్నర శతాబ్దాల కాలంలో నూటనాలుగు కోట్ల

## ఒక్క మాట

ఎకరాలకుపైగా అడవులు కనుమరుగైనట్లు వెల్లడయింది. ఇక భారతదేశానికి సంబంధించి 2021 నివేదిక ప్రకారం దేశంలో దట్టమైన ఈ అరణ్యాలు కొంతమేరకు పెరిగినప్పటికీ మధ్యస్థసాంద్రమైన అడవులు క్షీణిస్తున్నాయి. భారత్‌లో ముప్ఫైశాతం మేర కార్చిచ్చులకు గురవుతున్నాయి. ఈశాన్య ప్రాంతాలు పశ్చిమ, మహారాష్ట్ర, దక్షిణ ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో వివిధ జిల్లాల పరిధిలో ఉన్న అడవుల్లో కారుచిచ్చుల ముప్పు అధికంగా ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ఇకపోతే అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలు పెట్టి కొండలు తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలు, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాలు పంట పొలాలు జనావాసాలుగా మార్చడం ఇలా ఒక్కటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతున్నారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ కొనసాగుతూనే ఉంది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మరో పదేళ్లలో ఇండియా జనాభా నూట నలభైఐదు కోట్లకు చేరుకుంటుందని, అందుకు తగినట్లుగా దేశంలోని సహజవనరులపై ఒత్తిడి పెరుగుతుందని ప్రధానంగా అటవీ సంపద అత్యంత వేగంగా హరించుకు పోతుందని స్పష్టం చేసింది. ఇప్పటికే భారత్‌లో రోజుకూ దాదాపు మూడువందల ముప్పై ఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని ఐక్యరాజ్యసమితి నివేదికలో స్పష్టం చేసింది. బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు నదీలోయ ప్రాజెక్టుల కోసం యధేచ్ఛగా అడవులు నరికివేస్తున్నారు. రోడ్ల అభివృద్ధికి సోపానాలు అయినా ఆ రహదారులే అడవులను అక్రమంగా నరికివేసి రవాణా చేసేందుకు స్మగ్లర్లకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించలేక పోతున్నాం. ఇందువల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. ఒక ప్లాస్టిక్ సంచి మట్టిలో కలిసి పోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. పెరుగుతున్న వాహనాల సంఖ్యకు రెట్టింపు స్థాయిలో వాహన కాలుష్యంతోపాటు పరిశ్రమలు వదులుతున్న పొగ అన్నీ కలిపి వాయు కాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఇలాంటి రకరకాల కారణాలతో భూఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇలా ప్రకృతితో ఎన్నో రకాలుగా మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతీకగా ప్రకృతి తీవ్రంగా స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం, కురిస్తే ఒకేసారి ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం ఇటీవల కాలంలో పెరిగిపోతున్నది. అంతేకాదు వరదలు, తుఫాన్లతో పాటు భూకంపాలు లాంటి ఉపద్రవాలు తరచుగా మాన వాళిపైదాడి చేస్తున్నాయి. యేటా దాదాపు ప్రపంచ వ్యాప్తంగా మూడువందల ఎనభైకిపైగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా యేటా లక్షలాది మంది ఈ ఉపద్రవాలతో ప్రాణాలు వదులుకుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో అనారోగ్యం పాలవుతున్నారు. ఆస్తుల నష్టాల గురించి చెప్పాల్సిన పనిలేదు. అయితే పాలకులు తీసుకుంటే ముందు జాగ్రత్త చర్యల వల్ల ప్రాణ, ఆస్తుల నష్టం కొంతమేరకు నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణం సమతుల్యం దెబ్బతిన్నకారణంగా విజృంభిస్తున్న ప్రకృతికి అడ్డుకట్టవేయలేకపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదించినా ఆధునికంగా ఎంత పురోభివృద్ధివైపు పయనించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుంచి మానవుడు బయటపడలేక పోతున్నారు. మొన్న ఆ మధ్య చైనాలో ప్రకృతి సృష్టించిన విలయం ఇందుకు సజీవ సాక్ష్యంగా చెప్పవచ్చు. సాంకేతికంగా, ఆర్థికంగా, ఎన్నో రంగాల్లో సాటిలేని అభివృద్ధి సాధించామని విర్రవీగే చైనీయులు కూడా ప్రకృతి ముందు తలవచక తప్పలేదు. ఒక్క చైనాయే కాదు ప్రపంచంలోని అనేక దేశాలు ఈ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. భారత్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చిన్నాచితక వానలకే దేశంలోని అనేక నగరాల పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతుంది. ముంబాయి నగరానికి అయితే ప్రతి వర్షాకాలంలోనూ వరద ముంపు తప్పడం లేదు. రోజుల తరబడి జీవనం స్తంభించిపోతున్నది. అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫాన్‌ల భారి నుంచి తీరప్రాంత ప్రజలు తప్పించుకోలేకపోతున్నారు. గత రెండు నెలలుగా బంగాళాఖాతలంలో అల్పపీడనమో, వాయుగుండమో, తుఫాన్‌లతో కురుస్తున్న వర్షాలతో తదితర రాష్ట్రాల ప్రజలు వణికిపోతున్నారు. 1993లో మహారాష్ట్ర లాతూర్‌లో సంభవించిన భూకంపం ఎన్నో కుటుంబాలను చిదిమేసింది. 2004లో సునామీ, ఇటీవల తరచుగా వస్తున్న భూకంపాలు అతలాకుతలం చేస్తున్నాయి. ఉత్తరాఖండ్ పరిస్థితి అయితే అంచనాలకు అందదు. ఎప్పుడు ఏ రూపంలో వరదలు, భూకంపాలు ముంచుకు వస్తాయో చెప్పలేని పరిస్థితి. ఏదిఏమైనా ఈ ఉపద్రవాలను నియంత్రించి పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణ శుద్ధిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఇందులో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా భారీమూల్యం చెల్లించక తప్పదు. ●

చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందు చూపు ఎంతో అవసరం.



వి.జాన్సన్

ధైర్యం ఒక ఆయుధం. దాన్ని పట్టుకుంటే అసాధ్యాలన్నీ సుసాధ్యాలౌతాయి.



జార్జి. ఎలియట్

# ప్రజావాక్కు



### మార్వాడీ గోబ్యాక్ నినాదం సరికాదు

దేశంలో ప్రజలు, వ్యాపారులు ఏ రాష్ట్రంలోనైనా ఉపాధి పొందే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించింది. భారత పౌర సత్వం కలిగిన వారు తిరిగి ఏ రాష్ట్రంలో కూడా స్థానిక పౌరసత్యం పొందవలసిన అవసరం లేదు. నిరుద్యోగులు, వ్యాపారులు, సాంకేతిక నిపుణులు తమకు ఎక్కడైతే మెరుగైన ఉపాధి లబిస్తుందో అక్కడికి వెళ్లి చట్టాలకు లోబడి తమ కార్య కలాపాలను కొనసాగించుకోవచ్చు. ఈ విషయంలో ఎటువంటి అనుమానాలు అవసరం లేదు. అయితే ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో మార్వాడీ గోబ్యాక్ అనే నినాదం పుట్టుకువచ్చింది. ఈ నినాదానికి రాజకీయాలు తోడు కావడంతో ప్రస్తుతం ఈ అంశం ఎక్కువగా అం దరి ప్రచారంలో ఉంది. గతంలో ఒక మాజీ న్యాయ మూర్తి వైశ్యులు స్మగ్లర్లుగా పేర్కొన్నారు. అప్పట్లో ఈ అంశం తెగ వైరల్ అయ్యింది. కొందరు వైశ్యులు తమ వ్యాపారాల విషయంలో కొంత భయాం దోళనలకు గురైయ్యారు. కొంతకాలానికి ఇది సద్దుమణిగింది. ప్రస్తుతం అదే వైశ్యులను రెచ్చగొడుతూ మార్వాడీలపై గోబ్యాక్ నినాదాన్ని లేవనెత్తారు. ఇటు వైశ్యులు కాని, అటు మార్వాడీలు కాని నిబంధనలకు వ్యతిరేకంగా వ్యాపారాలు నిర్వహించినా, వ్యవహరించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అనేక దర్యాప్తు సంస్థలు ఉన్నాయి. న్యాయస్థానాలు ఉన్నాయి. ఇటు మార్వాడీల్లో, అటు వైశ్యులు ఒకరిద్దరు అక్రమాలకు పాల్పడి ఉండవచ్చు. అయితే దీనిని మొత్తం ఆయా కులాలకు వర్తింపచేయడం సరికాదు. వ్యాపారులు ప్రజలకు మోసం చేసే విధంగా వ్యాపారం చేస్తే కనుక్కోలేని అమాయకత్వం ప్రస్తుతం ప్రజల్లో లేదు. ఎక్కడైతే తక్కువ ధరలకు, నాణ్యత కలిగిన వస్తువులు దొరుకుతాయో ప్రజలు అక్కడికి వెళతారు. డీమార్ట్, రిలయన్స్, అమేజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఎన్ని కార్పొరేట్ సంస్థలు వచ్చిన స్థానిక వ్యాపారులను దెబ్బతీసిన సందర్భాలు లేవు. ఎవరి వ్యాపారం వారిది. వ్యాపారాల్లో ముఖ్యంగా కావాల్సింది నాణ్యత, ప్రజల నమ్మకం. దీనిని ప్రామాణికంగా తీసుకుని చేసే ఏ వ్యాపారమైనా, కార్యకలాపాలైనా ఏ ఒక్కరూ అడ్డుకోలేరు. ఇది చరిత్ర చెప్పిన సత్యం.

- మోహన్‌రాయ్, హైదరాబాద్

### టివిలు కట్టైయవలసి వస్తోంది

టి.వి. లలో ప్రసారమయ్యే డిబేట్లలో అన్ని పార్టీల ప్రతినిధులు, రాజకీయ విశ్లేషకులు పాల్గొంటారు. యాంకర్లు అడిగే ప్రశ్నలకు వారు సమాధానం చెప్పాలి. కానీ వారిలో క్రమశిక్షణ లోపిస్తోంది. ఒకరు మాట్లాడుతుంటే మరోకరు అనవసరంగా కలగజేసుకుని గట్టిగా మాట్లాడుతుంటారు. అప్పుడప్పుడు మూడో వ్యక్తి కూడా తన అభిప్రాయాన్ని వెలుబుచ్చు తుంటారు. ఒకరి తరువాత ఒకరు మాట్లాడాలని తాను వారికి మరల అవకాశమిస్తానని యాంకర్లు మర్యాదగా మందలిస్తున్నా వినిపించుకోరు. టి.వి.ల ముందు కూర్చుని వినేవారికి ఈ గోల భరించ లేనంతగా ఉన్నది. టి.వి.లు కట్టైయవలసి వస్తోంది. వినేవారి మనోభావాలు యిలా ఉన్నాయని యాంకర్లు ముందుగా యీ లేఖను వారికి చదివి చెప్పి దారిలోకి తేవటానికి ప్రయత్నించవలెను.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### రైళ్ల సంఖ్యను పెంచాలి

ప్రపంచంలో ఎక్కువ జనాభా కలిగిన దేశం మన భారతదేశం 1853 వ సంవత్సరంలో భారతదేశంలో రైలు ప్రయా ణం ప్రారంభం అయినది . 140 కోట్లకు పైగా జనాభా కలిగిన దేశంలోని ప్రజలు వివిధ పనుల నిమిత్తం ప్రయాణ సాధనాలలో ప్రధానమైన రైలు మార్గం ముఖ్యమైనది . జనాభా పెరిగిన నిష్పత్తిలో వారి ప్రయాణాల అవసరాల నిమిత్తం ప్రస్తుతం ఉన్న రైళ్ల సంఖ్యతో పాటుగా మరికొన్ని రైళ్లను ప్రారంభించాలి . ప్రతి రైల్వే స్టేషన్ లో ప్రస్తుతం ఆగుతున్న రైళ్లతోపాటుగా ప్రజల యొక్క ప్రయాణ అవస రాల నిమిత్తం నూతన రైళ్లకు ప్రతి రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఉండాలి. ప్రతి రైళ్లకు రైలు భోగీల సంఖ్య కూడా పెంచాలి. గ్రామాల విస్తీర్ణాన్ని బట్టి రైల్వే ట్రాక్ కు సమీపంలో ఉన్న గ్రామాలలో కొన్ని చోట్ల కూడా నూతనంగా రైల్వే స్టేషన్ లను ఏర్పాటు చేసి మరికొన్ని గ్రామాలకు రైలు ప్రయాణ సౌకర్యం కల్పించాలి .

–డా. ఈ. వెంకటేశ్వర్లు . నెక్కొండ

### సమస్యలను తక్షణం పరిష్కరించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోప్రతీసోమవారం కలెక్టర్‌లు,ఎస్పీలు నిర్వ హించే స్పందనకు వచ్చే సమస్యలను తక్షణం తక్కువ సమ యంలో పరిష్కరించేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకో వాలి.ప్రజలు వారివారి ఎన్నో సమస్యలను పరిష్కరించుకునేందుకు స్పందనకు వస్తూ ఉంటారు.

-డి. చాంద్ బాషా, కర్నూలు

# ఉపాధ్యాయుల 'దండన ధోరణులు' మారాలి


శ్రీ శ్రీకుమార్

ఉపాధ్యాయులే విద్యార్థులకు మార్గదర్శకులౌతారు. వారి జీవితాలను తీర్చిదిద్ది, వారికి బంగారు భవిష్యత్తు కల్పించడానికి తమ వంతు కృషి చేసే ఆదర్శవంతులూ వారే! అన్ని సందర్భాలలో తల్లిదండ్రులతో సంప్రదించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిది. మరపు రానిది. అం దుకే తల్లి, తండ్రీ , గురువు ,దైవం అంటూ తల్లి తండ్రుల తర్వాత గురువుకు ప్రధాన స్థానం కల్పించ బడింది. ప్రతి జీవితానికి బలమైన పునాది వేయగల సౌజన్యశీలురుగా ఉపాధ్యాయుల సేవలు ప్రశస్త్యమైనవి. తద్వారా సమాజానికి, దేశానికి ఉపయోగకరమైన పౌరులను తయారు చేస్తారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను విద్యార్థుల ఆశయాలను సాకారం చేయడంలో వారికి వారే సాటి. పరిస్థితులు ఎన్ని మారినా ఉపాధ్యాయులకు అందే గౌరవం , గుర్తింపు తరతరాలుగా చెక్కుచెదరడం లేదు. అంతటి గౌరవప్రదమైన వృత్తి జీవితంలోనూ నేడు అక్క డక్కడ వింత ధోరణులు, విచిత్ర పోకడలు పొడసూపుతు న్నాయి. తమ విద్యార్థులు తప్పు చేస్తే మందలించడం సహజం. తప్పు చెప్పడం ఉపాధ్యాయుని బాధ్యత. తప్పని సరి అయితేనే వారిని మందలిస్తుంటారు. అవసరాన్ని బట్టి ఒక దెబ్బ వేస్తారు. ఇలాంటి చర్యలు కేవలం విద్యార్థిని సక్రమ మార్గంలో నడపడానికి మాత్రమే. అంటే దిద్దుబాటు చర్యగానే భావించాలి. తల్లి తండ్రుల తర్వాత ఆ బాధ్యత తనదేనన్న మమకారంతో విద్యార్థులను సత్ప్రవర్తన దారిలోకి మళ్ళిస్తారు. ఇవన్నీ సమంజసమే! కానీ అవి కొన్నిసార్లు దారి తప్పుతున్నాయి. హైదరాబాద్లోని ఒక ప్రైవేట్ స్కూల్లో విద్యార్థిని మనసు మార్చాలి లేదా సరైన దిశగా నడిపించే ఆలోచన చేయడం మంచిది. కానీ ఏ బెత్తంతోనో చూసే చూడకుండా కొట్టబోవడం కరెక్ట్ కాదని ఇటీవల జరిగిన ఒక సంఘటనను పరిశీలిస్తే అర్థమోతుంది. ఒక చర్యలో విద్యార్థికి పొరపాటున కంటికి గాయమైంది.దీనిని చేయడం ఏ రకంగానూ సమర్థించలేం. ఏ విధమైన శిక్షగా మనం పరిగణించాలి? విద్యార్థిని కన్ను కోల్పోతే అది జీవితాంతము నరకమే కదా! తగిలేది, తప్పేది తెలియకుండా, ప్రవర్తించడం దేనికి?. అసలు విద్యార్థులను కొట్టద్దు. తిట్టద్దు. మానసికంగా హింసించవద్దు అంటూ చట్టాలు ఘోషిస్తుంటే ఉపాధ్యాయులు అలాంటి శిక్షలు వేయడం ఆమోదయోగ్యం కాదు. విద్యార్థులను విచక్షణా రహితంగా కొట్టడం ఏ మాత్రం సమంజసం కాదు. చట్టబద్ధం అసలే కాదు. ఆవేశంతో దండించడం కాదు. ఆలోచన ప్రధానం. దేనికైనా ఉపాధ్యాయునికి సహనం అవసరం. ఉపాధ్యాయులు సహనశీలురుగా వర్తించాలి. క్లాసుకు ఆలస్యంగా వచ్చాడనో , హోం వర్క్ చేయలేదనో, తరగతి గదిలో క్రమశిక్షణారాహిత్యంతో అల్లరి చేశాడనో మందలించడం సహజంగా జరిగేది. ఏదైనా కావచ్చు. వీటికి అంత పెద్ద శిక్షలు అవసరం లేదు. ఆ మధ్య ఒక ఉపాధ్యాయురాలు వేడి కత్తితో విద్యార్థికి వాత పెట్టడం మనం చదివాం. ఎంత అమానుషమైన చర్య? ఇవన్నీ విద్యార్థుల మేలుకోరి ఇచ్చే దండనలైనా, అవి వికటిస్తే పరిస్థితులు దుష్పరిణామాలకు కారకు లౌతాయి. తరగతి గదిలో కులతత్వాన్ని, మతతత్వాన్ని ప్రబోధించే వారు, ఆచరించేవారు, పక్షపాత ధోరణులు ప్రదర్శించే ఉపాధ్యాయులు కూడా ఉంటారని కొన్ని సందర్భాలు చెబుతుంటారు. ఇవన్నీ లౌకిక రాజ్యంలో సహించలేని అంశాలు. తమ పదోన్నతుల కోసం రికార్డులు తారుమారు చేయడం ఉపాధ్యాయులు నీచానికి ఒడిగట్టడం కాదా? వీరేనా రేపటి బాధ్యతగల పౌరులను తయారు చేసేది? వీరేనా దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మిం చేది? ఆలోచించదగిన విషయం. నిన్న మొన్న భూపాల పల్లి జిల్లాలో మరొక దుర్మార్గాన్ని చదివాం. ప్రధానోపాధ్యాయుడిపై కక్షతో విద్యార్థులు తినే మధ్యాహ్న భోజనంలో విషం కలపడం, ఇందుకు మరి కొంతమంది ఉపాధ్యాయులు, సిబ్బంది సహకరించడం. కథ ఎవరి పైన, శిక్ష ఎవరికి? విద్యార్థుల్లో ఎవరికైనా ప్రాణహాని వాటిల్లితే మొత్తం ఉపాధ్యాయ లోకం తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.వీరు మరింత పతనం అయితే అది సామాజిక స్థితిగతులు పాతాళానికి దిగజారడానికి దోహదం చేస్తాయి. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఇలాంటి విషయాలపై ఉపాధ్యాయుల్లో సద్భావనను కలుగచేయగలదు. ●

# ఉద్యోగాల కల్పనలో ఏఐదే కీలక పాత్ర

ఎస్.సీతారామయ్య

దేశంలో రానున్న కాలంలో ఉద్యోగాల స్వరూపమే అనూహ్యంగా మారిపోయే పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇదివరకు డిగ్రీలుంటేకానీ సరైన ఉద్యోగాలు రాని పరిస్థితి ఉండగా, ఇప్పుడు సాంకేతిక నైపుణ్యం ముందు డిగ్రీలు చిన్నబోతున్నాయి. దేశంలో ఎఐ(కృత్రిమ మేధ) నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. ప్రపంచ స్థాయిలో 88 వరకు ఎఐ ప్రోగ్రాములు అమలవుతున్నాయి,ఉత్పాదక ఆధారిత ఎఐ శిక్షణ నమోదులో అమెరికా, భారత దేశాలు ముందుండడంతో ప్రపంచ వ్యాప్తంగా ఎఐ నైపుణ్యాలకు డిమాండ్ పెరిగింది. జనరల్ ఏఐ శిక్షణను పెంచడంలో కార్పొరేట్ సంస్థలు ముందుంటున్నాయి. ఈ కార్పొరేట్ సంస్థలకు ప్రపంచ వ్యాప్తంగా 14 మిలియన్ల కన్నా ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్నారు. జనరల్ ఏఐ వినియోగం ప్రస్తుతం అన్ని రంగాల్లో పెరుగుతోంది. అందుబాటులో ఉన్న సమాచారాన్ని వినియోగించుకుని సరికొత్త చిత్రాలు, పాఠ్యాంశాలు, సంగీతం తదితర అంశాలను సృజించే వ్యవస్థలను జనరేటివ్ ఎఐగా వ్యవహరిస్తున్నారు. ఎఐ నైపుణ్యానికి సంబందించి దేశంలో 67 కంపెనీలు కొత్త విభిన్న నైపుణ్య ప్రతిభపై దృష్టి సారిస్తున్నాయి. 2030 నాటికి దేశంలో 17 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, మరోవైపు 9.2 కోట్ల ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని, అలాగే ప్రపంచంలో 170 మిలియన్ కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, 92 మిలియన్ ఉద్యోగాలు కోల్పోవడమవుతుందని ఎరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్లుఇఎఫ్) నివేదిక వెల్లడించింది. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారతీయ కంపెనీలు: ప్రపంచాన్ని అధిగమించేందుకు సిద్ధంగా ఉన్నాయి, ఎఐ, రోబోటిక్స్, ఎనర్జీ టెక్నాలజీ వంటి రంగాల్లో భారీగా పెట్టుబడులు పడుతున్నాయి. దేశంలో బిగడేటా, ఎఐ, మెషిన్ లెర్నింగ్, సైబర్ నిర్వహణ వంటి ఉద్యోగాలు దేశంలో వృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత దేశంలోని ఐటి రంగం ప్రస్తుతం 5.4 మిలియన్ మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. 2030 నాటికి ఈ సంఖ్యను 10 మిలియన్ వరకు రెట్టింపు. చేయాలన్న టార్గెట్ ఉండగా, కేవలం 7.5 మిలియన్ వరకి సాదించగలమని ఆయా రంగ నిపుణులు




చెబుతున్నారు. దీనికి కారణం ఎఐ విస్తరించడం వల్ల ఇప్పుడున్న ఉద్యోగాలు పోతాయన్న భయం వెంటాడుతుండడమే. ప్రస్తుతం ఈ వృద్ధి అంతా డిజిటల్ సాంకేతికత వైపు దూసుకెళ్తాంది, ఎఐ, క్లౌడ్, కంప్యూటింగ్, ఆటోమేషన్ తదితర సాంకేతిక ప్రక్రియలు పారిశ్రామిక, వాణిజ్య సంస్థల ప్రోత్సాహంతో విస్తరిస్తున్నాయి.ఇది వరకటి 10 మిలియన్ ఉద్యోగాల బార్గెట్ను 7.5 మిలియన్ ఉద్యోగాలకు సవరించినప్పటికీ, ఉద్యోగాల రాశి కన్నా నైపుణ్యం, నాణ్యతలకు పట్టం కడుతున్నారు. ఈ ఆధునిక సాంకేతిక నైపుణ్య ప్రక్రియలను అందిపుచ్చుకోగలిగితేనె ఇప్పుడు ఉద్యోగాలు లభిస్తాయి. ఈ మేరకు ఉద్యోగ అవకాశాలు 80 వరకు సాంకేతిక నిపుణులతో 2025 26 వాటికి 20 వరకు పెరుగుతాయని ఐటి రంగ వర్గాలు పేర్కొంటున్నాయి. అత్యంత అధునిక సాంకేతికతల వల్ల 2030 నాటికి దేశంలో 150 బిలియన్ డాలర్ల వరకు ఆర్థిక ప్రయోజనం సిద్ధిస్తుందని అంచనా వేస్తున్నారు. జనరేటివ్ ఎఐ వంటి సాంకేతికతలో ఐటి రంగంలో 2030 నాటికి రెండు మిలియన్ల వరకు కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాయని నివేదికల వల్ల తెలుస్తోంది. దేశంలో ప్రస్తుతం 1700 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఉన్నాయి. వీటి వల్ల 1.9 మిలియన్ మంది ఉద్యోగాలు పొందుతున్నారు. 2030 నాటికి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల సంఖ్య 2200 వరకు చేరుకుంటుందని, వాటి ద్వారా 2.5 మిలియన్ నుంచి 2.8 మిలియన్ వరకు ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉన్నాయని ఐటి నిపుణులు చెబుతున్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు అనేవి ఎదురవుతున్న సవాళ్లకు అనుగుణంగా అనేక రకాల వ్యూహాత్మక విదులను నిర్వహించడానికి బహుళజాతి సంస్థలు స్థాపించే కేంద్రాలు, ఆవిష్కరణ కార్యక్రమాలు, పరిశోధనలు, సాఫ్ట్వేర్ డెవలప్మెంట్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ పరివర్తన కార్యక్రమాలను వేగవంతం చేయడం, వనరుల వినియోగాన్ని పెంచడం తదితర విధులను ఈ కేంద్రాలు నిర్వహిస్తుంటాయి. ఐటి రంగంలో ఒప్పందం ప్రకారం ఉద్యోగులను నియమించుకునే విధానంలో 43.5 డిమాండ్తో బెంగళూరు కేంద్ర స్థానంగా ఉన్నప్పటికీ, 13.4 డిమాండ్తో రెండో అత్యధిక స్థానంలో హైదరాబాద్ ఉంది. ఈ ఉద్యోగాల కల్పనలో విద్యార్హతల కన్నా సాంకేతిక నైపుణ్యమే కీలక పాత్ర వహిస్తోందన్నది ఉద్యోగార్థులు గమనించవలసిన కీలకాంశం. ●

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

# భారత్ బాటలోనే జపాన్

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం మరింత ఆలస్యం!



శుక్రవారం టోక్యోలో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న జపాన్ అధికారులు

**టోక్యో, ఆగస్టు 29:** అధిక టారిఫ్‌లతో అమెరికా భయపెడుతున్నా.. అగ్రరాజ్యం ఒత్తిడికి భారత్ తలొగ్గట్లేదు. ఇప్పుడు జపాన్ కూడా అదే బాట పట్టినట్లు తెలుస్తోంది. వాణిజ్య చర్చల్లో భాగంగా టోక్యోతో పెట్టుబడుల ఒప్పందం చేసుకునేందుకు అమెరికా సిద్ధమైంది. అయితే, ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే అది కుదిరే సంకేతాలు కన్పించట్లేదు. ఈ ఒప్పందం నిమిత్తం చేపట్టాల్సిన యుఎస్ పర్యటనను చివరి నిమిషంలో జపాన్ మంత్రి రద్దు చేసుకోవడమే ఇందుకు కారణం. పైగా భారత ప్రధాని మోడీ టోక్యో పర్యటన వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం మరింత చర్చనీయాంశంగా మారింది.

రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత ప్రధాని నరేంద్రమోడీ జపాన్ చేరుకున్నారు. శుక్రవారం ఉదయం ఆయన టోక్యోలో దిగారు. ఈ పర్యటనలో భాగంగా శుక్రవారం సాయంత్రం జపాన్ ప్రధాని ఇషిబాతో మోడీ ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నారు. మరోవైపు, ఈ పర్యటన వేళ జపాన్ వాణిజ్య మంత్రి ర్యోసీ అకజావా అమెరికా టూర్‌ను రద్దు చేసుకున్నారు. దీంతో ఈ రెండు దేశాల మధ్య జరగాల్సిన 550 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్యాకేజీ ఒప్పందం ఆలస్యం కానుంది. అమెరికా టారిఫ్‌ల వేళ.. అగ్రరాజ్యంలో పెట్టుబడులు పెట్టేందుకు టోక్యో సిద్ధమైంది. దీంతో జపాన్‌పై టారిఫ్‌లను 25 శాతం నుంచి 15 శాతానికి తగ్గించాలని అగ్రరాజ్యం నిర్ణయించింది. ఇందుకోసం వాణిజ్య మంత్రి గురువారం అమెరికా వెళ్లాల్సి ఉంది. ఈ పర్యటనలో అధికారికంగా ఒప్పందం కుదరాల్సి ఉండగా ప్రస్తుతం అది రద్దయ్యింది. ఈ పెట్టుబడులకు సంబంధించి అడ్మినిస్ట్రేషన్ స్థాయిలో ఇంకా కొన్ని అంశాలను చర్చించాల్సి ఉన్నందున.. ర్యోసీ తన పర్యటనను రద్దు చేసుకున్నారని జపాన్ వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఈ ఒప్పందంలో భాగంగా లాభాల్లో అత్యధిక వాటా అమెరికాతీసుకోవాలని భావిస్తోంది. దీనిపై టోక్యో అంగీకారానికి రాలేకపోతోందని తెలుస్తోంది. జపాన్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో పర్యటిస్తారు. ఇరుదేశాల 15వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. అనంతరం జపాన్ ప్రధాని ఇషిబాతో భేటీ కానున్నారు. ఎఐ, సెమీకండక్టర్లు, బుల్లెట్ రైలు, పెట్టుబడులే అజెండాగా వీరి మధ్య ద్వైపాక్షిక చర్చ జరగనుంది. అక్కడి నుంచి ప్రధాని మోడీ నేరుగా చైనా వెళ్లనున్నారు. ఈ నెల 31, సెప్టెంబరు 1వ తేదీల్లో తియాంజిన్ వేదికగా జరిగే షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణల తర్వాత ప్రధాని మోడీ చైనాను సందర్శిస్తుండటం ఇదే మొదటిసారి. ఆ దేశంలో చివరిసారి 2018లో పర్యటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో భారత్‌పై విరుచుకుపడుతున్న వేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఆపరేషన్ సిందూర్

# ఉగ్రపోరులో సువర్ణాధ్యాయం

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** ఉగ్రవాదంపై మానవాళి పోరాటంలో ఆపరేషన్ సిందూర్ ఓ సువర్ణాధ్యాయమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. స్వదేశీ ఆకాశ్‌తీర్ వైమానిక రక్షణ రిపోర్టింగ్ వ్యవస్థను నిర్మించడంలో ప్రభుత్వ రంగ సంస్థల సహకారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. భారత్‌పాకిస్తాన్ మధ్య సైనిక వివాదంలో ఆకాశ్‌తీర్ వైమానిక రక్షణ వ్యవస్థ కీలకపాత్ర పోషించింది. స్కోప్ ఎమినెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తూ, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం అనే లక్ష్యాన్ని సాధించడంలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర గురించి మాట్లాడారు. ఆదాయం, లాభం వంటి కీలకమైన ఆర్థిక పారామితులలో ప్రభుత్వ రంగ సంస్థలు బాగా పనిచేశాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో మూడింట ఒకవంతు లాభాలను ఆర్జిస్తున్నాయని, గత దశాబ్దంలో ప్రభుత్వ రంగ సంస్థల నికర లాభం గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు సుపరిపాలన, పారదర్శకత రంగంలో ప్రమాణాలను నిర్దేశించాయని ముర్ము తెలిపారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ప్రాముఖ్యతపై స్పందిస్తూ స్వయం సమృద్ధ భారతదేశాన్ని నిర్మించడంలో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభావవంతమైన పాత్ర పోషిస్తున్నాయన్నారు. దేశ రక్షణ రంగం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాద శిబిరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని భారతదేశంపై దాడి చేసే ప్రయత్నాలు విఫలమయ్యాయి. స్వదేశీ ఆకాశ్‌తీర్ వైమానిక రక్షణ వ్యవస్థ తన సామర్థ్యాన్ని ప్రదర్శించిందన్నారు. ఈ వ్యవస్థ సృష్టికి ప్రభుత్వ రంగ సంస్థలు దోహదం చేశాయని ఇది వారికి చాలా గర్వకారణంగా నిలుస్తుందన్నారు. ఆవిష్కరణలు, పెరుగుతున్న సాంకేతిక నైపుణ్యం ద్వారా జాతీయ భద్రతలో స్వావలంబన సాధించడంలో పీఎస్‌యూలు ప్రధాన పాత్ర పోషించాయని రాష్ట్రపతి నొక్కి చెప్పారు. వ్యవసాయం, మైనింగ్, అన్వేషణ, తయారీ, ప్రాసెసింగ్, సేవలు వంటి అనేక రంగాల్లో పీఎస్‌యూలు కీలకపాత్ర పోషించాయని మహిళల నేతృత్వంలోని అభివృద్ధి ప్రభుత్వ జాతీయ ప్రాధాన్యతల్లో ఒకటని రాష్ట్రపతి పేర్కొన్నారు.

# బ్రిక్స్‌కూటమిని బలోపేతం చేస్తున్న ట్రంప్ టారిఫ్‌లు

### అమెరికన్ ఆర్థికవేత్త రిచర్డ్ వోల్ఫ్



**వాషింగ్టన్, ఆగస్టు 29:** భారత్ విషయంలో అమెరికా ప్రపంచానికే పెద్దన్నలా వ్యవహరిస్తోందని, కానీ ఈ చర్యలతో తన కాలిపై తానే గొడ్డలివేటు వేసుకుంటోందని ప్రముఖ అమెరికన్ ఆర్థికవేత్త రిచర్డ్ వోల్ఫ్ వ్యాఖ్యానించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై అమెరికా విధించిన భారీ సుంకాలను ఆయన తప్పుబట్టారు. అమెరికా తీరు ఒక ఎలుక వెళ్లి ఏనుగును గుద్దినట్టుగా ఉందని ఆయన అభివర్ణించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని నిరసిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్‌కు చెందిన పలు ఉత్పత్తులపై టారిఫ్‌లను 50 శాతానికి పెంచారు. ఈ నిర్ణయం బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యాకు ఆర్థికంగా నష్టం కలిగించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు అమెరికా చెబుతోంది. రష్యా టుడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రిచర్డ్ వోల్ఫ్ మాట్లాడుతూ అమెరికా చర్యల వల్ల భారత్‌కు ఎలాంటి నష్టం జరగదని స్పష్టం చేశారు. అమెరికా మార్కెట్ మూసుకుపోతే, భారత్ తన ఉత్పత్తులను బ్రిక్స్ దేశాలకు అమ్ముకుంటుంది. గతంలో రష్యా తన ఇంధనాన్ని ఇతర దేశాలకు అమ్ముకున్నట్లే, భారత్ కూడా ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకుంటుందని ఆయన విశ్లేషించారు. అమెరికా చర్యలు పాశ్చాత్య దేశాలకు ఆర్థిక ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్న బ్రిక్స్ కూటమిని మరింత బలోపేతం చేస్తాయని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం ప్రపంచ ఉత్పత్తిలో బ్రిక్స్ దేశాల (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, యూఏఈ) వాటా 35 శాతానికి చేరిందని, అదే సమయంలో జీ7 దేశాల (కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యూకే, అమెరికా) వాటా 28 శాతానికి పడిపోయిందని వోల్ఫ్ గుర్తుచేశారు. ఇది ఒక చారిత్రక ఘట్టం. పశ్చిమ దేశాలకు ప్రత్యామ్నాయంగా బ్రిక్స్ కూటమిని అమెరికాయే దగ్గరుండి పెంచి పోషిస్తోంది" అని ఆయన అన్నారు. గతంలో ట్రంప్ పలు సందర్భాల్లో బ్రిక్స్‌ను ఒక చిన్న బృందం అని, త్వరలో కనుమరుగైపోతుందని కొట్టిపారేశారు. ఉమ్మడి కరెన్సీని తీసుకొస్తే 100 శాతం టారిఫ్‌లు విధిస్తామని కూడా హెచ్చరించారు. అయితే, వోల్ఫ్ మాత్రం సోవియట్ కాలం నుంచి భారత్, రష్యాల మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయని, అమెరికా ఇప్పుడు చాలా భిన్నమైన ప్రత్యర్థితో ఆడుతోందని హెచ్చరించారు.

# ఊహించని పరిస్థితే వస్తే నేనే అమెరికా అధ్యక్షుడిని

### ఉపాధ్యక్షుడు జెడివాన్స్ సంచలన ప్రకటన



**వాషింగ్టన్, ఆగస్టు 29:** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో ఏదైనా ఊహించని పరిస్థితి తలెత్తితే తాను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానంటూ సంచలన కామెంట్స్ చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై ఊహాగానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వాన్స్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. యూఎస్‌ఏ టుడేతో మాట్లాడిన జేడీ వాన్స్‌ట్రంప్ ఆరోగ్యంపై మాట్లాడారు. 'అధ్యక్షుడు ట్రంప్ ఆరోగ్యంపై ఇటీవలే వచ్చిన కథనాలు అమెరికా ప్రజల్లో ఆందోళన రేకెత్తించాయి. అందులో వాస్తవం లేదు. ట్రంప్ ప్రస్తుతం ఆరోగ్యంగా, చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఆయన ఆరోగ్యం విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు భయంకరమైన విషాదాలు చోటు చేసుకుంటున్నాయి. కానీ, వాటన్నింటినీ దాటుకొని తన పదవీ కాలాన్ని ట్రంప్ పూర్తి చేస్తారని ఆశిస్తున్నా. అమెరికా ప్రజలకు ఇంకా గొప్ప పనులు చేస్తారన్న నమ్మకం నాకు ఉంది. ఒకవేళ ఏదైనా ఊహించని పరిస్థితి తలెత్తితే అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను' అంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జేడీ వాన్స్ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై ఇటీవలే పలు ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఆయన చేతులపై కమిలిన గాయాలు కనిపించడం ఇటీవలే కలకలం రేపుతోంది. ట్రంప్ కుడిచేతి వెనుక భాగంలో ఓ తెల్లటి మార్క్ కనిపించింది. సోమవారం ఓవల్ ఆఫీస్‌లో జరిగిన సమావేశం సందర్భంగా అది కెమెరాకు చిక్కింది. దీంతో ట్రంప్ ఆరోగ్యంపై ఆందోళన రేకెత్తించింది. ఇది చూసిన ట్రంప్ మద్దతుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్ వింత వ్యాధితో బాధపడుతున్నారంటూ వదంతులు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఇటీవలే ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మానుయెల్ మాక్రాన్‌తో భేటీ సందర్భంగా ట్రంప్ చేతిపై కమిలిన గాయాలు కనిపించాయి. ఆ తర్వాత న్యూజెర్సీలో జరిగిన ఫిఫా క్లబ్ వరల్డ్ కప్ తిలకించేందుకు వచ్చిన ట్రంప్ కాస్త అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కనిపించారు. కాళ్ల వద్ద నరాలు ఉబ్బిపోయినట్లుగా, కుడి చేతిపై పలు చోట్ల వాపు ఉన్నట్లు కెమెరా కంట పడింది. ఇప్పుడు మరోసారి ట్రంప్ కుడి అరచేతి వెనుక భాగంలో ఇలాంటి గాయాలే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఆ కమిలిన గాయాన్ని దాచేందుకు అధ్యక్షుడు మేకప్‌తో కవర్ చేసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృష్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

## నేతాజీ అస్థికలను భారత్‌కు రప్పించాలి..

### టోక్యో పర్యటనలో ఉన్న ప్రధాని మోడీకి బోస్ కుమార్తె వినతి

**బెర్లిన్, ఆగస్టు 29:** స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అస్థికలను భారత దేశానికి తీసుకురావాలని ఆయన కుమార్తె అనితా బోస్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న నేపథ్యంలో ఆమె ఈ అభ్యర్థన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తన వయసు మీద పడుతున్నందున, ఈ సమస్యకు త్వరగా ఒక ముగింపు పలకాలని ఆమె విన్నవించారు. ప్రస్తుతం జర్మనీలో నివసిస్తున్న 82 ఏళ్ల అనితా బోస్ ఈరోజు ఓ జాతీయ మీడియా సంస్థతో మాట్లాడారు. ప్రధాని మోదీతో నేరుగా మాట్లాడే అవకాశం లభిస్తే, తన తండ్రి అస్థికలను స్వదేశానికి తీసుకురావాలని కచ్చితంగా కోరతానని ఆమె స్పష్టం చేశారు. గతంలో పీవీ నరసింహారావు ప్రభుత్వం నా తండ్రి అస్థికలను తీసుకురావడానికి ప్రయత్నించింది. ఆ ప్రయత్నాన్ని ఇప్పుడు మోదీ ప్రభుత్వం కొనసాగించాలి. నా వయసు రీత్యా ఈ విషయం నాకు మరింత అత్యవసరంగా మారిందని ఆమె భావోద్వేగంగా అన్నారు. ఈ సమస్యకు ఒక ముగింపు కావాలని నేను కోరుకుంటున్నాను. ఈ బాధ్యతను నా కొడుక్కి వారసత్వంగా ఇవ్వాలని నేను అనుకోవడం లేదని అనితా బోస్ చెప్పారు. ఇది కేవలం తన వ్యక్తిగత విషయం కాదని, తన తండ్రి యావత్ దేశానికి చెందిన వ్యక్తి అని ఆమె గుర్తుచేశారు. 1945 ఆగస్టు 18న తైవాన్‌లో జరిగిన విమాన ప్రమాదంలో నేతాజీ మరణించినట్లు పలు జాతీయ, అంతర్జాతీయ విచారణలు నిర్ధారించాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన, అక్కడి సైనిక ఆసుపత్రిలో కన్నుమూశారని నివేదికలు తెలిపాయి. ఆయన అస్థికలను జపాన్‌లోని టోక్యోలో ఉన్న రెంకోజీ బౌద్ధ ఆలయంలోని ఒక కలశంలో భద్రపరిచినట్లు బలంగా విశ్వసిస్తున్నారు.

# ప్రధాని మోడీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి అరెస్టు

**పాట్నా, ఆగస్టు 29:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన తల్లిపై అసభ్య పదజాలంతో దూషణలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు బీహార్ పోలీసులు తెలిపారు. అరెస్టైన నిందితుడు సింగ్వారాలోని బాపుర గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. దీనిపై విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. దర్భంగాలో ఇండియా కూటమి నిర్వహించిన రాజకీయ సభలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ కావడంతో తీవ్ర రాజకీయ దుమారం చెలరేగింది. మోదీ, ఆయన తల్లిపై చేసిన వ్యాఖ్యలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఖండించారు. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. ఇది 140 కోట్ల మంది భారతీయులను అవమానించడమేనని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడు ప్రధాని మోదీ. ఇండియా కూటమి వేదికపై నుంచి ఇలాంటి అగౌరవకరమైన భాష వాడటం సిగ్గుచేటు. దీనికి బీహార్ ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. ఇందుకు కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కూడా ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ ఉన్న వేదికపై నుంచి ప్రధాని తల్లిని అవమానించడం దేశంలోని మహిళలందరినీ కించపరచడమేనని అన్నారు. ఇండియా కూటమి భావజాలం ఎలాంటిదో ఈ ఘటన తెలియజేస్తోంది. భారత ప్రజాస్వామ్యంలో ఇలాంటి వాటికి చోటు లేదు. దేశం దీన్ని సహించదని ఆయన స్పష్టం చేశారు. కేవలం రాజకీయంగా ఎదుర్కోలేకనే కాంగ్రెస్, ఆర్జేడీ ఇలాంటి నీచస్థాయి వ్యక్తులను ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో ఈ ఘటన జరిగింది. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో రంగంలోకి దిగిన పోలీసులు, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు దర్భంగా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శుక్రవారం వెల్లడించారు.

# పాట్నాలో బిజెపి, కాంగ్రెస్ బాహా బాహీ



**పాట్నా, ఆగస్టు 29:** బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. పార్టీ జెండాలతో బీహార్‌లోని పాట్నాలో ఒకర్ని ఒకరు కొట్టు కున్నారు. నిరసన ర్యాలీ భారీ విధ్వంసానికి దారి తీసింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల ఓట్ అధికార్ యాత్ర నిర్వహించారు. ఆ ర్యాలీలో ఓ వ్యక్తి ప్రధాని మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దీనికి నిరసన ఇవాళ బీజేపీ ర్యాలీ చేపట్టింది. అయితే ర్యాలీని అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేతలు కూడా ర్యాలీ నిర్వహించారు. ఆ రెండు పార్టీలకు చెందిన నేతలు ఎదురుపడిన సమయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసు కున్నట్లు తెలుస్తోంది. భారీ సంఖ్యలో కార్యకర్తలు పార్టీ జెండాలు ఉన్న కర్రలతో దాడి చేసుకున్నారు. ఓ దశలో కాంగ్రెస్ కార్యాలయం వద్ద కూడా దాడి జరిగింది. కాంగ్రెస్‌కు గట్టి బదులిస్తామని బీజేపీ నేత నితిన్ నాబిన్ అన్నారు. తల్లిని దూషించిన కాంగ్రెస్ పార్టీకి బీహారీలు గుణపాఠం చెబుతారని అన్నారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన అన్నారు. నితీశ్ కుమార్ పాలన సరిగా లేదని, ఇదంతా ప్రభుత్వ జోక్యంతోనే జరుగుతోందని కాంగ్రెస్ నేత డాక్టర్ ఆశుతోష్ ఆరోపించారు. దర్భంగా జిల్లాలో జరిగిన ర్యాలీలో రఫీక్ అలియాస్ రాజా అనే వ్యక్తి అకస్మాత్తుగా మైక్‌ను అందుకుని ప్రధాని మోదీతో పాటు ఆయన తల్లిపై దుర్భాషలాడాడు. రఫీక్ అలియాస్‌ను భోపురా గ్రామస్థుడిగా గుర్తించారు. సిమ్రి పోలీసు స్టేషన్‌లో అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బితౌలీ వద్ద ర్యాలీ జరుగుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. చాలా తీవ్రమైన పదజాలంతో మోదీ, ఆయన తల్లిని తిట్టాడు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి అనుకూలంగా ఆ వ్యక్తి నినాదాలు చేశాడు. ప్రధాని మోదీపై దుర్భాషలాడిన వ్యక్తి రఫీక్ ను పోలీసులు అరెస్టు చేశారు.

# థాయ్‌మాజీ ప్రధాని షినవత్రాను తొలగించిన సుప్రీం కోర్టు



**బ్యాంకాక్, ఆగస్టు 29:** థాయ్‌ల్యాండ్ ప్రధాని పెటంగటార్న్ షినవత్రాకు గట్టి షాక్ తగిలింది. పొరుగుదేశమైన కాంబోడియా ప్రధానితో జరిపిన ఫోన్ సంభాషణపై షినవత్రాపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన ఆ దేశరాజ్యాంగ కోర్టు ఆమెను సస్పెండ్ చేస్తూ ఇటీవలే తీర్పు వెలువరించి తాజాచర్యల్లో భాగంగా ఆమెను పదవి నుంచి తొలగిస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది. ఆమె నియమాలను ఉల్లంఘించారని, రాజ్యాంగం ప్రకారం ప్రధాన మంత్రి పదవికి అనర్హురాలని పేర్కొంది. ఓ ఫోన్ సంభాషణలో కంబోడియా మాజీ అధినేత హున్‌సేన్‌ను 'అంకుల్' అని సంబోధించిన పెటంగటార్న్ షినవత్రా తమ దేశ సైనిక కమాండర్‌ను తన విరోధి అని పేర్కొనడం వివాదానికి దారితీసింది. దేశ సరిహద్దుల్లో కంబోడియాతో ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో స్వయంగా ప్రధాని తమ దేశ సైనిక కమాండర్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడంపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది. దీనిపై గత నెల విచారణ చేపట్టిన కోర్టు కంబోడియాతో జరిగిన దౌత్య వ్యవహారంలో ప్రధానమంత్రిగా నైతికతను ఉల్లంఘించారనిచెప్పడానికి తగిన ఆధారాలున్నాయని పేర్కొన్నది. ప్రధాన మంత్రి పదవి నుంచి సస్పెండ్ చేస్తూ రాజ్యాంగ కోర్టు తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆమెపై చర్యలు తీసుకుంది.పదవినుంచితొలగిస్తూ తీర్పు చెప్పింది. నైతిక ఉల్లంఘనలకు పాల్పడిన 62 ఏండ్ల ప్రధాని స్రెట్టాథావిసిన్ పదవి నుంచి దిగిపోయిన తర్వాత ప్రధాని బాధ్యతల నుంచి సస్పెండ్ అయిన రెండోవ్యక్తిగా షినవత్రా నిలిచారు.

# ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా డ్రోన్ దెబ్బ: సముద్రంలో మునిగిన భారీ నౌక

**మాస్కో, ఆగస్టు 29:** ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం ఆపేందుకు ఓ వైపు చర్చలు జరుగుతున్నా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మాత్రం రోజురోజుకూ మరింత తీవ్రమవుతున్నాయి. తాజాగా కీవ్‌పై మాస్కో మరోసారి విరుచుకుపడింది. రష్యా జరిపిన సముద్ర డ్రోన్ దాడి కారణంగా ఉక్రెయిన్‌కు చెందిన అతిపెద్ద నౌక ధ్వంసమై మునిగిపోయింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలుసామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.ఉక్రెయిన్‌లోని ఒడెస్సా ప్రాంతంలో గత దనుబె నదిలో నిఘా నౌక సింఫెరోపోల్ మోహరించి ఉండగా రష్యా దానిపై దాడి చేసింది. సముద్ర డ్రోన్‌ను ప్రయోగించింది. ఈ దాడితో నౌక భారీగా ధ్వంసమై నీట మునిగినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# రష్యాకు మద్దతివ్వడంవల్లే భారత్‌కు ఈ గతి..

### అమెరికా సెనెటర్ గ్రాహమ్ లిండ్సే వెటకారం

**వాషింగ్టన్, ఆగస్టు 29:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలపై అమెరికా రిపబ్లికన్ పార్టీకి చెందిన సీనియర్ సెనెటర్ లిండ్సే గ్రాహం మరోసారి తీవ్రంగా విమర్శలు గుప్పించారు. ఈ దేశాల చర్యల వల్లే ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధ యంత్రాంగం కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు మద్దతు ఇస్తున్నందుకు భారత్ ఇప్పటికే మూల్యం చెల్లించుకుంటోందని, ఇతర దేశాలకు కూడా త్వరలోనే ఇదే గతి పడుతుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఉక్రెయిన్‌లోని కీవ్ నగరంపై రష్యా జరిపిన భీకర దాడిలో 23 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన జరిగిన వెంటనే లిండ్సే గ్రాహం సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు. "రష్యా నుంచి చౌకగా చమురు కొనుగోలు చేస్తూ పుతిన్ యుద్ధానికి ఊతమిస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలకు ఇప్పుడెలా అనిపిస్తోంది? మీ కొనుగోళ్ల వల్లే పిల్లలతో సహా అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారు. పుతిన్‌కు మద్దతిచ్చినందుకు భారత్ ఇప్పటికే మూల్యం చెల్లిస్తోంది. మిగతా దేశాలకు కూడా త్వరలోనే ఇదే గతి పడుతుందని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. గతంలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భారత దిగుమతులపై 50 శాతం టారిఫ్‌లు విధించిన విషయాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించారు. పుతిన్‌కు మద్దతివ్వడం వల్లే భారత్ ఇలాంటి పరిణామాలను ఎదుర్కొంటోందని వ్యాఖ్యానించారు. రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్న ఇతర దేశాలు కూడా ఇలాంటి పర్యవసానాలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. లిండ్సే గ్రాహం చాలాకాలంగా రష్యా చమురు ఆదాయంపై విమర్శలు చేస్తున్నారు. "చమురు, గ్యాస్ ఆదాయం లేకపోతే రష్యా కుప్పకూలిపోతుంది. భారత్, చైనా, బ్రెజిల్ వంటి దాని వినియోగదారులను దెబ్బతీయడమే మా ప్రధాన లక్ష్యమని ఆయన గతంలో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ఇతర దేశాల నుంచి వస్తున్న ఆదాయంతోనే రష్యా యుద్ధాన్ని కొనసాగిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

## సంక్షిప్తంగా..

### కేరళ మంత్రి బంధువుల దారుణ హత్య



**కన్నూరు, ఆగస్టు 29:** కేరళలోని కన్నూర్ జిల్లా అలవిల్ లో దారుణం చోటుచేసుకుంది. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధ దంపతులను దుండగులు దారుణంగా హతమార్చారు. పదునైన వస్తువుతో కొట్టి చంపి ఆపై మృతదేహాలను కాల్చేశారు. మృతులను కేరళ అటవీశాఖ మంత్రి ఏకే శశీంద్రన్ బంధువులుగా పోలీసులు గుర్తించారు.వివరాల్లోకి వెళితే మంత్రి ఏకే శశీంద్రన్ మేనకోడలు ఏకే శ్రీలేఖ (68), ఆమె భర్త ప్రేమరాజన్ (75) లు కన్నూర్ జిల్లాలోని అలవిల్ ప్రాంతంలో నివసిస్తున్నారు. ఇద్దరు పిల్లలు విదేశాల్లో స్థిరపడడంతో ఒంటరిగానే కాలం గడుపుతున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులను చూసేందుకు వస్తున్నట్లు ప్రేమరాజన్ కుమారుడు కబురు చేశాడు. ఆయనను ఎయిర్ పోర్ట్ నుంచి తీసుకువచ్చేందుకు కారు కోసం గురువారం సాయంత్రం డ్రైవర్ ఇంటికి వచ్చాడు. డోర్ కొట్టినా, ఎంత పిలిచినా స్పందించకపోవడంతో డ్రైవర్ పక్కింటి వారిని ఆశ్రయించాడు. బుధవారం తర్వాత ఆ దంపతులను తాము చూడలేదని వారు వెల్లడించారు. దీంతో ఇరుగుపొరుగు సాయంతో డోర్ బద్దలు కొట్టి లోపలకు వెళ్లిన డ్రైవర్‌కు కాలిన స్థితిలో శ్రీలేఖ, ప్రేమరాజన్‌ల మృతదేహాలు కనిపించాయి.

### మలేసియా వీసా ఫ్రీ ఎంట్రీతో భారతీయుల ఇక్కట్లు

**కౌలాలంపూర్, ఆగస్టు 29:** మలేషియా ప్రభుత్వం భారతీయులకు 30 రోజుల వీసా ఫ్రీ ఎంట్రీ సౌకర్యాన్ని కల్పించింది. అయితే, ఈ సదుపాయం అందుబాటులో ఉన్నప్పటికీ, చాలా మంది భారతీయ పౌరులు మలేషియా విమానాశ్రయాల్లో అడుగుపెట్టకుండానే వెనక్కి తిరిగి రావలసి వస్తోంది. అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు వారిని 'నాట్ టు ల్యాండ్' కేటగిరీ కింద చేర్చి, దేశంలోకి ప్రవేశాన్ని నిరాకరిస్తున్న ఘటనలు ఇటీవల పెరిగాయని భారత్‌లోని మలేషియా హైకమిషన్ వెల్లడించింది. భారతీయ ప్రయాణికులను వెనక్కి పంపడానికి గల ప్రధాన కారణాలను కూడా హైకమిషన్ స్పష్టంగా వివరించింది. ప్రయాణానికి సరిపడా డబ్బు లేకపోవడం, బస చేసేందుకు సరైన ఆధారాలు (హోటల్ బుకింగ్ వంటివి) చూపించకపోవడం, తిరుగు ప్రయాణానికి కచ్చితమైన విమాన టికెట్ లేకపోవడం వంటి కారణాలతో ఎంట్రీని నిరాకరిస్తున్నట్లు పేర్కొంది.

అంతేకాకుండా ఈ వీసా ఫ్రీ పథకాన్ని అడ్డం పెట్టుకుని ఉద్యోగాల కోసం వస్తున్నారని అనుమానం వచ్చినా కూడా వారిని అనుమతించడం లేదని తెలిపింది.

### ఇరాన్ ప్రయాణికులు విధిగా అనుమతులు పొందాలి

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** ఇరాన్‌కు ప్రయాణించే భారత పౌరులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశానికి వెళ్లే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎమిగ్రేషన్ క్లియరెన్స్ (వలస అనుమతి) తీసుకోవాలని స్పష్టం చేసింది. ఇప్పటివరకు ఇరాన్ ప్రయాణానికి ఈ క్లియరెన్స్ నుంచి మినహాయింపు ఉండేది. అయితే, ఆ మినహాయింపును రద్దు చేస్తూ భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. భారత పౌరుల భద్రత, వారి ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

ఎమిగ్రేషన్ చట్టం, 1983లోని సెక్షన్ 41(1) ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలను ఉపయోగించి ఈ కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చినట్లు వివరించింది. ఈ తాజా ఉత్తర్వులతో, 2006 డిసెంబర్ 28న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా ఇరాన్ ప్రయాణానికి కల్పించిన మినహాయింపు పూర్తిగా రద్దయింది.

### పరువు హత్యల కట్టడికి సుప్రీంలో విజయ్ పిటిషన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** తమిళస్టార్ హీరో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ ఓకీలక సామాజిక అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రంలో పెరిగిపోతున్న పరువు హత్యలను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరుతూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఇటీవల తమిళనాడులో ఓ దళిత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దారుణ హత్యకు గురైన నేపథ్యంలో టీవీకే ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. జులై 27న తిరునల్వేలిలో ఐటీ ఉద్యోగి కవిన్ సెల్వగణేషన్ పరువు హత్యకు గురయ్యారు. వేరొక సామాజిక వర్గానికి చెందిన యువతిని ప్రేమించడమే ఆయన హత్యకు దారితీసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, యువతి సోదరుడు సుర్జిత్, తండ్రి శరవణన్‌ను అరెస్టు చేశారు. ఈ హత్య రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో బాధితుడికి న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా చూడాలని టీవీకే తన పిటిషన్‌లో పేర్కొంది.

# తిరుపతి ఐఐటిలో ఇండస్ట్రీ స్పాన్సర్డ్ ఎం టెక్ ప్రారంభం

## ఇంధన ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 29 ప్రభాతవార్త :** తిరుపతి ఐఐటిలో మరో కొత్త డిగ్రీ కోర్సుకు శ్రీకారం చుట్టారు. తిరుపతి ఐఐటిలో డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ సారధ్యంలో ఒక్కొక్క అడుగు ముందుకు నడుస్తుంది. ఈ నేపధ్యంలో శుక్రవారం అడ్వాన్స్డ్ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీ ఇండస్ట్రీ-స్పాన్సర్డ్ ఎంటెక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికు ఐఐటికి చెందిన అరుణ్‌కుమార్ తంగిరాల, శేఖర్ గుమ్మలు ప్రారంభించారు. తిరుపతి ఐఐటిలో అడ్వాన్స్డ్ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీలో మార్గదర్శక ఎంటెక్ ప్రోగ్రామ్‌లో తన మార్గదర్శక ఎంటెక్ ప్రోగ్రాం అధికారికంగా ప్రారంభించారు. ఇది స్థిరమైన మరియు తదుపరి తరం ఇంధన పరిష్కారాల వైపు ప్రపంచ ధోరణులకు అనుగుణంగా ఉండే ఒక ప్రధాన విద్యా కార్యక్రమం అని వక్తలు వివరించారు.

రెండు రోజులు ఓరియంటేషన్ కార్యక్రమాలు: తిరుపతి ఐఐటిలో రెండు రోజుల ఓరియంటేషన్ ప్రోగ్రాం కెరీర్ డెవలప్‌మెంట్ అండ్ ఔట్రీచ్ డీన్ ప్రొఫెసర్ అరుణ్ కుమార్ తంగిరాల కార్పొరేట్ రిలేషన్స్ డీన్ ప్రొఫెసర్ శేఖర్ గుమ్మ ప్రారంభ వ్యాఖ్యలతో ప్రారంభించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కె.సత్యనారాయణ కొత్తగా వచ్చిన విద్యార్థులకు సంస్థ లక్ష్యాలను, విలువలు, విజయాల గురించి వివరించారు.విద్యాసైపుణ్యాలు పరిశ్రమల ఔచిత్యం గురించి అంచనాలు నిర్దేశించారు. ఈ కార్యక్రమాల్లో ఒక ప్రత్యేక ఎఫైలెట్ పరిశ్రమ నాయకుల చురుకైన భాగస్వామ్యం వారు ఇందన నిల్వ యొక్క ప్రస్తుత మరియు భవిష్యత్తు డిమాండ్లపై విభిన్న దృక్కోణాలను అందించారు.గ్రూప్ అపరేషన్స్ జేయస్‌డబ్ల్యు అధిపతి అశ్విన్ బజాజ్ మాట్లాడుతూ భారత దేశ పునరుత్పాదక ఇంధన పరివర్తనలో అధునాతన ఇంధన నిల్వఆత్యవసర అవసరాన్ని వివరించారు. అమర్‌రాజా ఎనర్జీ మరియు మొబిలిటీ లిమిటెడ్ విజయానంద్ ఎస్ మాట్లాడుతూ వేగవంతమైన సాంకేతిక మార్పులు, బ్యాటరీలు,హైబ్రిడ్ వ్యవస్థలపై దృష్టి సారించటం కార్యాచరణ,పర్యావరణ లక్ష్యాలను చేరుకోవటానికి అవిష్కరణ లక్ష్యాలను చేరుకోవటానికి అవిష్కరణ ప్రాముఖ్యత గురించి చర్చించారు. జేయస్‌డబ్ల్యు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ యశోధన్ ప్రమోద్ మాట్లాడుతూ ప్రపంచ ఉత్తమ పద్ధతులను తాజా సాంకేతిక,నియంత్ర ప్రమాణాలతో పాఠ్యాంశాలను సమలేఖనం చేయవలసిన అవసరాన్ని పంచుకున్నారు.

# తడిపొడిచెత్త విభజన లేకుండా ఘనవ్యర్థాల నిర్వహణపై ప్రణాళికలు

## - తడిచెత్తతో టిటిడి బయోగ్యాస్, ఎరువులు తయారీ

**తిరుమల,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలకు ప్రతిరోజూ లక్షమందివరకు వస్తున్న భక్తులు, భారీగా ప్రోగవుతున్న చెత్తను తడి,పొడిగా విభజించే అవసరం లేకుండా వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలుచేసే పద్ధతులపై టిటిడి వినూత్న ఆలోచన చేసింది. ఇందుకోసం శాస్త్రవేత్త పద్మశ్రీ శరద్‌ఖలేతో కలసి శుక్రవారం మధ్యాహ్నం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ,సిఇ సత్యనారాయణ, ఇఇ సుధాకర్, డిప్యూటీ ఇఒ సోమన్నారాయణతో సమావేశమయ్యారు. తిరుమలను పర్యావరణ హిత ప్రాంతంగా, కాలుష్యరహితంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా ఇప్పటికే ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధించిన విషయం విదితమే. భక్తులు తమ వెంట తెచ్చుకున్న పదార్థాల వ్యర్థాలను తడి,పొడిగా వేరుచేసి సేకరించడం టిటిడి పారిశుద్ధ్యవిభాగం, ఆరోగ్యశాఖకు కొంత ఇబ్బందికరంగా మారింది. ఇదే సమయంలో తడి,పొడి చెత్త విభజన లేకుండా ఘనవ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలుచేసేందుకు ప్రణాళికలను అన్వేషించాలని ఇఒ శ్యామలరావు ఆదేశించారు. తిరుమలలో ఉత్పత్తి అవుతున్న తడి చెత్తను ఉపయోగించి బయో గ్యాస్ ,ఎరువులు తయారుచేయడం కోసం టిటిడి-ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ సంస్థ భాగస్వామ్యంతో బయో గ్యాస్‌ప్లాంట్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. బయోడిగ్రేడబుల్ వ్యర్థాలను ఉపయోగించి



బయోగ్యాస్ ఉత్పత్తి చేయడం పర్యావరణ అనుకూల పరిష్కారం అని శాస్త్రవేత్త ఖలే పేర్కొన్నారు. త్వరలో టిటిడికి అనువైన ప్రణాళికను అందజేస్తానని హామీ ఇచ్చారు. కూరగాయల వ్యర్థాలతో ఇళ్లలోనే సేంద్రీయ ఎరువులు తయారీ విధానాన్ని ఇఒ,అదనపు ఇఒల ముందు ప్రదర్శించారు.


**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

**అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన**

SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8 (6) ప్రకారం జారీ చేయడమైనది.

టు,
**ఋణగ్రహీత'ల చిరునామా:** 1) **వెలమాటి శరత్,** డి.నెం.24ఎ-13-8, వీరేశలింగం గారి వీధి, అశోక్ నగర్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534001. 2) **వెలమాటి నాగేంద్ర భూపతి,** డి.నెం. 24ఎ-13-8, వీరేశలింగం గారి వీధి, అశోక్ నగర్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534001.
**సర్ / మేడమ్**
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (2002 యొక్క 54) లోని సెక్షన్ 13(12) దీనితో చదువుకోలసిన సదరు రూల్స్‌లోని రూల్ 3 ప్రకారం ఋణగ్రహీతలకు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి **తేది. 09-04-2018**న జారీచేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన విధంగా **తేది.08-04-2018** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.2,89,91,502/-** (అక్షరాల రెండు కోట్ల ఎనభై తొమ్మిది లక్షల తొంభై ఒక్క వేల ఐదు వందల రెండు రూపాయలు మాత్రమే) + **తేది.09.04.2018** నుండి కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు వసూలు నిమిత్తం పైన తెలిపినట్లు 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.
మీరు మొత్తం ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సదరు ఆస్తులను సెక్షన్ 13(4) దీనితో సదరు రూల్స్‌లోని రూలు 8(1) ప్రకారం అధీకృత అధికారి సదరు తనఖా ఆస్తిని **తేది.14.06.2018**న స్వాధీనం చేసుకున్నారు. సదరు స్వాధీనత నోటీసును **తేది. 19-06-2018**న **(సాక్షి: పశ్చిమగోదావరి జిల్లా ఎడిషన్(తెలుగు)** మరియు **ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ : తాడేపల్లిగూడెం ఎడిషన్ (ఇంగ్లీష్))** దినపత్రికలలో రూలు 8(2) ప్రకారము ప్రచురించడమైనది.
**తేది.09-04-2018** నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తమును ఈ నోటీసు తేదీ నుండి 30 రోజులలోగా చెల్లించవలెను. లేని యెడల బ్యాంక్‌నకు తనఖా ఉంచిన దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించుటకు ఇ-వేలం/బహిరంగ వేలం కొరకు టెండర్లు / కొటేషన్లు సాధారణ ప్రజానీకం నుండి ఆహ్వానించబడును.

**స్థిరాస్తి వివరములు**

**ఆస్తి నెం-1:** పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు, అశోక్ నగర్, తిమ్మరుసు వీధి, టియస్ నెం.7ఎ, ప్లాట్ నెం.7ఎ లోని 705 చ॥గ॥ల స్థలం అందు డోర్ నెం.24ఎ-3-6లతో గల క్రింద మరియు మొదటి అంతస్తులతో కూడిన ఆర్‌సిసి స్లాబ్ రూఫ్ భవనం 1) శ్రీ వెలమాటి నాగేంద్ర భూపతి, తండ్రి: వెంకట సుబ్బారావు, 2) శ్రీ వెలమాటి శరత్, తండ్రి: నాగేంద్ర భూపతి గార్లకు చెందినది. **(రిజిష్టర్డ్ సేల్ డీడ్ నెం.3312/2013, తేది.26-03-2013 ప్రకారం). హద్దులు: తూర్పు:** సురభి లక్ష్మి గారి స్థలం, **దక్షిణం:** కొనుగోలుదారుల స్థలం, **పడమర :** తిమ్మరుసు రోడ్డు, **ఉత్తరం:** గుండె జగన్నాథం & పరికూటి శ్రీనివాసరావు గార్ల స్థలం.
**ఆస్తి నెం-2:** పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు, అశోక్ నగర్, తిమ్మరుసు వీధి, టియస్ నెం.7ఎ, సమీప డోర్ నెం.24ఎ-3-6, ప్లాట్ నెం.7ఎలోని 349 చ॥గ॥ల స్థలం 1) శ్రీ వెలమాటి నాగేంద్ర భూపతి, తండ్రి: వెంకట సుబ్బారావు, 2) శ్రీ వెలమాటి శరత్, తండ్రి: నాగేంద్ర భూపతి గార్లకు చెందినది. **(రిజిష్టర్డ్ సేల్ డీడ్ నెం.3313/2013, తేది.26-03-2013 ప్రకారం). హద్దులు: తూర్పు:** సురభి లక్ష్మి గారి స్థలం, **దక్షిణం:** బల్ల అచ్చాయమ్మ గారి స్థలం, **పడమర:** తిమ్మరుసు రోడ్డు, **ఉత్తరం:** కొనుగోలుదారుల భవనం.
**ఆస్తి 1 మరియు 2 ఆస్తుల మొత్తం విస్తీర్ణం 1054 చ॥గ॥లు.**

తేది: 19-08-2025
ప్రదేశం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా


### విశాఖలో ఆర్టీసి బస్సు దగ్ధం షార్ట్ సర్క్యూట్‌తో జాతీయ రహదారిపై ప్రమాదం

**విశాఖ క్రైమ్ ప్రభాత వార్త :** విశాఖలో ఆర్టీసీ బస్సు దగ్ధమైన ఘటన నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. శాంతి పురం వద్ద గల జాతీయ రహదారి వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. కూర్మన్నపాలెం నుంచి విజయనగరం వెళ్తున్న ఆర్టిసి బస్సు శాంతిపురం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ జాతీయ రహదారి వద్దకు రాగానే బస్సు నుండి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును నిలిపివేసి ప్రయాణికులను కిందకు దింపేశారు. మంటలు వేగంగా వ్యాపించడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. తామంతా పెను ప్రమాదం నుంచి బయట పడ్డామని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన జాతీయ రహదారి వద్ద గల స్థానిక పెట్రోల్ బంకు పక్కనే జరగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. బస్సులోని ఇంజిన్ నుంచి పొగలు వచ్చి తర్వాత మంటలు రావడం గుర్తించి ప్రయాణికులను అప్రమత్తం చేసి కిందకి దింపేసామని ఆర్టీసీ డ్రైవర్ తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలను అదుపులోకి తీసుకున్నారు.

# పుల్లేటి కట్ట డ్రైన్‌పై ఆక్రమణలను తొలగింపచేసిన టిపిఒ 'వసీం బేగ్'

## - కమిషనర్ ఆదేశాల మేరకు వర్షపు నీరు సజావుగా ప్రవహించేలా చర్యలు - దశాబ్దాల సమస్యకు పరిష్కారం



**విజయవాడ కార్పొరేషన్,ఆగస్టు 29,ప్రభాతవార్త** విజయవాడ మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ఆక్రమణలకు గురై తన అసలు రూపాన్ని కోల్పోయిన పుల్లేటి కట్ట డ్రైన్‌పై ఉన్న ఆక్రమణలను టిపిఒ వసీం బేగ్ శుక్రవారం తొలగించారు. భారీ వర్షాల నేపథ్యంలో విజయవాడ నగరం ముంపుకు గురి కాకుండా నగరపాలక సంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా తూర్పు నియోజక వర్గం,3వ డివిన్ లోని కీలకమైన పుల్లేటి కట్ట డ్రైన్‌పై దృష్టి సారించారు. దశాబ్దాలుగా ఆక్రమణలు గురై,అసలు రూపాన్ని కోల్పోయిన ఈ డ్రైన్,వర్షపు నీరు సజావుగా ప్రవహించకుండా అడ్డుకుంటోంది. దీని ఫలితంగా డ్రైన్ పరిసర ప్రాంతాలైన లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురై ప్రజా జీవనం అస్తవ్యస్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఈ సమస్యపై తీవ్రంగా స్పందించిన కమీషనర్ ధ్యానచంద్ర ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, యుద్ధప్రాతికన ఆక్రమణలు తొలగించి డ్రైన్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని ఆదేశించారు. ఈ మేరకు విఎంసి ఇంజనీరింగ్,టౌన్ ప్లానింగ్,హార్టికల్చర్ విభాగాల సమన్వయంతో ఆక్రమణల తొలగింపు ప్రక్రియను చేపట్టారు.ఈ తొలగింపు కార్యక్రమంలో సిపి సంజయ్‌కుమార్,ఏసిపి మోహన్‌బాబు,టిపిఒ వసీం బేగ్‌లతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అక్రమంగా నిర్మించిన కట్టడాలను కట్టడాలను,చెత్తా చెదారాన్ని యంత్రాల సహాయంతో తొలగించి,డ్రైన్ ప్రవాహానికి మార్గాన్ని సుగమం చేశారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ముంపు నివారణకు శాశ్వత పరిష్కారాలను అమలు చేస్తామని విఎంసి అధికారులు తెలిపారు.

# ఎల్‌హెచ్‌బి రైలు బోగీల బ్రేకింగ్‌పై మార్గదర్శకాలు

## - జారీ చేసిన రైల్వే జాతీయ ఆర్‌డిఎస్‌ఒ సంస్థ

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 29,ప్రభాతవార్త** గత నాలుగు రోజులుగా రైల్వే యంత్రాంగానికి కునుకు, విశ్రాంతి లేకుండా చేస్తున్న, మొరాయిస్తున్న బసవ ఎక్స్‌ప్రెస్ బ్రేక్ ప్రెషర్ డ్రాప్ సమస్యపై,రైలు యాంత్రిక, సాంకేతిక లోపాలపై లక్నోలోని రైల్వే జాతీయ పరిశోధన సంస్థ రీసెర్చ్ డిజైన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్(ఆర్‌డిఎస్‌ఒ)ప్రత్యేకంగా మార్గదర్శకాలను రూపొందించింది. రాయలసీమ జిల్లాల మీదుగా మైసూరు-బాగల్‌కోట్-మైసూరు మధ్య తిరిగే 17307/08బసవ ఎక్స్‌ప్రెస్‌లో ఏర్పడిన యాంత్రిక, సాంకేతిక సమస్యలతో గత నాలుగు వారాలుగా ఈ నెల 5నుండి రైల్వే యంత్రాంగానికి ముఖ్యంగా యాంత్రిక విభాగానికి అంతుబట్టని సమస్యగా తయారైంది. బసవ ఎక్స్‌ప్రెస్‌లో ఏర్పడిన బ్రేకింగ్ లోపంతో ఫార్మేషన్ రేక్‌ను రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాలతో హుబ్లీ డివిజన్ కోచింగ్ డిపోకు తరలించిన విషయం పాఠకులకు విధితమే. జర్మనీ దేశపు అత్యాధునిక యాంత్రిక,సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన లింక్ హాఫ్ మెన్ బుష్(ఎల్‌ఎహ్‌బి) బోగీలు కలిగిన బసవ ఎక్స్‌ప్రెస్ ఫార్మేషన్‌లో 50కి.మీల వేగానికి తేరుకునేలోగా బ్రేక్ ప్రెషర్ తగ్గిపవడంతో రైలు మొరాయించి ఆగిపోవడం వంటి సమస్యలతో ప్రయాణికులు, రైల్వే సిబ్బంది పడ్డ అవస్థలు, ఇబ్బందులు వర్ణణాతీతం. రైల్వే అధికార యంత్రాంగం ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో బోర్డు ఆదేశాల మేరకు లక్నోలోని ఆర్‌డిఎస్‌ఒ కోచింగ్ డైరెక్టర్, డైరెక్టరేట్ బృందం బసవ ఎక్స్‌ప్రెస్ బ్రేకింగ్ విధానంలో ఏర్పడిన లోపాన్ని గుర్తించి ఈ తరహా సమస్యలను ఉత్పన్నం అయిన సమయంలో రైల్వే లోకోపైలట్‌లు, గార్డులు, సిఅండ్‌డబ్ల్యు సిబ్బంది,రైల్వే కోచింగ్ నిర్వహణ విభాగం సిబ్బందికి మార్గదర్శకాలను, సూచనలను చేసింది. ఎల్‌హెచ్‌బీ బోగీల ఫార్మేషన్ బ్రేకింగ్ విధానంలో బ్రేకింగ్ కంట్రోల్ ప్యానెల్,పైప్‌లైన్లు, బ్రేకింగ్ ప్రెషర్,ఎఫ్‌పి, బ్రేకింగ్ డిస్క్‌లు ఎఫ్‌ఎస్‌డిఎస్,ఇబిఎవి, పిఇఎవి,మిస్‌క్రియేంట్‌ల అలారం చైన్ పుల్లింగ్(ఏసిపి ),ఫేయిలూర్ ఇండక్షన్ బ్రేక్ అప్లికేషన్ (ఫిబా),ఫైర్ డిడక్షన్ యూనిట్ (ఎఫ్‌డియు),బ్రేక్ అగ్జిలేటర్ యూనిట్(బిఏసి)లలో బ్రేకింగ్ సమస్యలు ఏర్పడిన సమయంలో ఏఎల్‌సి/టిఎంఅర్ ఎమర్జెన్సీ,ఎయిర్ సప్లై యూనియన్(ఏఎస్‌పి)వంటి కీలక అంశాల పనితీరుపై ఆర్‌డిఎస్‌ఒ కోచింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ సింగ్,డైరెక్టరేట్ బృందం,రైల్వే బోర్డు మెకానికల్ కోచింగ్ విభాగం ఇడీలకు దిశానిర్ధేశం చేస్తూ మార్గదర్శకాలు జారీచేశారు.

# దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా వినాయకచవితి పూర్ణాహుతి



ఫోన్ల డిపాజిట్‌కౌంటర్లో డిపాజిట్ చేస్తున్న విఐపిలు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 29, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో వినాయక చవితి ఉత్సవాలకు శుక్రవారం పూర్ణాహుతి నిర్వహించి శ్రీ స్వామివారిని ఆలయం నుండి ఊరేగింపుగా మేళ తాళాలు, మంగళవాయిద్యాలతో తొడ్కొని వచ్చి పవిత్ర కృష్ణానదిలో నిమజ్జనం నిర్వహించారు. కార్యక్రమం లో ఇఓ వికె శీనా నాయక్, వేదపండితులు పాల్గొన్నారు. దుర్గమ్మ ఆలయంలో శుద్ధ షష్టిసందర్భంగా శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాద వితరణ చేశారు. కనకదుర్గానగర్ నుండి మహామండపం వరకు వున్న బిటి రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఇఓ ప్రత్యేక శ్రద్ధతో వేగవంతంగా నిర్మాణం చేసేలా చర్యలు తీసుకున్నారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చే విఐపిలు, సిఫార్సు లెటర్లున్న విఐపి లు శుక్రవారం తమ సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ వస్తువులను పెద్ద ఎత్తున డిపాజిట్ చేసి దర్శనానికి వెళ్ళారు.

# అన్నమయ్య కీర్తనలపై రాష్ట్రస్థాయి పోటీలు : టిటిడి ఇఒ శ్యామలరావు



**తిరుమల,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమయ్య కీర్తనలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించాలని ,ఇందుకు ముందుగా అడిషన్లు చేపట్టాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు సూచించారు. హరికథకు పూర్వవైభవం తీసుకురావడానికి 31వతేదీ ఆదివారం నిర్వహించనున్న 'హరికథవైభవం"కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. శుక్రవారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో జెఇఒ వీరబ్రహ్మం, అన్నమాచార్యప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ మేడసాని మోహన్, ఆకెళ్లవిభీషణశర్మ, డిప్యూటీ ఇఒ గోవిందరాజు తదితరులుతో కలసి ఇఒ సమీక్షించారు. టిటిడి ఆధ్వర్యంలోని అన్ని ధార్మిక ప్రాజెక్టుల పనితీరు మెరుగపడాలని, అన్నమయ్య సాహిత్యాన్ని కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో పరిశోధనలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలకు, యువత అన్నమయ్య కీర్తనల పట్ల మక్కువ పెంచేందుకు వినూత్న కార్యక్రమాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. హిందూ ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో కొత్త కార్యక్రమాలను ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి ప్రాజెక్టుకు ఈవెంట్స్‌తో రూపొందించిన క్యాలండర్ సిద్దంచేయాలని ఇఒ శ్యామలరావు ఆదేశించారు. ఎస్వీరికార్డింగ్ ప్రాజెక్టు ద్వారా అన్నమయ్యకీర్తనలను సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేసి యువతకు చేరువచేయాలని సూచించారు.

# అమ్మ భాషకు మించిన కమ్మదనం మరొకటి లేదు

## - ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ.ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు భాషను ఆధునిక పద్ధతిలో ఆలోచించి, తెలుగు భాష ఔనత్యాన్ని చాటి చెప్పండంలో తొలి భాషా విజ్ఞాని గిడుగు రామ్మూర్తి పంతులు అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు.

గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదిననాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళులు అర్పించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాష ఔనత్యాన్ని భావితరాలకు చాటి చెప్పాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దేశ భాషలో గొప్పదైన కమ్మనిదైన తెలుగు భాషకు మించిన భాష మరొకటి లేదని అందుకే దేశభాషలందు తెలుగలెస్స అని అలనాటి చక్రవర్తి శ్రీ కృష్ణ దేవరాయలు అన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. తెలుగు భాషను ఆధునిక పద్ధతిలో ఆలోచించిన భాషా విజ్ఞాని కీర్తి శేషులు గిడుగు రామ్మూర్తి పంతులు అని తెలుగు భాష ఔనత్యాన్ని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. గిడుగు రామ్మూర్తి జన్మదినమైన ఆగస్టు 29 న రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. తెలుగు వ్యవహారిక భాషకు పితామహుడుగా గిడుగు రామ్మూర్తి పరిగణించబడతారన్నారు. అభినవ వాగమశాసనుడుని బిరుదు పొందిన గిడుగు రామ్మూర్తి గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకువచ్చిన మహనీయుడన్నారు. తెలుగు భాష గొప్పదనాన్ని కమ్మదనాన్ని చాటి చొప్పిన గిడుగు రామ్మూర్తి తెలుగు ప్రజల హృదయాలలో చిరస్మరనీయులుగా నిలుస్తారన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక, ఒరిస్సా రాష్ట్రాలతో కలిపి దాదాపు 15 కోట్ల మంది ప్రజలు తెలుగు భాషను మాట్లాడుతూ భాషలోని మాదుర్యాన్ని ఆశ్వాధిస్తున్నారన్నారు.

# గత ప్రభుత్వ అవకతవకలపై నివేదిక ఇవ్వండి

## - పలు శాఖల విభాగాధిపతులకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు దిశా నిర్దేశం చేసిన మంత్రి నారాయణ



**నెల్లూరు కార్పొరేషన్,ఆగస్టు 29,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఎమ్మెల్యేలు, నుడా, కార్పొరేషన్ ,జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పలు శాఖల విభాగాధిపతులతో కీలక అంశాలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో ఆయా నియోజకవర్గాల్లో వైఎస్సార్సీపీ చేసిన అక్రమాలను మంత్రికి ఎమ్మెల్యేలు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై విచారణ చేసి నివేదిక సిద్ధం చేయమని మంత్రి ఆదేశించారు.ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం అనేక అవకతవకలకు పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నివ్యవస్థలను సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటీలని నిర్వీర్యం చేసిందని, ఎలాంటి అభివృద్ధి పనులు జరగకుండానే డబ్బులు డ్రా చేసేసిందని దుయ్యబట్టారు. దీనిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఎమ్మెల్యేలు కోరారగా త్వరలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఎవరూ నష్టపోకూడదని ఎల్ ఆర్ ఎస్ ను అందుబాటులోకి తెచ్చామన్నారు. సెట్ బ్యాక్స్, లేఔట్లు, బిల్డింగ్స్ కి అనేక అనుమతులు, అవకాశాలు ఇచ్చామని తెలిపారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ లో వచ్చిన మొత్తాన్ని ఆ నియోజకవర్గ ఆభివృద్ధికి ఖర్చు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు అక్రమిస్తే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. కొత్త లేఔట్స్ లో 10 శాతం స్థలం పార్క్, దేవాలయాలకు వదిలేయాలని స్పష్టం చేశారు. అనంతరం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, కందుకూరి ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు, నూడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడారు.


**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

**అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన**

SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8 (6) ప్రకారం జారీ చేయడమైనది.

టు,
**ఋణగ్రహీత'ల చిరునామా:** 1. **శ్రీ వెలమాటి సూర్య కిరణ్,** తండ్రి : నాగేంద్ర భూపతి, డి.నెం.24ఎ-13-8, వీరేశలింగం గారి వీధి, అశోక్ నగర్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా - 534006. 2. **శ్రీమతి వెలమాటి సుజాత,** భర్త : శ్రీ నాగేంద్ర భూపతి, డి.నెం.24ఎ-13-8, వీరేశలింగం గారి వీధి, అశోక్ నగర్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా - 534006. 3. **శ్రీ వెలమాటి శరత్,** తండ్రి : వెలమాటి నాగేంద్ర భూపతి, డి.నెం.24ఎ-13-8, వీరేశలింగం గారి వీధి, అశోక్ నగర్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా - 534006.
**సర్ / మేడమ్**
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (2002 యొక్క 54) లోని సెక్షన్ 13(12) దీనితో చదువుకోలసిన సదరు రూల్స్‌లోని రూల్ 3 ప్రకారం ఋణగ్రహీతలకు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి **తేది. 09-04-2018**న జారీచేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన విధంగా **తేది.08-04-2018** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.85,23,921/-** (అక్షరాల ఎనభై ఐదు లక్షల ఇరవై మూడు వేల తొమ్మిది వందల ఇరవై ఒక్క రూపాయలు మాత్రమే) + **తేది.09.04.2018** నుండి కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు వసూలు నిమిత్తం పైన తెలిపినట్లు 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.
మీరు మొత్తం ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సదరు ఆస్తులను సెక్షన్ 13(4) దీనితో సదరు రూల్స్‌లోని రూలు 8(1) ప్రకారం అధీకృత అధికారి సదరు తనఖా ఆస్తిని **తేది.14.06.2018**న స్వాధీనం చేసుకున్నారు. సదరు స్వాధీనత నోటీసును **తేది. 19-06-2018**న **(సాక్షి: పశ్చిమగోదావరి జిల్లా ఎడిషన్(తెలుగు)** మరియు **ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ : తాడేపల్లిగూడెం ఎడిషన్ (ఇంగ్లీష్))** దినపత్రికలలో రూలు 8(2) ప్రకారము ప్రచురించడమైనది.
**తేది.09-04-2018** నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తమును ఈ నోటీసు తేదీ నుండి 30 రోజులలోగా చెల్లించవలెను. లేని యెడల బ్యాంక్‌నకు తనఖా ఉంచిన దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించుటకు ఇ-వేలం/బహిరంగ వేలం కొరకు టెండర్లు / కొటేషన్లు సాధారణ ప్రజానీకం నుండి ఆహ్వానించబడును.

**స్థిరాస్తి వివరములు**

పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు, ఏలూరు మున్సిపాలిటీ, వార్డు నెం.సి వద్ద (i) డోర్ నెం.7బి-6-16 వద్ద అసెస్మెంట్ నెం.4772, టి.ఎస్.నెం.1244, 1245, (ii) టి.ఎస్.నెం.1247/2, డోర్ నెం.7బి-5-9, అసెస్మెంట్ నెం.9667 మరియు (iii) టి.ఎస్.నెం.1247, డోర్ నెం.7బి-5/1-8/1, లోని మొత్తం 483 చ॥గ॥ల విస్తీర్ణంలో ఆర్‌సిసి స్లాబ్ రూఫ్ క్రింది, మొదటి మరియు రెండవ అంతస్తులతో గల భవనముల యావత్తు ఆస్తి శ్రీ వెలమాటి శరత్, తండ్రి : నాగేంద్ర భూపతి గారికి చెందినది (రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.లు 9290/2014, తేది.30.09.2014 ప్రకారం).
**షెడ్యూలు-1 ఆస్తి హద్దులు : ఐటమ్ నెం.1 :** విస్తీర్ణం : 192.1.0 చ॥గ॥లలో గల స్థలం మరియు భవనం టి.ఎస్.నెం.1244,1245, డోర్.నెం.7బి-6-16, అసెస్మెంట్ నెం.4772తో కలదు. **హద్దులు : తూర్పు :** ఐటమ్ నెం.4 ఉమ్మడి దారి కొంతమేర మరియు ఐటమ్ నెం.2 కొంతమేర, **పడమర:** రోడ్డు, **దక్షిణం :** రోడ్డు, **ఉత్తరం :** ఐటమ్ నెం.3 కొంతమేర మరియు రోడ్డు కొంతమేర.
**ఐటమ్ నెం.2 :** విస్తీర్ణం : 11.4.8 చ॥గ॥ల స్థలం టి.ఎస్.నెం.1244, 1245, డోర్ నెం.7బి-6-16, అసెస్మెంట్ నెం.4772తో కలదు. **హద్దులు : తూర్పు:** వి. మాణిక్యం గారి గోడ, **పడమర :** ఐటమ్ నెం.1 లోని ఇల్లు, **దక్షిణం :** ఎమ్. సదా శివుడు గారి భవనం గోడ, **ఉత్తరం :** ఉమ్మడి దారి (ఐటమ్ నెం.4).
**ఐటమ్ నెం.3 :** విస్తీర్ణం : 5.7.3 చ॥గ॥ల స్థలం టి.ఎస్.నెం.1244, 1245, డోర్ నెం.7బి-6-16, అసెస్మెంట్ నెం.4772తో కలదు. **హద్దులు : తూర్పు :** లేదు, **పడమర :** రోడ్డు, **దక్షిణం :** ఐటమ్ నెం.1 యొక్క ఇల్లు మరియు స్థలం, **ఉత్తరం :** మున్సిపల్ దారి.
**ఐటమ్ నెం.4 :** విస్తీర్ణం : ఉమ్మడి దారి స్థలం 17.3.3 చ॥గ॥ల విస్తీర్ణంలో సగ భాగం, టి.ఎస్.నెం.1244, 1245, డోర్ నెం.7బి-6-16, అసెస్మెంట్ నెం.4772తో కలదు. **హద్దులు : తూర్పు :** కె. మాణిక్యం గారి ఇంటి ప్లాట్‌ఫారమ్, **పడమర :** ఐటమ్ నెం.1 గోడ, **దక్షిణం:** ఐటమ్ నెం.2 ఆస్తి, **ఉత్తరం :** మున్సిపల్ దారి.
**షెడ్యూలు-1 ఆస్తి ఐటమ్ నెం.లు 1, 2 & 3ల మొత్తం విస్తీర్ణం 209.3.11 చ॥గ॥లు, షెడ్యూలు -1 యొక్క ఐటమ్ నెం.4 లోని ఉమ్మడి దారి స్థలం 17.3.3 చ॥గ॥ల విస్తీర్ణంలో సగ భాగంతో కలిపి.**
**షెడ్యూలు-2 ఆస్తి హద్దులు : ఐటమ్ నెం.1 :** విస్తీర్ణం : 130.4.10.1/2 చ॥గ॥లలో గల స్థలం మరియు భవనం టి.ఎస్.నెం.1247/2, డోర్ నెం.7బి-5-9, అసెస్మెంట్ నెం.9667తో కలదు. **హద్దులు : తూర్పు :** ఎమ్. సీతమ్మ గారి ఇంటి స్థలం, **పడమర :** జి. దీన దయాళ్ గారి ఇంటి స్థలం కొంతమేర మరియు ఉమ్మడి దారి కొంతమేర మరియు రోడ్డు కొంతమేర, **దక్షిణం :** ఈ షెడ్యూలు లోని ఐటమ్ నెం.2 కొంతమేర, ఒ. అంజనేయులు గారి ఆస్తి కొంతమేర, **ఉత్తరం :** రోడ్డు.
**ఐటమ్ నెం.2 :** విస్తీర్ణం : 0.5.3 చ॥గ॥ల స్థలం టి.ఎస్.నెం.1247/2, డోర్.నెం.7బి-5-9, అసెస్మెంట్ నెం.9667తో కలదు. **హద్దులు : తూర్పు :** ఎమ్. సీతమ్మ గారి ఇంటి స్థలం, **పడమర :** ఒ. అంజనేయులు గారి భూమి, **దక్షిణం :** ఎస్. వీరమ్మ గారి గోడ, **ఉత్తరం :** ఈ షెడ్యూలు లోని ఐటమ్ నెం.1.
**ఐటమ్ నెం.3 :** విస్తీర్ణం : 16.3 చ॥గ॥ల మొత్తం విస్తీర్ణం (మొత్తం విస్తీర్ణం లోని 1/2 వాటా) లోని 8.1.6 చ॥గ॥ల స్థలం టి.ఎస్.నెం.1247/2, డోర్.నెం.7బి-5-9, అసెస్మెంట్ నెం.9667తో కలదు. **హద్దులు : తూర్పు :** ఈ షెడ్యూలు లోని ఐటమ్ నెం.1, **పడమర :** జి. దీన దయాళ్ గారి గోడ, **దక్షిణం :** జి. దీనదయాళ్ గారి ఇంటి స్థలం, **ఉత్తరం :** రోడ్డు.
షెడ్యూలు-2 ఆస్తి ఐటమ్ నెం.1, 2 & 3ల మొత్తం విస్తీర్ణం 139.2.7½ చ॥గ॥లు.,
**షెడ్యూలు-3 ఆస్తి హద్దులు :** టి.ఎస్.నెం.1247, డోర్.నెం.7బి-5/1-8/1తో కలదు. **హద్దులు: తూర్పు :** ఎమ్. నాగలింగం గారి ఇంటి స్థలం, **పడమర :** ఎన్. పెద్దిరాజు గారి ఇంటి స్థలం, **దక్షిణం :** ఎ. రమణ గారి ఇంటి స్థలం, **ఉత్తరం :** రోడ్డు.
షెడ్యూలు-3 ఆస్తి విస్తీర్ణం 134 చ॥గ॥ల స్థలం మరియు భవనం.
**షెడ్యూలు 1, 2 మరియు 3 ఆస్తుల మొత్తం విస్తీర్ణం 483 చ॥గ॥లు.,**

తేది: 19-08-2025
ప్రదేశం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా


# భారత కోచ్ నుంచి అంతర్జాతీయ విజేతగా చెయ్యనూరు సాయికుమార్ విజయయాత్ర

**గూడూరు, ఆగస్టు 29, ప్రభాతవార్త** భారత బ్యాడ్మింటన్‌లో కోచ్‌గా తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్న చెయ్యనూరు సాయికుమార్, ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై క్రీడాకారుడిగా కూడా విజయాలు సాధిస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన సాయికుమార్, చిన్న వయసులోనే బ్యాడ్మింటన్‌పై ఆసక్తి పెంచుకుని, ఆ ఆసక్తిని వృత్తిగా మార్చుకున్నారు. కోచ్‌గా ఆయనకు ఉన్న గుర్తింపు వెనుక బాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ లెవల్ 1 కోచింగ్ సర్టిఫికేషన్, నేషనల్ అడ్మినిస్ట్రేషన్ కోర్స్ వంటి అర్హతలు అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ అందించే స్థాయికి చేర్చాయి. సాయికుమార్ శిక్షణలో ఉన్న క్రీడాకారులు స్టేట్ ఛాంపియన్ల నుంచి నేషనల్ మెడలిస్టుల వరకు ఎదగడం విశేషం. ఆయన శిష్యుల్లో కొందరు ఇప్పటికే భారతదేశానికి అంతర్జాతీయ వేదికపై ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులను ప్రోత్సహించడం జరిగింది.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం వచ్చే జూన్25 నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఎపి : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్



విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:వచ్చే ఏడాది జూన్ 5వ తేది ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహత రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అడుగులు ముందుకు వేస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిపాలనాకేంద్రమైన సచివాలయంలో ఈనెల 15వతేదీ నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది.ఈప్రక్రియలో భాగంగా ప్లాస్టిక్ తాగునీటి బాటిళ్ళ స్థానే స్టెయిన్ లెస్ స్టీల్,గాజు సీసాలతో సురక్షిత తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ను శుక్రవారం 3వ భవనంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ప్రారంభించారు.ఒక సారి వినియోగించి పడవేసే(సింగిల్ యూజ్)ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా రాష్ట్ర సచివాలయంలో పనిచేసే ప్రతి ఒక్కరూ స్టీల్ / గాజు సీసాల్లోనే మంచినీటిని తాగాలని సీఎస్ అన్నారు. ఉద్యోగులు అందరికీ ఉచితంగా స్టెయిన్ లెస్ స్టీల్ మంచినీటి బాటిళ్ళను పంపిణీ చేయడం జరిగింది.బయటి నుండి వచ్చే సందర్శకులు కూడా సచివాలయంలోకి ప్లాస్టిక్ మంచినీటి బాటిళ్ళు,ఇతర ప్లాస్టిక్ వస్తువులు తీసుకురాకుండా చర్యలు తీసుకుంటున్నారు.ప్రతి ఒక్కరికీ సురక్షిత తాగునీరు అందించేందుకు సిఆర్డిఏ ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేకంగా 8ఆర్వో(రివర్సు ఆస్మోసిస్)ప్లాంట్లను ఏర్పాటు చేయమన్నారు.

# శ్రీవరసిద్ధి వినాయక స్వామివారికి లక్ష గరిక పూజ



భీమవరం ఆగష్టు 29 ప్రభాతవార్త :భీమవరం సుంకర పద్దయ్య వీధిలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామివారికి లక్ష గరిక పూజ నిర్వహించారు. గణపతి నవరాత్రుల మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఆలయ కమిటీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించి వేద మంత్రాలతో లక్ష గరిక పూజ నిర్వహించారు. నవరాత్రుల మహోత్సవంలో స్వామివారికి హెూమాలు, గరిక పూజలను నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు.

# ఎమ్మెల్సీ గోపికి మహిళా కళాశాల సమస్యల వినతి



ప్రభాతవార్త నరసాపురం : బి జి బి ఎస్ ఉమెన్స్ కాలేజీ ఆస్తుల పరిరక్షణకు, అధ్యాపకుల ఉద్యోగ భద్రత కనీస వేతనాలు ఇవ్వటకు, ప్రభుత్వం నిజ నిర్ధారణ ,పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలని ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ బి గోపి మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, స్థానిక ఉమెన్స్ కాలేజీ ఆస్తులు పరిరక్షణ కోసం అధ్యాపకుల ఉద్యోగ భద్రత జీతాల కోసం 63 రోజులుగా దీక్ష నిర్వహిస్తున్న అధ్యాపకుల దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి సంపూర్ణ మద్దతు తెలియజేశారు, ఈ సందర్భంగా అధ్యాపకుల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, అనంతరం ఆయన మాట్లాడుతూ బి జి బి ఎస్ ఉమెన్స్ కాలేజీలో అధ్యాపకులు చేస్తున్న పోరాటం న్యాయమైందన్నారు, సర్వే శెట్టి గారు ఆశయాలను తుంగలో తొక్కుతూ వారు ఆలోచన విధానానికి వ్యతిరేకంగా వ్యాజమాన్యం వ్యవహరించటం తగదన్నారు,మహిళా కాలేజీ అభివృద్ధి కోసం దాతలు దానం చేసిన ఆస్తులను అన్యాక్రతం చేయటం తగదన్నారు, మహిళా కళాశాల ఆస్తులు కాపాడటానికి ప్రభుత్వం ఆస్తుల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు, ఎన్నో సంవత్సరాల నుండి అధ్యాపకులుగా పనిచేస్తున్న అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కనీ వేతనంతో కూడిన జీతాలు కల్పించాలన్నారు, ఈ కాలేజీ సమస్యల కోసం ఉన్నత అధికారుల దృష్టికి విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఈ కాలేజీలో జరుగుతున్న అన్యాయాలు అక్రమాలకు అరికట్టడం కోసం ప్రభుత్వం ద్వారా ఒక నిజనిధారణ కమిటీని , ఆస్తుల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేయిస్తాం అన్నారు, ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు కాలేజీ కమిటీ సభ్యులు బిల్లు బ్రదర్స్ అధ్యాపకులు పిల్లి ఝాన్సీ లక్ష్మి వీరవల్లి గంగా లక్ష్మి పోలేటి భవాని టీ ఎల్ ఎస్ మనోహరి జీ రాధా సిహెచ్ సరోజిని తదితరులు పాల్గొన్నారు

## భాష్యం పాఠశాలలో
# తెలుగు మాతృ భాషా దినోత్సవ వేడుకలు:



పెనుగొండ ఆగస్టు29 ప్రభాత వార్త: దేశ భాషలెన్ని నేర్చిన అమ్మభాషే ఆధారం అన్న స్ఫూర్తిదాయక వాక్యంతో మాతృభాషా దినోత్సవాన్ని పెనుగొండ భాష్యం విద్యార్థులు శుక్రవారం ఎంతో వైభవంగా నిర్వహించారు. స్థానిక కంబాలవారి వీధిలో గల భాష్యం పాఠశాలలో, తెలుగు వ్యవహారిక భాషకు నాంది పలికిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతిప్రజ్వలన చేయడంతో కార్యక్రమం ప్రారంభమైంది. చిన్నారులు తెలుగు సాహితీవేత్తలు, యోధులు, సంఘసంస్కర్తలు, స్త్రీమూర్తుల వేషధారణలో ఆకట్టుకున్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రతిబింబించే పాటలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో కార్యక్రమం కళ్లకు కట్టినట్లుగా సాగింది. ఒక విద్యార్థి వినిపించిన తెలుగు నిరాదరణపై గేయకవిత అందరినీ ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్.వి. అప్పారావు మాట్లాడుతూ – "కాలానుగుణంగా ఎన్నో భాషలు నేర్చుకున్నా, మాతృభాషనే మూలం. తెలుగు భాషలోని శతకాలు, సామెతలు, జాతీయాలు, కథలు మన జీవితానికి నైతిక విలువలు నేర్పుతాయి. మాతృభాషలో పట్టు సాధించినవారు అన్ని శాస్త్రాల్లోనూ మెరుస్తారు" అని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. తరువాత విద్యార్థులు పద్యపఠనం, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భాష్యం జోనల్ ఇన్చార్జ్ ఏ. శ్రీమన్నారాయణ రెడ్డి, చాంప్స్ ఇన్చార్జ్ రాణి రోజాజీ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

# విద్యార్థులు పాఠశాల మానకుండా చూడాలి
## - ఎంఈఓ శ్రీనివాస్



చాట్రాయి, ఆగస్టు 29, ప్రభాతవార్త విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని చాట్రాయి మండల విద్యాశాధికారి 1 మాసగిరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలో పలు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు ఏజెన్సీలు శ్రద్ధ చూపాలని దీనిపై ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. మరుగుదొడ్ల విషయంలో కూడా పరిసురభంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పాఠశాలలో ఎటువంటి ఇబ్బందులు ఉండవనే విషయాన్ని ప్రజలు గుర్తించే విధంగా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఆయన చెప్పారు. మండలంలో పోతనపల్లి మండల పరిషత్ పాఠశాలు ఎల్. టి, ఎస్ ఎల్ టి పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పర్వతాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు ఎస్ సి, పార్వతపురం మెయిన్, సి. గుడిపాడు ఎంపీయుపి పాఠశాల లను ఆకస్మిక తనిఖీ చేయడం చేసి పాఠశాల రికార్డు లను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యలను పరిశీలించారు. మధ్యాహ్నభోజనం తయారు చేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉండాలి అని, రుచికరంగా పిల్లలకు అందించాలని అన్నారు.విద్యార్థుల హాజరు పరిశీలించి ఎవరు పాఠశాల మానకుండా చూడాలి అని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# పట్టణ స్థాయి చదరంగం పోటీలలో ఛాంబర్స్ డిగ్రీ విద్యార్థుల హవా



ప్రభాతవార్త నరసాపురం పాలకొల్లు : దాసరి నారాయణరావు మహిళా డిగ్రీ కళాశాలలో పట్టణ స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు . చాంబర్స్ డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు ఈ చదరంగం పోటీలలో మొదటి బహుమతి ఎం. సౌమ్య -I బీఎస్సీ ,(డేటా సైన్స్) రెండవ బహుమతి జి.చాందిని I బి సి ఎ కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపినారు. కళాశాల చైర్మన్ కె.వి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు అకాడమిక్ గాను మరియు క్రీడా స్ఫూర్తి పెంపొందించుకొనుట ద్వారా ఆల్రౌండ్ డెవలప్మెంట్ సాధించవచ్చునని అన్నారు. కళాశాల సెక్రటరీ కెవి సీతారామరాజు మాట్లాడుతూ చదరంగం విద్యార్థులలో మేధాశక్తిని, చురుకుదనాన్ని అందిస్తుందని తద్వారా విద్యార్థులకు తెలివితేటలు పెరుగుతాయని అన్నారు. తదుపరి విజయం సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అప్పారావు , అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కదులుతున్న జిల్లా ఉద్యమ రథచక్రాలు
## ఆదివారం జిల్లా కేంద్రం పై అఖిల పక్ష సమావేశం.



నరసాపురం ప్రభాతవార్త : నరసాపురం జిల్లా కేంద్రం చెయ్యాలని కోరుతూ ప్రభుత్వానికి వివరణ తెలిపేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో, నరసాపురం అఖిల పక్ష జేఎసి నేత, సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు అధ్యక్షతన ఈ నెల 31 వ తేదీ ఆదివారం ఉదయం 10 గం లకు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించనున్నారని జేఎసి సభ్యులు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రాల మార్పుల పునః పరిశీలన లో భాగంగా లిభౌగోళిక అర్హతలు ఉన్న నరసాపురంను జిల్లా కేంద్రం చెయ్యాలని ప్రభుత్వం, జిల్లా కేంద్రాల పరిశీలన కమిటీ దృష్టిలో పెట్టేందుకు మరియు భవిష్యత్ కార్యాచరణపై అఖిల పక్షం సమావేశం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల ముఖ్య నాయకులు, ప్రజా సంఘాలు, వ్యాపార సంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, భవన నిర్మాణ కార్మికుల సంఘం, వివిధ సంఘాల ప్రతినిధులు హాజరు కావాల్సిందిగా కోరారు.

# డా. బాలచందర్‌ను ఘనంగా సత్కరించిన వాసవి మహిళా కళాశాల



పెనుగొండ ఆగస్టు29 ప్రభాత వార్త: తెలుగు భాషా దినోత్సవం – గిడుగు వెంకట రామమూర్తి జయంతి వేడుకలు పెనుగొండ వాసవి మహిళా కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ బిడిఎల్ నర్సమాంబ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రోపన్యాసకులు, ప్రముఖ కవి–గాయకులు, ఆస్కా చైర్మన్ డా. బాలచందర్ తెలుగు భాషా విశిష్టతను, గిడుగు రామమూర్తి జీవితాన్ని విద్యార్థులకు వివరిస్తూ, కవితలు, గేయాలు, గజళ్ళు, పద్యాలు ఆలపించి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. నేటి తరంలో విద్యార్థులు ఎలా నడుచుకోవాలి? జీవిత ఆశయాలను ఎలా సాధించాలి? అనే అంశాలపై ఆయన ఉత్తేజభరితమైన ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ గవర రవికుమార్, పి.యు.ఎన్. సతీష్ మాట్లాడుతూ %–% నాలుగు సార్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, పలు ప్రపంచ రికార్డులు, అంతర్జాతీయ అవార్డులు సాధించిన డా. బాలచందర్ మా ఆహ్వానాన్ని స్వీకరించి కళాశాలకు రావడం మాకు గౌరవకరం అని, విద్యార్థులకు ఆయన అందించిన సందేశం అపూర్వమని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కళాశాల యాజమాన్యం డా. బాలచందర్‌ను ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకుడు కె. వంశీకృష్ణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని డా. బాలచందర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రొంగల రవికుమార్ ప్రత్యేకంగా ఆయనను సత్కరించారు.

# తెలుగును మృత భాష కానీయొద్దు
## వై ఎన్ లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



ప్రభాతవార్త నరసాపురం : స్థానిక శ్రీ వై ఎన్ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు వెలుగు కార్యక్రమంలో భాగంగా విశ్రాంత తెలుగు అధ్యాపకులు ధవళ లక్ష్మీనరసింహారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మన మాతృభాష అయిన తెలుగు ప్రస్తుతం అంతరించే స్థాయికి దగ్గరలో ఉందని, యునెస్కో ప్రకటించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని అధిగమించి మన భాషను అభివృద్ధి చేసుకొని, సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రస్తుతం వ్యవహారిక భాషా పితామహునిగా పిలవబడుతున్న గెలుపు రామమూర్తి పంతులు జన్మదినోత్సవాన్ని మాతృభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాము. గ్రాంధిక భాషలో బోధన జరిగే రోజులలో సామాన్యులకు తెలుగు భాష అందుబాటులో ఉండేది కాదు. అందువలన మాతృభాష అందని ద్రాక్షగా మారినది. ఈ స్థితిలో గిడుగు వ్యవహారిక భాషాభివృద్ధికి నడుము కట్టాడు. అదేవిధంగా శాసనాల భాషకు ఊపిరిలూదాడు. శాసన భాషను నేర్చుకుని చరిత్రకు ఎంతో మేలు చేశారని, వ్యవహారిక భాష అయిన తెలుగును పాఠ్యాంశాలుగా తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారని అందుకే ఈయనను గిడుగు పిడుగు అంటారని ' అన్నారు. ఈ కార్యక్రమమునకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనకారావు అధ్యక్షత వహించారు. కళాశాల అకాడమిక్ సలహాదారుడు ఆర్ వి సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ, గిడుగు రామమూర్తి పంతులు గారి కృషి ఫలితంగా ఈరోజు మనం వ్యవహారిక భాషా ఫలాలను అనుభవిస్తున్నామని అన్నారు. హెచ్ ఆర్ డి డైరెక్టర్ ప్రొఫెసర్ చినమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, అమ్మను అమ్మ భాషను మరిచిపోరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ గంధం శ్రీ రామకృష్ణ, తెలుగు శాఖా విభాగాధిపతి సాదే యాకోబు, సంస్కృత శాఖా విభాగాధిపతిరాలు డాక్టర్ కె.వి.ఆర్.బి. వరలక్ష్మి, జాగ్రఫీ శాఖ విభాగాధిపతి కె సి ఎస్ వి రమణ, భీమడోలు ప్రసాద్, బీఈడీ వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణ రామకృష్ణ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సేనాధిపతి తనయుడు పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్
## -5 రోజులైన కేసు నమోదు చేయకపోవడం సరికాదు



కైకలూరు,ఆగస్టు29(ప్రభాతవార్త) :సేనాధిపతి ఎవి శ్రీనివాసరావు కుమారుడిపై జరిగిన దాడికి కారకులైన కుట్రదారులను, నిందితులను తక్షణమే అరెస్టు చేసి చట్టరీత్యా కఠినచర్యలు తీసుకోవాలని రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్ధన్ డిమాండ్ చేశారు. సేనాధిపతి తనయుడు రాజేష్ ప్రయాణిస్తున్న కారుపై ఆదివారం అర్ధరాత్రి ఏలూరు–కైకలూరు రహదారిలో తమ్మిలేరు వంతెనపై కిరాయి దుండగులు రాళ్ల దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర కాపు జేఏసీతోపాటు నియోజకవర్గంలోని పలువురు కాపు పెద్దలు స్థానిక కోరుకొల్లు రోడ్డులోని ఎవి శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి తామంతా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాజేష్పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్ధన్, కాపు జేఏసీ నాయకుడు ఆకుల శ్రీనివాసరావు లు మాట్లాడుతూ.. కాపు కుటుంబంపై జరిగిన దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. విజయవాడ నుంచి కైకలూరు కారులో వస్తున్న రాజేష్ పై దుండగులు కాపుకాసి రాళ్లదాడి చేసి హత్యాయత్నానికి పాల్పడటం దారుణమన్నారు. మూడుదశాబ్దాలకు పైబడి పాత్రికేయ వ్యవస్థలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్న సీనియర్ పాత్రికేయుడు, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర నాయకుడు ఎ.వి.శ్రీనివాసరావు కుమారుడిపై దాడి అత్యంత అమానుషమన్నారు. దాడికి పాల్పడిన దుండగులను ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసి అయిదు రోజులైనా నేటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవటం శోచనీయమన్నారు. ఘటనకు కారకులైన వారిని తక్షణం అరెస్టు చేసి చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని తమ మిత్రుడు, బాధితుడు ఎ.వి. శ్రీనివాసరావు డిమాండ్ చేస్తున్నారని, ఘటనకు కారకుడైన వారు ఆర్థికంగా, రాజకీయంగా బలవంతుడు కావటంతో తన కుమారుడు రాజేష్ తోపాటు కుటుంబసభ్యులకు ప్రాణహాని ఉందని ఆందోళన చెందుతున్నాడని, రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు బాధితుడు రాజేష్ తోపాటు కుటుంబసభ్యులకు రక్షణ కల్పించాలని డిజిపిని డిమాండ్ చేశారు. దారికాసి రాజేష్ ప్రయాణిస్తున్న కారుపై దుండగులు రాళ్లదాడికి పాల్పడి భయానకం సృష్టించారని, దాడి జరిగి అయిదు రోజులైనా పోలీసులు కుట్రదారులను అరెస్టు చేయకపోవటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తక్షణం అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# వచ్చే నెల 05వ తేదీన పెన్షనర్ల సంఘం ఎన్నికలు

పెనుమంట్ర–ప్రభాతవార్త : పెనుమంట్ర మండలం పెన్షనర్స్ సంఘం (ఎస్ జి పి ఏ)సమావేశం వచ్చే నెల ఐదవ తేదీ మార్టేరు రోటరీ క్లబ్ భవనం నందు అధ్యక్షులు తామాడ సత్యనారాయణ అధ్యక్షతన జరుగునని సంఘం కార్యదర్శి పాల నాగ పాల నాగ వరప్రసాదరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో 2025–2028 కాలానికి నూతన కమిటీ ఎన్నికలు జరుగునని తెలిపారు. ఎన్నికల అధికారిగా ఎస్ జి పి ఏ జిల్లా అడ్వైజర్ వి.కోటి వీరారావు, ఎన్నికల సహాయ అధికారిగా, జిల్లా ట్రెజరర్ వి రామమోహన్ రావు ఎన్నికలు నిర్వహిస్తారని తెలిపారు . ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా అధ్యక్షులు బి హరికుమార్, జిల్లా ప్రధానకార్యదర్శి వైవిఎస్ మూర్తి విచ్చేస్తారని తెలిపారు. సంఘ సభ్యులు హాజరై విజయవంతం చేయవలసిందిగా కోరారు.

# బదిలీ అయిన ఆరోగ్య సిబ్బందికి సత్కారం.



అత్తిలి– గణపవరం ఆగస్టు 29 (ప్రభాతవార్త ):గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్యాధికారులు డాక్టర్ పి కిరణ్మయి, డాక్టర్ కే ఓంకార్నాథ్ సీ హెచ్ ఓ జాలాది విల్సన్ బాబు ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరములు పనిచేసే ఇటీవల సాధారణ బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు ఘనంగా సత్కరించారు. స్టాఫ్ నర్స్ డి. శిరోమణి, ఏ ఎన్ ఎం లు.కే పుష్పావతి, జి కనకలక్ష్మి, ఎస్.సముద్ర వేణి,బి. సుజాత, ఈ.వరలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. ఆశ కార్యకర్త సిహెచ్ సుబ్బలక్ష్మి ను ఘనంగా సత్కరించారు.

# ఉపాధ్యాయులకు అభినందన.

అత్తిలి/గణప వరం ఆగస్టు 29( ప్రభాతవార్త ): గణపవరం మండలం, సరిపల్లి గ్రామంలో ఎం.పీ..పి.ఎస్ నెం.2 పాఠశాల, అర్థవరం గ్రామంలో ఎం.పి.పి.ఎస్.నెం.1పాఠశాల ల్లో పనిచేస్తున్న 2008 డీఎస్సీ కనీస టైం స్కేల్ ఉపాధ్యాయులు మద్దాల నాగన్న , ఆవిడి ప్రసాద్ 2025 డీఎస్సీ ద్వారా స్కూల్ అసిస్టెంట్ (సోషల్) గా ఎంపికయ్యారు. వారిని నిడమర్రు , గణపవరం మండలాల్లో పనిచేస్తున్న డీఎస్సీ 2008 కనీస టైం స్కేల్ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# పొలం పిలుస్తోంది కార్యక్రమం.



అత్తిలి– ఆగస్టు 29 (ప్రభాతవార్త) :అత్తిలి మండలం స్కిన్నెర పురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి టికే రాజేష్ రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. అనవసరంగా ఎరువులు వాడ వద్దని, వ్యవసాయ అధికారులు సూచించిన మేరకే ఎరువులు వాడాలని తెలిపారు.

# మౌలిక వసతుల కల్పన సాధనలో సస్టైనబులిటీ సాధించాలి!

భీమవరం ఆగస్టు 29 ప్రభాతవార్త : వ్యవసాయం ,ఆరోగ్యం, మంచినీరు సాగునీరు అన్నిట సస్టైనబులిటీ సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ సివిల్ ఇంజనీరింగ్ శాస్త్రవేత్త ఐఐటి చెన్నై సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ డాక్టర్ వేణు రాజు పేర్కొన్నారు. భీమవరం ఎస్ ఆర్ కార్ ఇంజనీరింగ్ కళాశాలలో పాండ్ పాలసీ వాటర్ టాక్స్ ఫీల్డ్ ఇన్సైట్స్ అండ్ సస్టైనబుల్ సొల్యూషన్స్ అనే అంశంపై మూడు రోజులు జరిగే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు.

వార్త
విలేకరులు కావలెను
వార్త తెలుగుదిన పత్రిక నందు పని చేయుటకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి వివిధ మండల కేంద్రాలలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఏలూరు జిల్లా...
ఏలూరు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, టి.నర్సాపురం, పెందులూరు, పెదవేగి, పోలవరం,కొయ్యలగూడెం
పశ్చిమ గోదావరి జిల్లా...
ఆకివీడు, గణపవరం, నిడమర్రు, ఆచంట, పాలకొల్లు, వీరవాసరం, యలమంచిలి, పెనుగొండ
ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు సంప్రదించవలెను.
ఫోన్:9704502377

# కృష్ణబలిజ కులస్తులకు ఆర్థిక చేయూతనివ్వాలని వినతి



భీమవరం ఆగష్టు 29 ప్రభాతవార్త :కృష్ణబలిజ, పూసల కులస్తులకు ప్రభుత్వం తరుపున ఆర్థిక చేయూతనివ్వమని కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు (భీమవరం టిడిపి సీనియర్ నాయకులు) కోరారు. అమరావతిలోని సెక్రటేరియట్ బీసీవెల్ఫేర్ – 3 ఛాంబర్లో బీసీ కమీషనర్ సత్యనారాయణ ను, విజయవాడ లోని బిసి వేల్ఫేర్ కార్యాలయంలోని బిసి వేల్ఫేర్ జనరల్ మేనేజర్ భీమ శంకర్ ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కృష్ణబలిజ, పూసల కుల సంఘాల స్థితిగతులను వారికి తెలియజేసి వారికి రావలసిన కార్పొరేషన్ నిధులపై చర్చించారు. వారికి ప్రభుత్వం ద్వారా బడ్జెట్లో నిధులు కేటాయించి కృష్ణబలిజ, పూసల కులస్తులకు ఆర్థిక చేయూతనివ్వమని త్రిమూర్తులు కోరారు.

# రావిపాడులో తెలుగు భాషా దినోత్సవం



అత్తిలి/ పెంటపాడు– ఆగస్టు 29 (ప్రభాత వార్త ): పెంటపాడు మండలం రావిపాడు గ్రామం లోని మోడల్ ప్రైమరీ స్కూల్ నెం.1 లో తెలుగు వ్యవహారిక భాషను అందుబాటు లోనికి తెచ్చిన భాషా శాస్త్రవేత్త గిడుగు వెంకట రామమూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవం గా ప్రధానోపాధ్యాయులు కందికుప్ప కాశీ విశ్వనాధం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయిని మంగతాయారు తెలుగు భాష గొప్పతనం గురించి తెలుగు పద్యాలు, డ్రాయింగ్,వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎస్ ఎం సి చైర్మన్ కరిబండి దేవీ నాగ రాజేశ్వరి అందించారు.ఉపాధ్యాయుడు వి వి వి పరదేశి మాట్లాడారు.

# కేఎస్ గట్లు లో స్మార్ట్ కార్డులు పంపిణీ.



అత్తిలి –ఆగస్టు 29( ప్రభాత వార్త): అత్తిలి మండలం కే ఎస్ గట్టు గ్రామంలో తెలుగుదేశం యువ నాయకుడు మెంతురాజ్ కుమార్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ చేసారు. క్యూఆర్ కోడ్, రాజముద్ర కలిగినందున రేషన్ పంపిణీ మరింత పాదదర్శకంగా జరుగుతుందని రాజ్ కుమార్ తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అనేక నిధులు కేటాయించి పనులు చురుగ్గా జరగడానికి విశేషమైన కృషి చేస్తున్నారని అన్నారు .ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేండ్ర సత్యనారాయణ, కార్యదర్శి మేళం వెంకట్, కూటమి నాయకులు గుడాల కాంతారావు, వేండ్ర పావని ప్రసాద్, రాయుడు తాతారావు, కడల శ్రీనివాస్, గుండేపల్లి మురళి, అయినాల శ్రీనివాసు, చిట్టాల పార్వతి పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# మాతృభాష కన్నా మధురం మరొకటి ఉండదు

## - ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో డాక్టర్ కడిమెళ్ళ
## - ఘనంగా తెలుగు భాషా దినోత్సవం




ప్రభాతవార్త పాలకొల్లు నర్సాపురం : స్థానిక ఛాంబర్స్ డిగ్రీ మరియు పిజీ కళాశాల ప్రాంగణంలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం జరిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సహస్రవధాని భారతీపుత్ర డాక్టర్ కడిమెళ్ళ వరప్రసాద్ విచ్చేసినారు. ఆయన మాట్లాడుతూ తెలుగువారికి మాతృభాష తెలుగు భాషని మాతృభాష కమ్మదనం మరో భాషలో ఉండదన్నారు. తెలుగులో మాట్లాడడం తెలుగులో రాయడం తెలుగును సంపూర్ణంగా తెలుసుకోవడం తెలుగు వారిగా మనకు కనీస బాధ్యతని గుర్తు చేశారు. ప్రపంచంలో బ్రతకడానికి అనేక భాషలను నేర్చుకోవచ్చుని కానీ మాతృభాషను మాత్రం ప్రాణంగా ప్రణవంగా ఊపిరి ఉన్నంతవరకు విస్మరించరాదన్న రు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ తెలుగు భాష కమ్మదనం చక్కదనం తో కూడిన పాల లాంటి స్వచ్ఛమైన ఈ భాషను ఆస్వాదించడం తెలుగువారుగా మనందరి అదృష్టం అని ఏ విషయాన్ని అయినా మనం ఇష్టపడ్డప్పుడు ఆ విషయ జ్ఞాన సముపార్జన సులభతరం అవుతుందని, ప్రతి విద్యార్థి తెలుగు పద్య పఠనం, తెలుగు కవితలు, తెలుగు సాహిత్యం పై అవగాహన పెంపొందించుకొనుట ధారణ మరియు అభ్యసన ద్వారా సాధించవచ్చునని అంటూ , అష్టావధానం శతవదానం, సహస్రవదానం లాంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి విద్యార్థులు అడిగిన లఘు ప్రశ్నలను నివృత్తి చేశారు. కళాశాల చైర్మన్ శ్రీ కెవి నరసింహారావు మాట్లాడుతూ అంతరించబోవు భాషల్లో యుఎన్ఓ ప్రకటించిన భాషల్లో తెలుగు భాష ఉండటం అత్యంత బాధాకరమని, వృత్తిరీత్యా ఆంగ్ల భాష



పై మక్కువ నేటి తరం వారికి ఉన్నప్పటికీ అమ్మలాంటి మాతృభాషా తెలుగును, తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను నేటి తరముకు అందించుటకు తమ కళాశాల తెలుగు డిపార్ట్మెంట్ చేస్తున్న కృషి చాలా సంతోషాన్ని ఇస్తుందన్నారు. కళాశాల సెక్రటరీ కెవి సీతారామరాజు మాట్లాడుతూ తెలుగు భాష గ్రాంథిక భాషలో ఉన్న కఠినత్వాన్ని అందరికీ అణువుగా వ్యవహారిక భాషగా అందించుటకు కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి గారి జన్మదినంను ప్రభుత్వం తెలుగు భాషా దినోత్సవం గా ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జరుపుకొనుటకు అవకాశం కలిగించినదని, మన మాతృభాష తెలుగును అతి ప్రాచీన భారతీయ భాషగా కేంద్రం గుర్తించుట మన తెలుగు జాతికి గర్వంగా చెప్పుకోవచ్చు అన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి నీ కలిసిన ఎమ్మెల్యే రోషన్ కుమార్

చింతలపూడి.. ప్రభాత వార్త : చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ మంగళవారం రాత్రి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాడేపల్లి నివాసంలో కలుసుకొని నియోజవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు నియోజకవర్గ రహదారుల అభివృద్ధితోపాటు, చింతలపూడి లో బస్ డిపో ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత గురించి, గ్రామీణ ప్రాంత ప్రజలకు సోలార్ విద్యుత్తు చేరువ చేయడం తదితర అంశాలను ముఖ్యమంత్రి కి వివరించిన ఎమ్మెల్యే రోషన్ కుమార్ వివరించిన అన్ని అంశాలను సావధానంగా విని సీఎం చంద్రబాబు నాయుడు అందుకు సానుకూలంగా స్పందించారు



# అందుబాటులో ఉన్న ఇసుకను వినియోగించు కోండి:కలెక్టర్ నాగరాణి

భీమవరం ఆగస్టు 29ప్రభాతవార్త : జిల్లాలో ఏర్పాటుచేసిన 7 ఇసుక నిల్వ కేంద్రాలలో అందుబాటులో ఉన్న ఇసుకను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని వర్చువల్ గా నిర్వహించి, జిల్లాలో ఇసుక నిలువులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత లేకుండా ఎప్పటికప్పుడు అధికారులు సమన్వయం చేసుకుని నిల్వలను అందుబాటులో ఉంచాలన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఇసుక కొరత రాకుండా ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు ఏడు నియోజక వర్గాలలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఇసుక నిల్వ కేంద్రాలను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నిర్వహించడం జరుగుచున్నదని, ఇసుక అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం



చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా గనులు శాఖ అధికారి జి.వెంకటేశ్వరరావు, డిపిఓ ఎం.రామనాథరెడ్డి, ఇన్చార్జి ఆర్డీవో డి ఎస్ ఎస్ నాయక్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ, కమిటీ సభ్యులు, ఆర్డీవోలు, తహసిల్దారులు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# అత్యవసర సమయంలో 108 వాహనాలు సమర్థవంతంగా సేవలందించాలి

## జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...

ఏలూరు, ప్రభాతవార్త : జిల్లా కలెక్టరు ఛాంబర్లో శుక్రవారం మెడికల్ కాలేజీ విద్యార్థిని, విద్యార్థులకు వసతిగృహా సౌకర్యాలు,104 వాహనాలు, తదితర అంశాలపై జిల్లా వైద్యరోగ్య శాఖ, డిసిహెచ్ యస్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు జరిగేలా వైద్యులు చూడాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది బాధ్యతతో పనిచేసి మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. సిసి కెమెరాల ద్వారా వైద్య సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మెడికల్ కాలేజీ టెక్నీషియన్లు, టెక్నికల్ పోస్టులను త్వరితగతిన భర్తీప్రక్రియను పూర్తి చేయాలన్నారు. శిథిలావస్థకు చేరిన 108 వాహనాలను ఆక్షన్



వేసి, కొత్త వాహనాలకు ప్రపోజల్స్ సిద్ధం చెయ్యాలని సంబంధిత అధికారులను కె.వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లా మెడికల్ కాలేజీ విద్యార్థిని, విద్యార్థులకు వసతి, విద్యాబోధన పట్ల సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మెడికల్ విద్యార్థులు వసతికి ఏటువంటి ఇబ్బందులు లేవని, అయితే సెప్టెంబరు 5వ తేదీ నాటికి మూడవ బ్యాచ్ 150 మంది విద్యార్థులు వస్తారని వీరికి వేరే చోట అన్ని సౌకర్యాలు ఉన్న వసతి గృహ భవనాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ లోపుగా మాతాశిశు భవనం రెండవ ఫ్లోర్లో తాత్కాలికంగా వసతి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఇదే హాస్పటల్లో ప్రస్తుతం ఉన్న డిసిహెచ్ యస్ కార్యాలయాన్ని వేరే చోట భవనానికి షిఫ్టు చేసి, ఖాళీ చేసిన భవనాన్ని హాస్పిటల్ కి అప్పజెప్పాలని అన్నారు. నర్సింగు కాలేజీ, నర్సింగు స్కూలు మరియు వసతి గృహాలు ప్రస్తుతం జనరల్ హాస్పిటల్ ఒక ఫ్లోర్లు లో కార్యకలాపాలు జరుగుతున్నాయని, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలోకి వీరిని షిఫ్టు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మెడికల్



కాలేజీ గ్రౌండు మరియు ఫస్ట్ ఫ్లోరు ఒక మాసంలో పూర్తి చేయాలని ఏపియంయస్ ఐడిసి అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పి.జె. అమృతం, డిసిహెచ్ యస్ డా.బి.పాల్ రాజు, సూపర్డెంటు యం.యస్.రాజు, వైస్ ప్రిన్సిపాల్ డా.కె.భాస్కర్,108 మేనేజరు డి.రాజు, ఏపియంయస్ ఐడిసి ఇంజనీరు యు.యస్.వై.రాజబాబు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# డయాలసిస్ పేషెంట్లు ఇబ్బందులను పరిష్కరిస్తా

## - కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

భీమవరం ఆగష్టు 29 ప్రభాతవార్త: భీమవరంలో డయాలసిస్ పేషెంట్లకు ఆరోగ్యశ్రీ కింద పొందే సేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉన్నతాధికాలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాను అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. శుక్రవారం భీమవరం పరిసర ప్రాంతాల నుంచి నరసయ్య అగ్రహారంలోని కేంద్ర మంత్రి నివాసానికి పెద్దసంఖ్యలో వచ్చిన డయాలసిస్ పేషెంట్లు వారి బంధువులు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను కలిసి ఆరోగ్యశ్రీ సేవలను వర్మ హాస్పిటల్ లో పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. నర్సాపురం, వీరవాసరం, మొగల్తూరు, ఉండి,పాలకొల్లు వంటి ?సుదూర ప్రాంతాల నుంచి భీమవరం వచ్చే వందలాది మంది డయాలసిస్ రోగులకు అన్ని రకాలఆరోగ్యశ్రీ సేవలు ఒకే ఆసుపత్రిలో లభిస్తే చాలా ప్రయోజనం ఉంటుందని లేకపోతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని కేంద్రమంత్రి శ్రీనివాస



వర్మ కు తెలిపారు. డయాలసిస్ పేషెంట్లకు ఇబ్బంది లేకుండా తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ డయాలసిస్ పేషెంట్లు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, డయాలసిస్ పేషెంట్లుకు వైద్య పరంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తాను అని వారికి హామీ ఇచ్చారు.

# మున్సిపల్ గేట్లో బైఠాయించిన వైసీపీ కౌన్సిలర్లు చైర్ పర్సన్

- కమిషనర్ తీర్మానాలను అటకెక్కిస్తున్నారని ఆవేదన
- 70 తీర్మానాల్లో ఒక్కటి అమలు చేయలేదు
- సాధారణ సమావేశం ప్రారంభం కాగానే బాయ్ కట్
- అది సరి కాదన్న వన్నెంరెడ్డి

**నరసాపురం ప్రభాతవార్త :** నర్సాపురం మున్సిపాలిటీలో అధికారం వైసీపీ ది. అధికారపక్షం కూటమిది. వైసీపీకి మెజారిటీ ఉన్న ప్రభుత్వ పరంగా పనులు జరగడం లేదు. నియోజకవర్గ నుండి రాష్ట్రం వరకు అధికారంలో కూటమి ఉండడంతో పనులు సాగడం లేదు. ప్రతి సమావేశంలోనూ అరుపులు కేకలు తప్ప అంగుళం అభివృద్ధి లేకుండా పోయింది. దీంతో విసుగు చెందిన వైసిపి కౌన్సిలర్లు చైర్ పర్సన్ వెంకటరమణ కమిషనర్ తీరును తీవ్రంగా ఎండగట్టారు. నరసాపురం పట్టణంలో సమస్యలు జటిలం అవుతున్నాయని ప్రజా జీవనం అధ్వానంగా మారుతోందని డ్రైన్లు మంచినీళ్ల రోడ్లు ఇలా అన్ని వ్యవస్థలు కూడా



కుప్ప కూలిపోయాయని కౌన్సిల్లో తీవ్రంగా దుయ్యబట్టారు. చైర్మన్ వెంకటరమణ సమావేశాన్ని వాయిదా వేసి తమ పార్టీ కౌన్సిలర్ల తో సహా వెళ్లి ఎంట్రన్స్ గేట్ లో బైఠాయించారు. కమిషనర్ ఎం అంజయ్య కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసమర్థ కమిషనర్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనేక తీర్మానాలు చేసి ఒక్క పని చేయకపోవడం విడ్డూరమని ఆయనకు



నచ్చిన ప్రజా వ్యతిరేక పనులు మాత్రం చేసుకుంటూ పోతున్నారని ఎండగట్టారు. మరోవైపు శ్రీనివాస్ వన్నెం రెడ్డి వైసిపి కౌన్సిల్లర్లు చైర్మన్ తీరు సరికాదన్నారు. వేలాదిమంది ప్రజల అవసరాలను అంటగాగిస్తారా అని నిలదీశారు. మున్సిపల్ ఆవరణలో గల గాంధీ విగ్రహం వద్ద జనసేన సభ్యులతో కలిసి నినాదాలు చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ప్రతినెలా జరుగుతోంది కానీ ఇలాగే రసాభాస అవడం తప్ప ప్రజా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు.


# నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

## ఎమ్మెల్యే డాక్టర్ కామినేని

కైకలూరు ఆగస్టు 29 (ప్రభాతవార్త) :నిరుద్యోగ యువత జాబ్ మేళా ద్వారా పలు కంపెనీలు కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లా నందు రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి జాబ్ మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి నిర్వహించే జాబ్ మేళాలో మీ యొక్క ప్రతిభ చూపి మీకు తగిన కంపెనీలలో మంచి జాబ్ చెయ్యాలని అన్నారు.నిర్వహించిన జాబ్ మేళాలో 13 కంపెనీలు పాల్గొనగా 154 మంది యువత హాజరయ్యారు. వారిలో 65



మంది యువత క్వాలిఫై అయినట్టు జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు గారు, నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు గారు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



వశిష్ట గోదావరి ఉగ్ర రూపం దాలుస్తోంది. నరసాపురం వద్ద పెరిగిన వశిష్ట.
నరసాపురం ప్రభాతవార్త

# తమ్మిలేరుకు వరద ఉధృతి

## - తమ్మిలేరుకు ఇన్ ఫ్లో 5వేల, అవుట్ ఫ్లో పదివేల క్యూసెక్కులు

చాట్రాయి,ఆగష్టు 29, ప్రభాతవార్త : గత నాలుగు రోజుల నుండి తెలంగాణా రాష్ట్రంలో ఎడతెరుపు లేకుండా వానలు కురుస్తుండడంతో వాగులు చెరువులు పొంగిపొర్లుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షం కావడంతో బేతిపల్లి అలుగు నుండి తమ్మిలేరుకు నీరు ఉధృతంగా వస్తోంది. ఎగువ నుండి తమ్మిలేరు కాలువ ద్వారా 5వేల క్యూసెక్కులకు పైగా ఇన్ఫ్లో వస్తుండగా దిగుకు పదివేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలియజేస్తున్నారు. మండలంలోని చిన్నంపేట దగ్గర వరద అధికంగా వస్తోంది. అయితే తమ్మిలేరుకు 5వేల క్యూసెక్కులు వరద వస్తోందని తమ్మిలేరు ఏ. ఇ. లాజర్ బాబు తెలియజేస్తున్నారు. దీనివల్ల పెద్ద ప్రమాదం ఏమీ లేదని తమ్మిలేరుకు ఇప్పటికే నీరు పుష్కలంగా ఉందని అందువల్ల దిగువకు వచ్చిన వరదను వచ్చినట్టుగా విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.అయితే తమిళనాడు వద్ద 348అడుగులు నీరు నిల్వ ఉందని ఆయన చెప్పారు. అయితే రాకపోకలకు పెద్దగా ప్రమాదం లేకపోయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తమ్మిలేరు వద్ద 24 గంటలు అధికారులు పర్యవేక్షిస్తున్నారని ప్రస్తుతానికి ఎటువంటి ప్రమాదం లేదని ఆయన చెప్పారు. తమ్మిలేరు వద్ద ఉన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నట్లు



ఏ.ఈ తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలో అన్ని గ్రామాల్లో వర్షాలు కురుస్తుండడంతో జాగ్రత్తలు పాటించాలని అవసరమైతే తప్ప బయటికి రావద్దని తహసిల్దార్ బద్రు నాయక్ కోరారు. మండలంలో అన్ని గ్రామాలలో వరద ఉధృతంగా ఉన్నప్పటికీ ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తాహసిల్దార్ చెప్పారు.

# వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏ ఎం సి తొలి సమావేశం

పెనుగొండ ఆగస్టు29 ప్రభాత వార్త: పెనుగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏ ఎం సి తొలి సమావేశం చైర్మన్ బడేటి వీరబ్రహ్మం అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యంగా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పలు కీలక తీర్మానాలు చేశారు. ముఖ్యంగా రైతులకు అందుబాటులో పుంత రోడ్ల అభివృద్ధి రైతులు తమ పంటలను సులభంగా మార్కెట్కు తరలించేందుకు పుంత రోడ్లను అభివృద్ధి చేయాలని తీర్మానం చేశారు. ఇది రవాణా ఖర్చులను తగ్గించడంతో పాటు, పంటల నష్టాన్ని కూడా తగ్గించగలదు అని అన్నారు. ఇది కేవలం పంటలు అమ్ముకునే స్థలం మాత్రమే కాదు రైతుల ఆర్థిక, సాంకేతిక, సామాజిక అభివృద్ధికి కేంద్రబిందువుగా పనిచేస్తుంది అని పంటలకు గిట్టుబాటు ధర రైతులు తమ పంటలను నేరుగా మార్కెట్కు తీసుకెళ్లి మధ్యవర్తుల జోక్యం లేకుండా అమ్ముకోవచ్చు అని ధరల సమాచారం, బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా



సరైన ధర పొందే అవకాశం ఉంటుంది అని అన్నారు. శీతల గిడ్డంగులు & గోదాములు ఆఎంసీ నిధులతో నిర్మించిన గిడ్డంగులు రైతులు తమ పంటలను నిల్వ ఉంచేందుకు ఉపయోగపడతాయి. పంట నిల్వచేసి, గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు. ఏ ఎం సి ద్వారా రైతులు తక్కువ వడ్డీకి రుణాలు పొందే అవకాశం ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సర్పంచ్ నక్క శ్యామల సోనీ, ఏ ఎం సి డైరెక్టర్, పాలకవర్గం, పాల్గున్నారు.

# సిబ్బంది లేక గ్రామ సచివాలయాలు వెలవెల - మండలంలో అన్నిసచివాలయాలు ఇదే పరిస్థితి

చాట్రాయి, ఆగస్టు 29, ప్రభాతవార్త :చాట్రాయి మండలంలో గ్రామ సచివాలయలలో గత కొన్ని రోజులుగా సిబ్బంది లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు ఏ పని కావాలన్నా స్థానిక సచివాలయాలకి వెళ్లాల్సి ఉండగా సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన సేవలు పొందడానికి వచ్చిన ప్రజలు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా వృద్ధాప్య పింఛన్లు, రైస్ కార్డులు, విద్యుత్ బిల్లులు, ఇంటి పన్నులు, పొలం శిస్తులు కట్టాలన్న సిబ్బంది లేకపోవడంతో వెనుతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకోవడానికి వచ్చే వారి బాధ వర్ణనాతీతంగా మారింది. ఇటీవల సచివాలయ సిబ్బంది బదిలీలపై వెళ్ళగా చాట్రాయి మండలంలోని సచివాలయాలకు సిబ్బంది కోరుకోలేదు అని తెలుస్తోంది. ఇక్కడి నుండి బదిలీ అయిన సిబ్బంది మాత్రం ఆయా ప్రాంతాలకు వెళ్లి జాయిన్ అవ్వగా ఇక్కడ చాలామంది సిబ్బంది జాయింట్ కాలేదు. దీంతో మండలంలో ఏ సచివాలయానికి వెళ్ళినా వెలవెల పోతున్నాయి. కోటపాడు గ్రామ సచివాలయంలో ప్రస్తుతం ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్, ఏఎన్ఎం మాత్రమే ఉన్నారు.ప్రజల సమస్యలను




పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయం ఇలా ఖాళీగా ఉండడం సరైనది కాదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా సచివాలయాలపై దృష్టి సారించి సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



# తెలుగు భాషా దినోత్సవం

చింతలపూడి.. ప్రభాత వార్త : చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ అమ్మలాంటి మాతృభాష వెలుగు మసకబారుతున్న సమయంలో వెలుగు బాట చూపించేందుకు అనేక మంది కృషి చేసిన వారిలో మొదటి వారు గిడుగు వెంకట రామమూర్తి పంతులు. జన్మదినమే తెలుగు భాషా దినోత్సవం. తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి తెలుగు తీయదనాన్ని సామాన్యుడికి చేరువ చేసేందుకు గిడుగు వెంకట రామమూర్తి పంతులు ఎనలేని కృషి చేశారు ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తుగా గిడుగు రామమూర్తి పంతులు జయంతిని తెలుగు భాష దినోత్సవం గా జరుపుకోవడం జరుగుతుందనీ అంతేకాకుండా తెలుగు భాష తల్లితో సమానం .మనం తల్లిని ఎంత గౌరవిస్తామో తెలుగు భాషను కూడా అంతే గౌరవించాలి. మాతృభాషలోనే విద్య బోధన జరగాలి అప్పుడే ఆ వ్యక్తి సంపూర్ణ విజ్ఞానవంతుడు అవుతాడని తెలియజేశారు. అదేవిధంగా కళాశాల సీనియర్ అధ్యాపకులు మరియు వృక్షశాస్త్ర శాఖాధిపతి వి.మదన్ మోహన్ మాట్లాడుతూ జీవితంలో ఎంత



ఉన్నత స్థాయికి ఎదిగిన అమ్మను మర్చిపోకూడదు అలాగే అమ్మ భాషను మర్చిపోకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల శాఖధిపతి శ్రీ బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ అమ్మ ప్రేమ స్వచ్ఛమైనది అమృతం కన్నా తీయనైనది .అందమైనది మన తెలుగు భాష కావున తెలుగుభాషను మరువరాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ విభాగాధిపతి శ్రీ శంకర పోలయ్య రసాయన శాస్త్రశాస్త్ర అధ్యాపకులు శ్రీ ఎ వెంకటేశ్వరరావు విన్నీ తేజ కామర్స్ అధ్యాపకులు పి రాజబాబు శాంతి బాబు ఫిజికల్ డైరెక్టర్ ఎండి అంజాద్ ఆలీ పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు శ్రీ హరి ప్రసాద్ కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు సురేష్ లైబ్రరియన్ సుందర్ మరియు ఇతర అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆనందంతో తినాలన్నదే మా లక్ష్యం



పండుగలకో, వేడుకలకో... బంధువులూ, స్నేహితులూ అంతా ఒక చోట చేరటం, ఇష్టమైనవి వండుకుని తినటం, కబుర్లు చెప్పుకోవటం, నవ్వులు, ఆటపాటలు... ఆ మధుర జ్ఞాపకాలు తలచుకుంటేనే మనసు ఆనందంతో ఉప్పొంగుతుంది కదా! మరి, ఆ ఫీల్ ఇప్పుడు ఉందా? అంటే... ఈ బిజీ జీవితాల్లో దానికి చోటెక్కడిది? అనేవారే ఎక్కువ. అందుకే, ఆ సంస్కృతిని తిరిగి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు సామాజిక కార్యకర్త. ఫిలాసఫిస్ట్ జోగు నిర్మల. 'కైండ్నెస్ కిచెన్' సరికొత్త జీవన విధానానికి శ్రీకారం చుట్టారీమె. ఆ విశేషాలు తెలుసుకుందాం..

ఆన్‌లైన్ ఆర్డర్లు, యాప్ సినిమాలు... ఇప్పుడు ఇవే ట్రెండ్. ఇక స్నేహితులూ, బంధువులను కలవాలంటే, పెద్ద ప్రణాళికే వేయాలి. జీవితాల్లో సహజత్వం లేకుండా పోయింది. అందుకే, ఒకప్పటి ఆ సంస్కృతిని తిరిగి తీసుకురావడం నా ప్రయత్నం. అందులో భాగంగానే మావారు నరేష్‌తో కలిసి 'కైండ్ నెస్ కిచెన్' ప్రారంభించారు. ఆప్యాయత, ఆనందం, ప్రేమను ఇతరులకూ పంచాలి. అందుకు ఆహారం కంటే మంచి మాధ్యమం ఏముంటుంది? పైగా, మన భావోద్వేగాలూ వంటపై ప్రభావం చూపిస్తాయి. ఎలాంటి భావోద్వేగాలతో వండుతామో అవే ఆహారంలోకి వస్తాయి. కాబట్టి, మంచి ఫీలింగ్‌తో అందరూ కలిసి తినాలన్నదే మా లక్ష్యం.

**మట్టి ఇల్లు కట్టుకున్నాం..** మాది తెలంగాణలోని నిజామాబాద్. తాతయ్య ముంబయిలో స్థిరపడ్డారు. నేనూ అక్కడే పుట్టి పెరిగా. ఫిలాసఫీలో మాస్టర్స్ చేశా. 20ఏళ్లుగా అనేక సామాజిక సమస్యల పరిష్కారాల దిశగా పని చేస్తున్నాను. ఎన్జీవోలతో కలిసి సహజ ప్రసవం, తల్లిపాల దానం, మెన్స్ట్రువల్ హైజీన్, వాతావరణ మార్పులు, మానవ విలువలు... వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నా. నా భర్త నరేష్ కూడా తెలంగాణనే. అయితే, పాప పుట్టుక మా ఆలోచనల్ని మార్చేసింది. బిజీ జీవితాలు అర్థం లేదనిపించింది. రెండేళ్ల విరామం తీసుకుని వివిధ ప్రదేశాలకు వెళ్లాం. ముంబయి వదిలి, తమిళనాడులోని ఆరోవిల్లెలో ఓ మట్టి ఇల్లు నిర్మించుకుని ఉంటున్నాం. ఇది ఓ ఇంటర్నేషనల్ కమ్యూనిటీ. అక్కడికి వెళ్లాక జీవితాన్ని కొత్త కోణంలో చూడటం ప్రారంభించండి. ఒకప్పటి సామాజిక విధానాలను అలానే పాటించడం కాదు, అందులోని లోటుపాట్లు అర్థం చేసుకోని ముందుకెళ్లాలి అని గ్రహించాలి. అందుకే, మా పాప, బాబు ఇద్దరినీ ఇంట్లోనే(హోమ్ స్కూలింగ్) చదివిస్తున్నా. ఇదేకాదు... మొదట్లో మా కమ్యూనిటీలో వారానికో, రెండు వారాల కోసారో అందరం కలిసి వండుకుని తినేవాళ్లం. దీన్ని చూసి తెలిసిన వాళ్లు ఇలాంటివి మా దగ్గర ఏర్పాటు చేయొచ్చు కదా... అని అడిగేవారు. అందుకు అంగీ కరించాం.క్రమంగా, మహిళా గ్రూపులూ, సొసైటీలూ ఆహ్వానించటం మొదలు పెట్టాయి. ప్రస్తుతం వరంగల్, బెంగళూరు, హైదరాబాద్, ముంబయి... ఇలా అన్ని ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమాలు చేస్తున్నాం. కైండ్నెస్ కిచెన్ కార్యక్రమాలన్నీ జీరో వేస్ట్ కాన్సెప్ట్ చేసేవే ఒకరికొకరు సహకరించుకుంటూ వంట చేసుకోవ టం, అరటాకుల్లో వడ్డించుకుని కింద కూర్చొనే తినటం తప్పక పాటిస్తాం. ప్రోగ్రామ్‌లో పాల్గొనే సభ్యుల సంఖ్య 25-30 కంటే ఎక్కువ కాకుండా చూస ుకుంటాం. అందులోనూ, వీగన్ ఆహారానికే మా ప్రాధాన్యత, పది హేను రోజులకోసారి ఈ కార్యక్రమాలు జరుగుతాయి. ఆటపాటలు, నైపుణ్యాలను పంచు కోవటం... వంటి అనేక యాక్టివిటీలూ జరుపు కుంటాం. ఈ పుడమి అందరిదీ. ఇక్కడున్న వనరులను తరవాతి తరాలకు అలానే అందించాల్సిన బాధ్యత మనదే అందుకు తగ్గ జీవనశైలిని ఎంచుకోవటం మన చేతిలోనే ఉంది. □



# ఆడబిడ్డలకు ఆ నలుగురు ఆదర్శం



**వనజాక్షి, వీణ, గౌరమ్మ, వాణి, శిరీష**

ఇంట్లో ఒకరిద్దరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడమే కష్టం. అలాంటిది ఒకే ఇంటి నుంచి నలుగురు అక్కాచెల్లెళ్లు ఉద్యోగాలు సాధించి ప్రత్యేకతను చాటుకున్నారు! సాధారణంగా ఆడపిల్లలు పుట్టగానే చదువుకంటే ముందుగా... పెళ్లికి ప్రణాళికలు వేసుకునే తల్లిదండ్రులు ఉన్నారు. కానీ చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం వేపమాకులపల్లెకు చెందిన సీతప్పగారి మునివెంకటప్ప, గౌరమ్మ అందుకు భిన్నం. వీళ్లు పిల్లల చదువుల గురించి ఆలోచించండి. వీరిది సాధారణ రైతు కుటుంబం. వీరికి నలుగురు కుమార్తెలు. వీణాకుమారి, వాణి, వనజాక్షి , శిరీష ఆరుగాలం కష్టపడినా... పెట్టుబడులైనా దక్కని వ్యవసాయం! అయినా రాజీ పడకుండా పిల్లల్ని ఉన్నతంగా తీర్చిదిద్దారా తల్లిదండ్రులు. 2007లో మునివెంకటప్ప అనారోగ్యంతో మృతిచెందారు. అప్పటికి పిల్లలు ఇంకా చిన్నవాళ్లే. చదువులూ పూర్తికాలేదు. ఆ తల్లిది దిక్కుతోచని పరిస్థితి. ఆ సమయంలో పిల్లలు తల్లి కష్టాన్ని గుర్తించి వీలు దొరికినప్పుడల్లా ఇంటి పని, వ్యవసాయంలో సాయం చేసేవారు. ఇలా నలుగురు కుమార్తెలూ డిగ్రీ పూర్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధనే లక్ష్యంగా నిరంతరం శ్రమించి పోటీలకు హాజరయ్యేవారు. ఎన్ని కష్టాలు వచ్చినా ఇంటిల్లిపాది ఓర్చుకుని బ్యాంకు, పోలీస్, టీచరు... ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేవారు. వారి కష్టానికి ఫలితంగా పెద్ద కుమార్తె వీణాకుమారి 2014లో కానిస్టేబుల్‌గా, 2016 డీఎస్సీలో వాణి ఎస్జీటీగా ఉద్యోగాలు సాధించారు. రెండేళ్ల వ్యవధిలో ఇద్దరు కుమార్తెలకు ప్రభుత్వ ఉద్యోగాలు రావడంతో ఆ తల్లి మనసు కొంత కుదుటపడింది. కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అమ్మాయిని కానిస్టేబుల్, టీచరుగా చేస్తున్న అమ్మాయిని టీచరే వివాహం చేసుకోవడం మరింత సంతోషాన్ని ఇచ్చింది. మిగిలిన ఇద్దరు అమ్మాయిలూ ఉద్యోగాలు సాధిస్తే బాగుంటుందని అల్లుళ్లు ప్రోత్సహించారు. గత నెలలో విడుదలైన పోలీస్ ఉద్యోగాల ఫలితాల్లో వనజాక్షి కానిస్టేబుల్‌గా, తాజా డిఎస్సీ ఫలితాల్లో శిరీష సెకండరీ గ్రేడ్ టీచరుగా ఎంపికయ్యారు. తల్లి కష్టాన్నీ, నమ్మకాన్నీ వమ్ము చేయకుండా ఆశయాన్ని సాధించిన కుమార్తెలూ.. కూతుళ్లను ఉద్యోగులుగా చూడాలని పట్టుబట్టి చదివించిన తల్లీ.. వీరి కథ అందరికీ స్ఫూర్తిదాయకమే కదా! □

# పరికిణీకి పూల ఓణీ..



అప్పుడే కాలేజీలో అడుగుపెట్టిన అమ్మాయైనా.. ఇద్దరు పిల్లల తల్లయినా.. మనవళ్లు, మనవరాళ్లని చూసుకుని మురిసిపోయే బామ్మయినా.. మనసు పారేసుకునే దుస్తులేవంటే లంగాఓణీ పేరు చెప్పాల్సిందే! దాని అందమే వేరు. అందుకే తరాలెన్ని మారినా ఫ్యాషన్ ప్రపంచంలో రారాణిలా వెలుగుతోందీ వస్త్ర శ్రేణి. అమ్మాయిలే లక్ష్మీదేవిలా నట్టింట తిరిగితే చక్కని అనందం. చట్టుకున్న కట్టేసుకోవాలన్నా.. బుట్టబొమ్మలా కనిపించాలన్నా లంగాఓణీ కాకుండా మరొకటి ఉంటుందా? అలాగని ఎప్పుడూ పట్టేనా? మరీ మెడన్‌గా కనిపించినా బాగోదు. కాబట్టి, కొత్తగా కోరుకునేవారు మనసు పారేసుకుంటోందీ ఈ పూల ఓణీలపైనే! పరికిణీ పట్టుదైనా, కాటన్, రేయాన్, నెట్ వంటి ఆధునిక రకానిదైనా వీటిని జతచేసి మరిసిపోతున్నారు మెత్తని సిల్క్ ఓణీ.. దానిపై ఆకర్షించే కలంకారీ, పిచ్‌వాయీ, మధుబనీ.. వంటి ఏళ్లనాటి కళలతోపాటు మోడరన్ ఆర్ట్‌నీ అద్దుకున్న పూలు.. చూడచక్కగా లేవూ? పూల సుకుమారం ఉన్న అమ్మాయిలు వాటినే చుట్టుకుని మరింత మెరవడం ఖాయమనిపించట్లేదు? సందర్భమూదైనా చక్కగా ఇమిడిపోవాలి అనుకునే అమ్మాయిలకు ఈ మినిమల్ ఫ్యాషన్ మరింత నప్పడం ఖాయం. పైగా సందర్భాన్ని బట్టి.. దీన్నే లెహెంగా స్టైల్‌లోనూ వేసుకోవచ్చు. కాబట్టే.. ఈ తరహా లంగాఓణీలకే అమ్మాయిల ఓటిప్పుడు.

మీదీ ఈ తరుహా ఆలోచనేనా? అయితే.. డిజైన్ చేయించుకోండి మరి.









# ముఖానికి మొక్కజొన్న



ఈ కాలంలో దొరికే మొక్క జొన్నతో ఆరోగ్యమే కాదు.... అందాన్నీ సొంతం చేసుకోవచ్చు. అదెలాగంటారా?

✦ నలుగు మృతకణాలు పేరుకుపోతే చర్మం మెరుపు తగ్గుతుంది. ఇలాంటప్పుడు కప్పు తాజా మొక్కజొన్న పిండిలో, చెంచా తేనె, అరచెక్క నిమ్మరసం కలిపి ఒంటికి రాయండి. కాసేపాగి నీళ్లతో తడిపి... నలుగులా రుద్దుకుంటే మురికి వదిలిపోతుంది. చర్మం నున్నగా మెరిసిపోతుంది.

✦ క్లెన్సింగ్ కప్పు పచ్చి మొక్కజొన్న గింజల్ని మెత్తగా రుబ్బుకోవాలి. దానికి కాస్త గులాబీ నీరు, చెంచా తేనె కలిపి ముఖానికి ప్యాక్ వేయండి. అరగంటయ్యాక శుభ్రం చేసుకుంటే చర్మం తాజాగా కనిపిస్తుంది..

✦ ఫేస్ ప్యాక్ తక్కువ సమయంలో ముఖం కాంతిమంతంగా మారాలంటే గుప్పెడు పచ్చి మొక్కజొన్న గింజల్ని మెత్తగా రుబ్బుకుని అందులో కాస్త పాలపొడి, చెంచా పంచదార కలపాలి. దీన్ని ముఖానికి రాసుకుని 20 నిమిషాలయ్యాక నీళ్ల చల్లి మృదువుగా రుద్దుతూ శుభ్రం చేసుకుంటే సరి. □

# కొత్తిమీర ప్రయోజనం

ఆరోగ్య భాగ్యం




డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ఇది చిన్న మృధువైన తేలికైన హెర్బల్ మొక్క. ఈ ధనియాల మొక్కలో అపారమైన ఔషధ విలువలున్నాయి. దీన్ని కొరియాండమ్ సాటివమ్, ధాన్యకా, సిలాన్‌ట్రో, చైనీస్ ఫారల్స, ధనియా పత్తా అని అంటారు. ఇది మొదట ఇటలీలో పుట్టి ప్రపంచ మంతటా సాగులో ఉండే సూపర్ ఫుడ్ అని చెప్పవచ్చు. ఇది స్పానిష్ పదం నుండి వచ్చింది. దీని అర్థం మొక్కజొన్న లాంటిది అని ఇది మంచి సువాసన కల్గి ఆహారంలో ప్రత్యేకమైన రుచికి ఉపయోగపడే సుగంధ మూలిక అని చెప్పవచ్చు. అన్ని వంటకాల్లో విరివిగా అందరూ వాడదగ్గ మొక్క. ఇది వేడిని తగ్గించి చలువ చేస్తుంది. **పోషకాలు :** 100 గ్రాముల కొత్తిమీర ఆకులు, కాడల్లో ఉండే పోషకాలు: కార్బో హైడ్రేట్స్: 5 గ్రా, ప్రోటీన్స్-3 గ్రా. పీచు: 280 గ్రా, ఐరన్-8 మి.గ్రా, కాల్షియం: 140 మి.గ్రా, ఫాస్ఫరస్- 60 మి.గ్రా, సోడియం - 46 మి.గ్రా, పొటాషియం-52 1 మి.గ్రా, విటమిన్ ఎ-67, 480 మి.గ్రా, విటమిన్ సి-27 మి.గ్రా, మినరల్స్-2.3 ల.గ్రా, మెగ్నీషియం - 26 మి.గ్రా, విటమిన్ ఇ-2.50 మి.గ్రా, నీరు : 86.3, కేలరీలు : 44 కేలరీలు.


**ప్రయోజనాలు :** కొత్తిమీరలో అధికంగా ఉండే మినరల్స్, విటమిన్స్ వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. ఇది కార్మి నేటివ్‌గా గ్యాస్ ట్రబుల్, ఎసిడిటీ, అజీర్ణం, కడుపుబ్బరం, పైత్యం, త్రేన్పులు, వికారం, వాంతుల్ని, మెలలు, విరేచనాల్ని తగ్గించడంలో పనిచేస్తుంది. అధిక ఆకలిని తగ్గించి, అధిక ఆహారాన్ని తీసుకోనీయకుండా, జీర్ణక్రియ సక్రమంగా జరిగేలా చేస్తుంది. జీర్ణాశయాన్ని శక్తివంతం చేయటమే కాకుండా దాని పని తీరును మెరుగు పరుస్తుంది. పచ్చి ఆకుల్ని నమిలిన, కొత్తిమీర రసాన్ని పుక్కిలించిన నోటిపూత, నోటి, పెదవుల పగుళ్ళు, పుండ్లు, నోటి దుర్వాసన చిగుళ్ళ వాపు, చిగుళ్ళ నుంచి రక్తం కారడాన్ని తగ్గిస్తుంది. చిగుళ్ళు, దంతాల నొప్పులు తగ్గించి, చిగుళ్ల, దంతాలు దెబ్బతినకుండా వాటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఇది రక్తంలోని గ్లూకోజ్ స్థాయిల్ని నియంత్రించే హైపోగ్లైసీమిన్‌గా పనిచేస్తుంది. ఇది బి.పి.ని తగ్గించి ఎల్‌డిఎల్ అనే చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి, అధిక బరువును తగ్గించి, ఎథిరోస్ల్కరోసిన్ రాకుండా కాపాడుతుంది. శ్వాసని తాజాగా ఉంచుతుంది. క్షయ, ఉబ్బసం, ఎలర్జీల్ని, శ్వాసనాళికల్లో కఫాన్ని తగ్గిస్తుంది. ఇది గట్‌ఫ్లోరాలో మంచి బాక్టీరియా వృద్ధికి తోడ్పడి అల్సరేటివ్ కొరైటిస్, క్రొన్స్‌డిసీజ్, ప్రేగుపూత, అవీంబియాసిన్, మలబద్ధకం వంటి వ్యాధుల్ని తగ్గించి మెటబాలిక్ ప్రక్రియకు తోడ్పడుతుంది. కొత్తిమీరలోని ఎసెన్షియల్ ఆయిల్స్ వల్ల శరీరంలో డిటాక్స్ డ్రింక్‌గా హైపర్ ప్రొటెక్టివ్‌గా లివర్‌ని రక్షిస్తుంది. లివర్ పనితీరు సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. శరీరంలో వాపుల్ని మంటల్ని తగ్గించి, మూత్రాన్ని జారీచేసి శరీరంలోని అదనపు సోడియం, ఇతర మలినాల్ని బైటికి పంపి రీనల్ హైపర్ టెన్షన్‌ని తగ్గించే డయాలిటిక్‌గా పనిచేస్తుంది కిడ్నీల్ని శుభ్రపరచి యూరిన్ ఇన్ఫెక్షన్, యూరిన్ బంధిపబడడం, కిడ్నీ స్టోన్స్‌ని తగ్గించి మూత్ర విసర్జకంగా పనిచేస్తుంది. ఇది సౌందర్య పోషణలోను ఉపయోపగడుతుంది. ఇది జుట్టు మూలాల్ని బలపర్చడం,జుట్టు రాలిపోవడం, జుట్టు చిట్లి పోవడం, చుండ్రు వంటి సమస్యల్ని తగ్గించి కేశ సౌందర్యనికి ఉపయోగపడుతుంది. పెదవుల రంగు, మెరుపుకి మంచిది, పెదవుల వాపుని తగ్గిస్తుంది. చర్మంపై వచ్చే మొటిమలు, మంగు, నల్లమచ్చులు, బ్లాక్‌హెడ్స్ పొడి లేదా జిడ్డు చర్మనికి క్లెన్సర్‌గా పనిచేసి చర్మాన్ని ఆరోగ్యంగా వుంచుతుంది. అలాగే చర్మంపై ముడతలు పగుళ్ళు రాకుండా వృద్ధాప్య చిహ్నాల్ని తగ్గించి చర్మాన్ని కాంతి వంతంగా నునుపుగా ఉంచుతుంది. దద్దుర్లు, ఎలర్జీలు, మంటలు, వాపులు, కాలిన గాయాలు, దురదలు వంటి చర్మవ్యాధుల్ని విషపురుగులు కుట్టిన చోట కొత్తిమీర రసం పూసిన విషం తగ్గిస్తుంది. హరిస్తుంది. హెపటైటిస్, కామెర్ల వ్యాధికి, కాలేయ శుద్ధికి ఉపయోగపడుతుంది, కొత్తిమీరలోని ఐరన్‌వల్ల రక్తహీనత లేకుండా రక్తశుద్ధికి రక్తకణాల ఉత్పత్తికి, బ్లడ్ ప్యూరిఫైయర్‌గా, బ్లడ్ బిల్డర్‌గా పనిచేస్తుంది. కొత్తిమీరలోని డుడిసినాల్ సమ్మేళం వల్ల ఆహారాన్ని విషతుల్యం చేసే ఫుడ్ పాయిజనింగ్‌లో సాల్మొనెల్లా బాక్టీరియాని నిర్వీర్యపరుస్తుంది. ఇది అంతర్గత అవయవాల్లో నొప్పిని తగ్గించే ఆంటీస్పాస్ మొడిక్‌గా పనిచేస్తుంది. విటమిన్ 'ఎ' వల్ల కళ్ళ మంటలు, కళ్ళవాపులు, కండ్ల కలక, కనురెప్పలు మ్యూకస్‌తో అంటుకొనిపోవడం, కళ్ళ దురదలు, కంటి నరాలపై ఒత్తిడి తగ్గించి, కంటి బల హీనతను, రేచీకటిని తగ్గించి ఆరోగ్యకరమైన కంటి ఆరోగ్యాన్ని కల్గిస్తుంది. □

# టెక్ నెక్ బాధిస్తోంది ?




మెడ పట్టేసిందా... పక్కకి తిప్పలేకపోతున్నారా.. భుజాల్లోనూ వీపు పై భాగంలోనూ నొప్పిగా ఉందా? అయితే మీరు 'టెక్ నెక్' బారినపడ్డారన్నమాటే అదేపనిగా తల కిందకి వంచి ఫోన్‌లోకి చూడటం, టెక్స్ట్ చేయడం లేదా ల్యాప్టాప్‌లో పనిచేయడం వల్ల వస్తుందా? దీన్నే 'టెక్స్ట్ నెక్' అని అంటారు. ఆయా భాగాల్లోని కండరాలు సంకోచించడం, నరాలమీద పడే ఒత్తిడి వల్ల మెదడు ఎటూ కదపలేం సరికదా నొప్పి వస్తుంది దీర్ఘకాలం పాటు పట్టించుకోకుండా వదిలేస్తే తలని పక్కకి తిప్పలేక పోవడమే కాదు, వయసు పెరిగేకొద్దీ వెన్ను సమస్యలూ, చేతుల వరకూ తిమ్మిర్లూ వస్తాయి. ఆడామగాకీ ఇద్దరికీ ఈ సమస్య కనిపిస్తుంది ఆడవాళ్లలోనే ఇది ఎక్కువ. మగవాళ్లతో కనిపిస్తున్న ఆడవాళ్లలో మెడ కండరాలు చిన్నగా ఉండటంతోపాటు బెడ్ మీద కూర్చొని పనిచేయడం వల్ల ఇవి ఒత్తిడికి గురవు తున్నాయి. నెలసరి లేదా మెనోపాజ్‌లో హార్మోన్ల హెచ్చు తగ్గులూ ఈ సమస్యకు మరో కారణం. ఎలా తగ్గించుకోవాలి? తలలనుకీ పైకీ కాకుండా భుజాలకు అనుగుణంగా ఉంచి నిటారుగా కూర్చోవాలి. స్క్రీన్‌కి మీ కళ్లకే మధ్య 2030 మధ్య దూరం ఉండాలి. మధ్య మధ్యలో స్క్రీన్ నుంచి విరామం తీసుకుని మెడనీ భుజాలనీ కదిలించాలి. కంప్యూటర్ మానిటర్ లేదా ఫోన్ స్క్రీన్‌ని కంటికి ఎదురుగా ఉండేలా చూసుకోవాలి. సీటులో కూర్చున్నప్పుడు మోకాళ్లను తుంటికి సమాంతరంగా ఉంచి, పాదాలను నేలకు ఆనిం చాలి. మధ్యమధ్యలో లేచి మెడనీ, భుజాలనీ కదిలిస్తూ చిన్న చిన్న వ్యాయామాలు చేయడం ద్వారా కండరాలలో ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. అప్పటికీ తగ్గకపోతే వైద్యులను సంప్రదించాల్సిందే.. □

# పూజలో పుస్తకాలు ఎందుకు?



**వినాయక** శబ్దం లోని 'వి' అనేది విశ్వం, విశిష్టత, విశాలతలకు ప్రతీక. వినాయకుడు నాయకులలో విశిష్టుడు, విశ్వ పూజనీయుడు, 'శుక్లాంబరధరం విష్ణుం' అంటూ గణేశుని విష్ణువుగా భావించి పూజిస్తాం. విష్ణుమూర్తి వలె గణేశుడు వ్యాపన శక్తి కలిగినవాడు. ప్రసన్నత ప్రతిఫలించే గజముఖుణ్ణి 'ప్రసన్న వదన ధ్యాయేత్' అంటూ అర్చిస్తాం. వ్యాసుడు మహాభారతాన్ని వినాయకుడి చేత రాయించదలచుకున్నాడు. అలా చెప్పినప్పుడు 'ఆపకుండా చెబితే రాస్తాను' అంటూ గణేశుడు షరతు పెట్టాడు. బదులుగా వ్యాసమహర్షి అర్థం చేసుకుని రాయాలింటూ ప్రతి షరతు విధించాడు. ఏదైనా వేగంగా సాగాలి అన్నది గణపతి సందేశం. ఏ విషయాన్నైనా అర్థం చేసుకున్న తర్వాతే లిఖించాలి అన్నది మహర్షి ప్రబోధ వినాయకుడు లిఖించిన భారతం పంచమ వేదమైంది. తొలి లేఖకుడైన గణపతి పూజలో పుస్తకాలు,కలము ఉంచడం సంప్రదాయమైంది. □



ఆధ్యాత్మికం

# సంతాన సమస్యలకు ధనురాసనం!

హార్మోనుల్లో అసమతుల్యత, నెలసరి సమస్యలు.. అమ్మతనాన్ని అడ్డుకునే కారణాలెన్నో! ధనురాసనం ప్రయత్నించండి.. ఈ సమస్యలను దూరం చేస్తుంది. ధనుస్సు అంటే విల్లు.. ఈ ఆసనంలో శరీరం విల్లులా కనపిస్తుంది. కాబట్టే, ధనురాసనమని పేరు. దీన్ని వేయడానికి ముందు బోర్లా పడుకోవాలి. నెమనమదిగా మెకాళ్లను మడిచి, రెండు చేతులతో కాళ్ల చీలమండ లను పట్టుకోవాలి. నెమ్మదిగా శ్వాస తీసుకుంటూ ఛాతీని నేల నుంచి పైకి లేపాలి. ఇదే క్రమంలో కాళ్లనూ తొడభాగం వరకు పైకి లేపాలి. శరీరం మొత్తం పొట్టపైనే ఆధారపడి ఉంటుంది. శరీరాన్ని బిగదీసినట్లుగా కాకుండా వీలైనంత ప్రశాంతంగా ఉంచాలి. దీర్ఘశ్వాస తీసుకుని వదులుతూ 15 సెకన్లపాటు ఉండి, నెమ్మదిగా ఛాతీనీ, కాళ్లను కిందకి దింపాలి. ఆపై శవాసనంలో విశ్రాంతి తీసుకోవాలి. ఈ ఆసనం వెన్నెముకను దృఢపరుస్తుంది. హార్మోన్ల అసమతుల్యతను తగ్గించి, నెలసరిని క్రమం చేస్తుంది. ప్రత్యుత్పత్తి అవయవాలు, మూత్రపిండాలకూ మేలు చేస్తుంది. దీంతోపాటు శరీరానికి తగినంతగా ప్రొటీన్, ఐరన్ అందేలా చేసుకోండి. జంక్‌ఫుడ్‌కి దూరంగా ఉంటూ బీట్‌రూట్, నట్స్, బెల్లం, అవిసెలు వంటివాటికి ప్రాధాన్యం ఇవ్వండి. □



# మాంచెస్టర్ ఒరిజినల్స్ అద్భుత విజయం

## ది హండ్రెడ్ మెన్స్ లీగ్‌లో సూపర్‌చార్జర్స్ ఓటమి



**న్యూఢిల్లీ:** ది హండ్రెడ్ మెన్స్ లీగ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ గ్రూప్‌కు చెందిన నార్తర్న్ సూపర్ చార్జర్స్‌కు షాక్ తగిలింది. ఇంగ్లాండ్‌లో జరుగుతున్న ది హండ్రెడ్ లీగ్‌లో సూపర్ జెయింట్స్ గ్రూప్‌కు చెందిన మాంచెస్టర్ ఒరిజినల్స్ జట్టు అద్భుతమైన విజయం సాధించింది. ఈ సీజన్‌లో 8 మ్యాచ్‌లు ఆడిన ఆ జట్టుకు ఇది మూడవ విజయం మాత్రమే. 30వ లీగ్ మ్యాచ్‌లో సూపర్ చార్జర్స్‌పై మాంచెస్టర్ 6 బంతులు మిగిలి ఉండగానే 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీనికి కారణం వికెట్ కీపర్‌బ్యాట్స్‌మెన్ జోస్ బట్లర్, న్యూజిలాండ్ బ్యాట్స్‌మన్ రచిన్ రవీంద్రల అద్భుతమైన పార్ట్‌నర్‌షిప్. వీరిద్దరూ కేవలం 48 బంతుల్లోనే మ్యాచ్‌ను తిప్పేశారు. 140 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన మాంచెస్టర్‌కు శుభారంభం దక్కలేదు. కేవలం 31 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ సమయంలో జోస్ బట్లర్, రచిన్‌రవీంద్రలుకలిసి మూడో వికెట్‌కు 48 బంతుల్లో 99 పరుగుల మెరుపు భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ మ్యాచ్‌లో బట్లర్ కేవలం 37 బంతుల్లో 5 సిక్సర్లు, 7 ఫోర్లతో 70 పరుగులు చేసి జట్టు విజయాన్ని సులభం చేశాడు. రచిన్ రవీంద్ర 23 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 47 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కెప్టెన్ ఫిల్ సాల్ట్ కేవలం 9 పరుగులు మాత్రమే చేయగలిగాడు. చివరికి మాంచెస్టర్ 16 బంతులు మిగిలి ఉండగానే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. సూపర్‌చార్జర్స్ బౌలర్లలో జాకబ్ డఫీ, రషీద్ ఖాన్, టామ్ లాడ్జ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఇక బ్యాటింగ్ చేసిన నార్తర్న్ సూపర్‌చార్జర్స్ కూడా ఆరంభంలో తడబడింది.

73 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ సమ యంలో డేవిడ్ మిల్లర్ (30), సమిత్ పటేల్ (42) ఆరో వికెట్‌కు 27 బంతుల్లో 59పరుగులు జోడించి జట్టు స్కోరును గౌరవప్రదమైన స్థితికి చేర్చారు. కెప్టెన్ హ్యారీ బ్రూక్ 20పరుగులు మాత్రమే చేయ గలిగాడు. చివరికి సూపర్‌చార్జర్స్ నిర్ణీత 100 బంతుల్లో 8 వికెట్లకు 139 పరుగులు చేసింది. మాంచెస్టర్ బౌలర్లలో టామ్ ఆస్పిన్‌వాల్ 3 వికెట్లు పడగొట్టగా, జేమ్స్ ఆండర్సన్, జోష్ టంగ్యూ చెరో 2 వికెట్లు తీసుకున్నారు. ఈమ్యాచ్‌లో ఓడిపోయి నప్పటికీ సూపర్‌చార్జర్స్ 8 మ్యాచ్‌లలో 5 గెలిచి పాయింట్ల పట్టికలో మూడో స్థానంలోఉంది. మాంచెస్టర్ ఒరిజినల్స్ ఈ విజయంతో ఆరో స్థానానికి చేరుకుంది.



# ఆసియా కప్ హాకీలో.. భారత్ గెలుపు

## 4-3 తేడాతో చైనా ఓటమి

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ హాకీలో భారత్ చైనాపై 4-3 తేడాతో విజయం సాధించింది. మూడు పాయింట్లతో తమ ప్రచారాన్ని ప్రారంభించిన భారత పురుషుల హాకీ జట్టు శుక్రవారం చైనాపై హ్యాట్రిక్ సాధించింది. భారత జట్టు తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (20 నిముషం, 33 నిముషం, 47 నిముషం) అద్భుతమైన ప్రదర్శన చేసి హ్యాట్రిక్ సాధించాడు. జుగ్‌రాజ్ సింగ్ (18) స్కోరు షీట్‌లోకి ఎక్కిన మరో భారత ఆటగాడు కాగా, చైనా జట్టుకు షిహావో డు (12), బెన్‌హాయ్ చెన్ (35), మరియు జీషెంగ్ గావో (41) గోల్స్ చేశారు. చివరికి చైనా పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకున్నారు. తరువాత షిహావో డు (12) ద్వారా గోల్‌ను గోల్‌గా మార్చడంతో గోల్ సాధించారు. భారత్ మొదటి క్వార్టర్‌ను ఆధిక్యంలో ముగించింది. అయితే, చైనా 1-0తో ఆధిక్యంలోఉంది. రెండవ క్వార్టర్‌ను భారత్ దూకుడుగా ప్రారంభించి చైనాపై ఒత్తిడి పెంచడంలో రాణించింది. మూడు 9నిమిషాల వ్యవధిలో, భారతదేశం పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. మరియు జుగ్‌రాజ్ సింగ్ (18) దానిని గోల్‌గా చేసి స్కోరును 1-1తో సమం చేశాడు. కొద్దిసేపటికే, భారత్‌కు మరో పెనాల్టీ కార్నర్ లభించింది, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (20) గోల్ చేసి స్కోరును 2-1తో సమం చేశాడు. హాఫ్ టైం బ్రేక్ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (33) క్వార్టర్‌లోని మొదటి పెనాల్టీ కార్నర్‌ద్వారా 3-1తో స్కోరును సాధించాడు. చైనా స్పందించింది మూడవ పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. మరియు బెన్‌హై చెన్(35) గోల్‌గా మార్చుకుని 3-2తో స్కోరును సాధించింది. ఆట ముగియడానికి 20 నిమిషాలు మిగిలిఉండగా, చైనా రెండు పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకుంది. క్వార్టర్ ముగిసేసమయానికి, 2 జట్లు 3-3తో సమంగా ఉన్నాయి. అయితే హర్మన్‌ప్రీత్ సింగ్ (47) ధైర్యంగా తన హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు, ఆతిథ్య జట్టుకు 4-3 ఆధిక్యాన్ని అందించాడు.

# ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో.. ముగిసిన ధ్రువ్-తనీషా ప్రచారం



**న్యూఢిల్లీ:** ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో ధ్రువ్-తనీషా ప్రచారం క్వార్టర్ ఫైనల్స్‌లో ముగిసింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో శుక్రవారం ఇక్కడ మలేషియా ద్వయం చెన్ టాంగ్ జీ-తో ఈ వీ చేతిలో వరుస గేమ్‌లలో ఓడిపో యింది. ధ్రువ్-తనీషా మలేషి యన్లతో జరిగిన మ్యాచ్‌లో 15-21, 13-21 తేడాతో పరాజయం చెందారు. తొలి రౌండ్‌లో బై పొందిన 16వ సీడ్ భారత ద్వయం, ఐరిష్ ద్వయం జాషువా మాగీ- మోయా ర్యాన్‌పై విజయంతో తమ బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత వారు ఐదవ సీడ్ టాంగ్ చున్ మాన్ మరియు చైనాలోని హాంకాంగ్‌కు చెందిన త్సే యింగ్ సూట్‌పై ఓటమి పాలయ్యారు. ప్రారంభ గేమ్‌లో ఓడిపోయిన తర్వాత వెనుకబడిన భారత జోడీ 19-21, 21-12, 21-15 తేడాతో టైను ముగించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది.

కానీ మలేషియన్లను ఓడించిన తర్వాత చివరి 16 దశలో తమ ప్రచారం ముగించింది. మరోవైపు, పురుషుల డబుల్స్‌లో సాత్విక్‌చిరాగ్ జంట మలేషియా రెండో సీడ్ ఆరోన్ చియా సోహ్ వూయియిక్‌తో తలపడనుంది. అంతకు ముందు జరిగిన మ్యాచ్‌లో భారత పురుషుల జంట ఆరో సీడ్ వాంగ్ చాంగ్/లియాంగ్ వీ కెంగ్‌పై 19-21, 21-15, 21-17 తేడాతో విజయం సాధించి, చైనాతో వరుసగా నాలుగు పరాజయాలను ఎదుర్కొని క్వార్టర్ ఫైనల్స్‌లో చోటు దక్కించుకుంది.

## షూటింగ్ ఛాంపియన్‌షిప్

# అంకుర్‌కు స్వర్ణం



**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ డబుల్ ట్రాప్‌లో కొత్త కాంటినెంటల్ రికార్డుతో అంకుర్ మిట్టల్ స్వర్ణం సాధించాడు. శుక్రవారం కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో జరిగిన ఈ ఈవెంట్‌లో మాజీ ప్రపంచ నంబర్ 1, 2018 చాంగ్‌వాన్ ప్రపంచ ఛాంపియన్ అంకుర్ మిట్టల్ కొత్త ఆసియా ఛాంపియన్‌షిప్ రికార్డును సృష్టించాడు. ఈ స్వర్ణంతో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో 52 స్వర్ణాలు, 26 రజతాలు, 25 కాంస్య పతకాలతో భారత్ మొత్తం 103కి చేరింది. డబుల్ ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో భాను ప్రతాప్ సింగ్ మరియు హర్షవర్ధన్ కవియాతో కలిసి అంకుర్ మిట్టల్ జట్టు కాంస్యం గెలుచుకున్నాడు. అంకుర్ 107 హిట్‌లతో నాలుగు రౌండ్లలో 30 చొప్పున ఆధిక్యంలో నిలిచి 26, 28, 26, మరియు 27 స్కోర్‌లతో బంగారు పతకాన్ని సాధించాడు. కజకిస్తాన్‌కు చెందిన స్థానిక షూటర్ ఆర్టియోమ్ చికులాయేవ్ 98 పాయింట్లతో రజతం గెలుచుకోగా, కువైట్‌కు చెందిన అహ్మద్ అలఫాసి షూట్ ఆఫ్‌లో 96 మరియు +2 పాయింట్లతో కాంస్యం సాధించాడు. డబుల్ ట్రాప్ జూనియర్ విభాగంలో, హాతీమ్ ఖాన్ మొహమ్మద్ 89 హిట్స్‌తో రజతం గెలుచుకోగా, మానవ్‌రాజ్‌సిన్హ్ చుడాసమా 87 హిట్స్‌తో కాంస్యం సాధించాడు. వారిద్దరూ వినయ్ ప్రతాప్ సింగ్ చంద్రవత్ (81)తో కలిసి ఈ ఈవెంట్‌లో టీమ్ స్వర్ణం గెలుచుకున్నారు. డబుల్ ట్రాప్ మహిళల విభాగంలో అనుష్క సింగ్ భాటి (93), రాజ్‌కువర్ ప్రణిల్ ఇంగ్లే (89), మరియు యేషాయ హఫీజ్ కాంట్రాక్టర్ (87) వరుసగా స్వర్ణం, రజతం మరియు కాంస్య పతకాలను గెలుచుకున్నారు. ఈ ఈవెంట్‌లో ఈ ముగ్గురూ టీమ్ స్వర్ణం కూడా గెలుచుకున్నారు.

## ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో

# సింధు పరాజయం



**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2025లో వార్దానీ చేతిలో పివి సింధు పరాజయం పాలైంది. దీంతో భారత పతక ఆశలు సాత్విక్‌చిరాగ్‌పై ఆధారపడి ఉన్నాయి. శుక్రవారం ఇండోనేషియా 9వ సీడ్ పుత్రి కుసుమ వార్దానీ చేతిలో క్వార్టర్ ఫైనల్ ఓటమితో చారిత్రాత్మక ఆరో బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాన్ని సాధించాలనే సింధు ఆశలు ముగిశాయి. రౌండ్ ఆఫ్ 16 పోరులో ప్రపంచ నంబర్ 2, చైనాకు చెందిన వాంగ్ ఝీ యినిపై ఆధిపత్యం సాధించిన సింధు ఒక గంటా నాలుగు నిమిషాల పాటు జరిగిన హోరాహోరీ పోరులో వర్దానీ చేతిలో 14-21, 21-13, 16-21 తేడాతో ఓడిపోయింది. ఆట మధ్యలో ఆట విరామ సమయానికి 117 ఆధిక్యంలోకి వెళ్లేందుకు స్కోరు 6-6తో సమమైన తర్వాత వార్దానీ విరమించుకోవడంతో సింధు ఆటను ప్రారంభించినా 21-14తో వెనుకబడింది. అయితే, రెండవ గేమ్‌లో 4-3తో ఆధిక్యంలో ఉన్న తర్వాత, సింధు వరుసగా ఆరు పాయింట్లు సాధించి నియంత్రణ సాధించింది. వార్దానీ మూడు పాయింట్లు వెనక్కి తీసుకోగలిగినా కానీ సింధు తన ఆధిపత్యాన్ని కొనసాగించి విరామంవరకు 11-6 ఆధిక్యంతో కొనసాగింది. నిర్ణయాత్మక గేమ్‌లో వార్దానీ ముందంజలో నిలిచినా 17-16 వద్ద, ఇండోనేషియా క్రీడాకారిణి నాలుగు వరుస పాయింట్లు సాధించి సెమీఫైనల్లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది.



# స్టాక్ సూచీలపై అమ్మకాల ఒత్తిడి

## నష్టాల్లోనే ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి,ఆ గస్టు 29:** దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టాలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు, ట్యారిఫ్ కలవరం సూచీల సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీసింది. శుక్రవారం ట్రేడింగ్‌లోకూడా మార్కెట్లు ఊగిసలాడుతూ చివరకు నష్టాలతోనే ముగిసాయి. సెన్సెక్స్ 80 వేల మార్కును నష్టపోయింది. నిఫ్టీ 24,500 దిగువకు పడిపోయింది. సెన్సెక్స్ 80,010 వద్ద లాభాలతో ప్రారంభం అయి ఒకదశలో 80,300కి కూడా వెళ్లింది. అయితే ఆజోరుకొనసాగలేదు.

దిగ్గజ రంగాల షేర్లలో అమ్మకాల సూచీలు ఒత్తిడిపెరిగింది. దీనితో 79,741.76 పాయింట్ల వద్ద సెన్సెక్స్ ట్రేడింగ్ నిలిపివేసింది. 270.92 పాయింట్లనష్టంతో 79,809.65 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 74.005 పాయింట్లు తగ్గి 24,426.85వద్ద స్థిరపడింది. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, ఐటిసి, భెల్, ట్రెంట్ ఏసియన్ పెయింట్స్ షేర్లు రాణించాయి. మహీంద్ర అండ్ మహీంద్ర ఇన్ఫో సిస్, అపోలో హాస్పిటల్స్, ఆదాని ఎంటర్‌ప్రైజెస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఇక భారత్ రూపాయి సుంకాల భారంతో భారీగా పతనం అయింది. 88 మార్క్‌దాటి మరీక్షీణించింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 61 పైసలు క్షీణించి 88.19 వద్ద ముగిసింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ రూపాయి విలువలు 3శాతం పడిపోయాయి.

## ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్‌గా ఉర్జిత్‌పటేల్!



**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** ప్రముఖ ఆర్థికవేత్త, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మాజీ గవర్నర్ డాక్టర్ ఉర్జిత్ పటేల్ అంతర్జాతీయ స్థాయిలో మరో కీలక పదవికి నామినేట్ అయ్యారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లో భారత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఆయన నియమితులయ్యారు. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాల్లో భారత్ వాణిని మరింత బలంగా వినిపించేందుకు ఇది దోహదపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.

ఈ నియామకానికి క్యాబినెట్ నియామకాల కమిటీ (ఎసిసి) ఆమోదం తెలిపినట్లు సిబ్బంది, శిక్షణ విభాగం (డిఒపిటీ) అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఉర్జిత్ పటేల్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఉర్జిత్ పటేల్‌కు ఐఎంఎఫ్‌తో పనిచేసిన అనుభవం ఉంది. 1992లో ఆయన న్యూఢిల్లీలో ఐఎంఎఫ్ డిప్యూటీ రెసిడెంట్ రిప్రజెంటేటివ్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఆర్‌బీఐలో డిప్యూటీ గవర్నర్‌గా సేవలు అందించి, 2016లో 24వ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన హయాంలో ద్రవ్య విధానం, ఆర్థిక పరిశోధన, గణాంకాలు, సమాచార నిర్వహణ వంటి కీలక విభాగాలను పర్యవేక్షించారు.

భారతదేశంలో ద్రవ్యోల్బణాన్ని లక్ష్యంగా చేసుకునే విధాన రూపకల్పనలో ఉర్జిత్ పటేల్ కీలక పాత్ర పోషించారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు కన్సల్టెంట్‌గా కూడా పనిచేశారు. ప్రభుత్వ పదవులతో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐడీఎఫ్‌సీ, ఎంసీఎక్స్ వంటి ప్రైవేట్ సంస్థల్లోనూ ఉన్నత హోదాల్లో పనిచేశారు. ప్రతిష్ఠాత్మక యేల్ యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి ఎంఫిల్ పట్టా పొందారు.

## ఆల్‌టైమ్ కనిష్టానికి భారత్ రూపాయి!

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** భారతదేశ ఆర్థిక వృద్ధి, కార్పొరేట్ ఆదాయాలపై 50 శాతం అమెరికా సుంకాల ప్రభావంపై ఉద్రిక్తత మధ్య భారత రూపాయి యూఎస్ డాలర్‌తో పోలిస్తే 87.97కి పడిపోయింది. ఇది ఆల్‌టైమ్ కనిష్టం. ఈ వారం నుండి అమలు చేయనున్న కొత్త సుంకాల కారణంగా భారత కరెన్సీ ఒత్తిడిలో ఉంది. అయితే ఫిబ్రవరిలో గత స్థాయికంటేఆల్‌టైమ్ కనిష్ట స్థాయి 87.9563 ను అధిగమించి, డాలర్‌తో పోలిస్తే కరెన్సీ 0.4 శాతం తగ్గి 87.9763 కు చేరుకుంది. ఈ సంవత్సరం స్థానిక ఈక్విటీల నుండి నిరంతరం విదేశీ ఉపసంహరణల కారణంగా రూపాయి ఆసియాలో అత్యంత చెత్త పనితీరు కనబరిచిన కరెన్సీగా నిలిచింది. వస్త్రాలు, పాదరక్షలు, ఆభరణాలు వంటి ఎగుమతి ఆధారిత పరిశ్రమలను లక్ష్యంగా చేసుకుని యూఎస్ సుంకాలను ప్రధానంగా పెంచారు. అయితే అమెరికా సుంకాలను తట్టుకొని నిలబడుతూ తమ రైతుల, వ్యాపారాలను రక్షించుకుంటామని ఇప్పటికే ప్రధాని మోడీ ప్రకటించారు. కాగా, రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తుండటంతోనే భారత్‌పై భారీ సుంకాలు విధించినట్లు అమెరికా చెబుతోంది. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేయడం ఆపితేనే సుంకాలు తొలగిస్తామని ఇప్పటికే ట్రంప్ భారత్‌ను హెచ్చరించారు. ట్రంప్ వార్నింగ్‌ను ఏ మాత్రం లెక్కచేయని ప్రధాని మోదీ, రష్యాతో వాణిజ్యం కొనసాగుతుందని ప్రకటించారు. మరి ఈ క్రమంలో రుపాయి విలువ రికార్డు స్థాయికి పడిపోయింది.

# సెప్టెంబరులో బ్యాంకు సెలవులు ఇవే!

**ముంబయి, ఆగస్టు 29:** బ్యాంకు పనుల కోసం తరచూ బ్రాంచీలకు వెళ్లేవారికి ఇది ముఖ్య గమనిక. సెప్టెంబర్ నెలలో దేశవ్యాప్తంగా బ్యాంకులకు భారీగా సెలవులు రానున్నాయి. పండుగలు, వారాంతాలతో కలిపి మొత్తం 14 రోజుల పాటు వివిధ రాష్ట్రాల్లో బ్యాంకులు మూసి ఉండనున్నాయి. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విడుదల చేసిన సెలవుల క్యాలెండర్‌లో వెల్లడించింది. అయితే, ఈ సెలవులన్నీ అన్ని రాష్ట్రాలకు వర్తించవు. సెప్టెంబర్ నెలలో పండుగలు, ఇతర ప్రత్యేక రోజుల కారణంగా మొత్తం 9 రోజులను ఆర్బీఐ సెలవులుగా ప్రకటించింది. వీటికి అదనంగా ఐదు వారాంతపు సెలవులు (ఆదివారాలు, రెండు, నాలుగో శనివారాలు) ఉన్నాయి. దీంతో మొత్తం సెలవుల సంఖ్య 14కు చేరింది. ఈ సెలవులు రాష్ట్రాలను బట్టి మారుతూ ఉంటాయి. కేరళలో ఓనం పండుగకు ఇచ్చే సెలవు ఇతర రాష్ట్రాల్లో ఉండదు. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సెప్టెంబర్ 5న (శుక్రవారం) మిలాద్‌ఉన్‌నబీ సందర్భంగా బ్యాంకులకు సెలవు ప్రకటించారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో కర్మ పూజ (జార్ఖండ్), ఇంద్రజాత్ర (సిక్కిం), నవరాత్రి స్థాపన (రాజస్థాన్), దుర్గా పూజ (బెంగాల్, అసోం, త్రిపుర) వంటి పండుగల సందర్భంగా బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. వారాంతపు సెలవులు ఇవే సెప్టెంబర్ 7, 14, 21, 28 తేదీల్లో ఆదివారాలు. సెప్టెంబర్ 13 (రెండో శనివారం), సెప్టెంబర్ 27 (నాలుగో శనివారం). బ్యాంకు శాఖలు మూసి ఉన్నప్పటికీ ఆన్‌లైన్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం సేవలు యథావిధిగా 24 గంటలూ అందుబాటులో ఉంటాయి.

# వచ్చే యేడాదే జియో ఐపిఓ

వాణిజ్యం

## ఎజిఎంలో ముకేష్ అంబానీ వెల్లడి




**ముంబయి, ఆగస్టు 29:** జియో పబ్లిక్ ష్యూ 2026 తొలి అర్ధభాగంలో రానున్నట్లు ఆ కంపెనీ ఛైర్మన్ ముకేష్ అంబానీ వెల్లడించారు. ఈ మేరకు 48వ వార్షిక సాధారణ సమావేశం (ఎజిఎం)లో శుక్రవారం ప్రకటించారు. రిలయన్స్ జియో 500 మిలియన్ల వినియోగదారుల మైలురాయిని దాటిందని తెలిపారు. రిలయన్స్ గత 3 సంవత్సరాలలో రూ. 5.6 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టిందని చెప్పారు. వార్షిక ఆదాయంలో 125 బిలియన్లను దాటిన భారతదేశంలో మొట్టమొదటి సంస్థగా అవతరించిందని పేర్కొన్నారు. జియో ఐపిఓ దాఖలు చేయడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయ్. ఈ విషయాన్ని ప్రకటించడం నాకు గర్వకారణం. 2026 మొదటి అర్థభాగం నాటికి జియోను స్టాక్‌మార్కెట్లో లిస్ట్ చేయాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాం. గ్లోబల్ కాంపిటీటర్స్‌కు మించిన విలువను మన జియో సృష్టించగలదని నేను మీకు హామీ ఇస్తున్నానని ముకేష్ అంబాని భరోసా ఇచ్చారు. ఎజిఎంలో ముకేష్ అంబానీ జియో భవిష్యత్ ప్రణాళికలను ప్రకటించారు. జియో భవిష్యత్ కోసం గొప్ప ఆశయాలతో కూడిన ప్రణాళికలు ఉన్నాయి. ఇవి ఐదు హామీలపై ఆధారపడి ఉన్నాయి. అవి ఏమిటంటే, 1. జియో ప్రతి భారతీయుడిని మొబైల్, హోమ్ బ్రాడ్‌బ్యాండ్‌తో కనెక్ట్ చేస్తుంది. జియో ప్రతి భారతీయ గృహాన్ని జియో స్మార్ట్ హోమ్, జియో టీవీ ప్లస్, జియో టీవీ ఓఎస్, సీమ్‌లెస్ ఆటోమేషన్ లాంటి డిజిటల్ సేవలతో శక్తిమంతం చేస్తుంది.

జియో ప్రతి భారతీయ వ్యాపారాన్ని డిజిటలైజ్ చేస్తుంది. సరళమైన, సురక్షితమైన, స్కేలబుల్ ప్లాట్ ఫామ్‌లతో ఇండియన్ బిజినెస్‌లను అనుసంధానం చేస్తుంది. జియో భారత్‌లో ఎఐ విప్లవాన్ని సృష్టిస్తుంది. మా నినాదం అందరికీ ప్రతిచోటా ఎఐ. జియో తన సొంత టెక్నాలజీతో భారత్ వెలుపల కూడా తన కార్యకలాపాలను నిర్వహిస్తుంది. అంటే ప్రపంచ వ్యాప్తంగా జియో సేవలను విస్తరిస్తుంది. జియో ఇప్పటి వరకు చేసిన ప్రయాణం కంటే, ఇక ముందు పయనించాల్సిన మార్గం మరింత ప్రకాశవంతంగా ఉంటుందని ముకేష్ అంబానీ అన్నారు. జియోకు 500 మిలియన్ల కస్టమర్లు రిలయన్స్ జియో మరో వారంలో 10వ సంవత్సరంలోకి అడుగుపెడుతుంది.

ఈ సమయంలో జియో కుటుంబం 500 మిలియన్ కస్టమర్లను దాటిందని చెప్పడానికి నేను గర్వపడు తున్నట్లు ముకేష్ అంబానీ అన్నారు. అంతేకాదు భారత్‌లో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఆధార్, జియో వంటి ఇనీషియేటివ్‌లతో జియో పునాది వేసిందని ముకేశ్ అంబానీ పేర్కొన్నారు భారత్‌లో ఎక్కడి నుంచైనా ఉచితంగా వాయిస్ కాల్స్ చేసేందుకు జియో వీలు కల్పించింది. కోట్లాది మంది భారతీయులకు మొబైల్ ఫోన్‌లో విడియోలను చూడడం అలవాటుగా మార్చింది. ఆధార్, యూపిఐ లాంటి వాటితో సహా భారతదేశ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు జియో పునాది వేసింది. భారత డిజిటల్ ఎకో సిస్టమ్‌ను సృష్టించడానికి జియో వీలుకల్పిస్తుంది. 100 కంటే ఎక్కు యూనికార్న్‌లకు మద్దతు ఇస్తూ భారత దేశంలో, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను నిర్మించడంలో జియో సహాయపడింని ముకేష్ అంబానీ పేర్కొన్నారు.

# రాష్ట్రాల రాబడికి జిఎస్టీ సవరణల గండి!

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** జిఎస్టీ మండలి ఈసారి నిర్వహించిప సమావేశం అత్యంత కీలకంగా మారనుంది. మంత్రుల బృందం అందించిన సర్వే నివేదికలు ఆమోదించడంతోపాటు రెండే రెండు శ్లాబులుగా నిర్ణయంచి ఆమోదించడం కూడా కీలకమే.




అయితే ఈ శ్లాబులవల్ల రాష్ట్రాల ఆదాయాలకు గండిపడుతుందేమోనని కలవరం వ్యక్తం అవుతోంది. కేవలం రెండు శ్లాబులు మాత్రమే ఇకపై ఉంటాయని ప్రధాని మోడీ ఇప్పటికే ప్రకటించారు. దీనికి సంబంధించి ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రతిపాదనను కౌన్సిల్‌కు పంపినట్లు తెలుస్తోంది. ఈ కొత్త విధానం వల్ల రాష్ట్రాలకు ఆదాయం తగ్గుతుందేమోనని కొన్ని రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఒకవేళ ఆదాయం తగ్గితే, దాన్ని భర్తీ చేయడానికి ఒక మార్గం ఉండాలని రాష్ట్రాలు కోరుతున్నాయని కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్. బాలగోపాల్ చెప్పారు. 8నెలల తర్వాత జిఎస్టీ మండలి సమావేశాలు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం జిఎస్టీ కౌన్సిల్ కనీసం మూడు నెలలకు ఒకసారి సమావేశం కావాలి. కానీ డిసెంబర్ 2024లో జరిగిన చివరి సమావేశం తర్వాత, ఇప్పుడు సుమారు ఎనిమిది నెలల తర్వాత ఈ కొత్త సమావేశం జరుగుతోంది. ప్రస్తుతం రేట్లు సవరించడం వల్ల సిమెంట్‌పై ప్రస్తుతం ఉన్న 28శాతం జిఎస్టీ రేటును 18శాతానికి తగ్గించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. ఈ తగ్గింపు నిర్మాణ రంగానికి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఊతమిస్తుంది. వ్యక్తులు కొనుగోలు చేసే టర్మ్ ఇన్సూరెన్స్, ఆరోగ్య బీమా పాలసీలపై జిఎస్టీని పూర్తిగా రద్దుచేసే ప్రతిపాదన కూడా కౌన్సిల్ ా+ముందుకు రానుంది. సెలూన్‌లపై విధించే 18శాతం జీఎస్టీని 5శాతానికి తగ్గించవచ్చని అంచనా. ఆహార, వస్త్ర వస్తువులన్నింటినీ 5శాతం పన్ను శ్లాబ్‌లోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. ఇది ఆహార, వస్త్ర పరిశ్రమలలో వర్గీకరణ సమస్యలను తొలగించి, పన్ను విధానాన్ని మరింత సులభతరం చేస్తుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.